

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



ఆదివారం | 12-5-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 26 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: పంచమి రా. 2.04 తదుపరి షష్టి; నక్షత్రం: ఆర్ద్ర ఉ. 10.26 తదుపరి పునర్వసు; వర్జ్యం: రా.10.54-12.34; దుర్ముహూర్తం: సా.4.52-5.44; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.47; సూర్యాస్తమయం: 6.35 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కామారెడ్డి రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రియాంక గాంధీ



మోదీ ఓటమికి నాంది

ఆ చైతన్యాన్ని రాష్ట్ర ప్రజలు చాటిచెప్పాలి.. ప్రధాని అబద్ధాలకోరు

- పదేళ్లలో చేసిందేమిటో చెప్పలేక.. కన్నీళ్లు
- ప్రాణాలు పోయినా రాజ్యాంగం మార్పునకు భారతీయులు అంగీకరించరు
- మార్చడానికి అది మోదీ రాసిన రాజ్యాంగమా?
- ప్రజల మీద ఏఏ (అదానీ, అంబానీ) ట్యాక్స్
- మా కుటుంబానికి తెలంగాణతో తరతరాల అనుబంధం.. నేను మీ సోదరిని
- దేశం కోసం కాంగ్రెస్‌ను గెలిపించండి
- తాండూరు, కామారెడ్డి సభల్లో ప్రియాంక

హైదరాబాద్, కామారెడ్డి, మే 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ ఓటమి తెలంగాణ నుంచే ప్రారంభం కావాలని... కాంగ్రెస్‌కు ఓటువేసి ఇండియా కూటవిని గెలిపించాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ పిలుపునిచ్చారు. ఇప్పుడిప్పుడే దేశంలో మార్పు వస్తోందని, బీజేపీ ప్రభుత్వం వద్దని, మోదీ పాలనను అంతమొందించాలని ప్రజలు భావిస్తున్నారన్నారు. పదేళ్ల మోదీ పాలనలో దేశంలోని

మిగతా 14వ పేజీలో...



మతచిచ్చుకు మోదీ యత్నం

- మునుపెన్నడూ లేని విధంగా విద్వేష కుట్రలు
- అల్లర్లతో పెట్టుబడులు వెనక్కి వెళ్లే ప్రమాదం
- ప్రాజెక్టుల్లో ప్రజలను ముంచిన దుర్మార్గుడు
- వెంకట్రామారెడ్డి.. అతడికి బీఆర్ఎస్ టికెటా?
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజం

14

షర్మిలను ఆశీర్వదించండి

ఎంపీగా గెలిపించండి

- కడప నియోజకవర్గ ప్రజలకు విజయలక్ష్మి పిలుపు
- అమెరికా నుంచి వీడియో సందేశం
- ఇది వైసీపీకి ఎదురుదెబ్బే రాజకీయ విశ్లేషకులు

13



కాంగ్రెస్‌కు మజ్లిస్ మద్దతు

- హైదరాబాద్ మినహా మిగతా స్థానాల్లో కాంగ్రెస్‌కు ఓటేయాలని ఒవైసీ సంకేతం
- కరీంనగర్, సికింద్రాబాద్ సహా ఏడు నియోజకవర్గాల్లో గంపగుత్తగా హస్తానికి ఓటు వేయాలని పిలుపు
- ఇవి 'మామూ' ఎన్నికలు కావని స్పష్టీకరణ

15





75 ఏళ్లు నిండినా.. మోదీనే ప్రధాని

- రిటైర్ అవ్వాలనేది బీజేపీ రాజ్యాంగంలో లేదు
- ఆర్ఆర్ ట్యాక్స్ అంటే.. రేవంత్-రాహుల్ ట్యాక్స్
- గ్యారెంటీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- సర్జికల్ స్ట్రైక్స్‌ను సీఎం రేవంత్ ప్రశ్నిస్తున్నారు
- నా ఫేక్ వీడియోతో ఆయన తప్పు చేశారు
- పాలమూరు-రంగారెడ్డి కూడా అవినీతి ప్రాజెక్టే
- కేజ్రీవాల్‌కు సుప్రీం క్లీన్‌చీట్ ఇవ్వలే: అమిత్ షా


వికారాబాద్ సభలో ప్రసంగిస్తున్న అమిత్ షా. చిత్రంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్/మహబూబ్‌నగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): "మోదీకి 75 ఏళ్ల వయసు దాటాక ప్రధాని ఎవరని ప్రశ్నిస్తున్నారు. 75 ఏళ్లు దాటినా మోదీనే ప్రధానిగా ఉంటారు. 75 ఏళ్ల వయసు దాటిన తర్వాత రాజకీయాల నుంచి రిటైర్ అవ్వాలని బీజేపీ రాజ్యాంగంలో ఎక్కడా లేదు" అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టంచేశారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మోదీ రిటైర్ అవుతారా? అంటూ చేసిన వ్యాఖ్యలపై అమిత్‌షా ఈ మేరకు స్పందించారు. మోదీ రిటైర్ అవుతారంటూ ఇండీ కూటమి సంతోషించాల్సిన అవసరమే లేదన్నారు. "మోదీ మూడో టర్మ్ కూడా పూర్తిస్థాయిలో సేవలందిస్తారు. ఆయనతోనే దేశం సుభిక్షంగా ఉంటుంది. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి పథంలో నిలపాలనేది మోదీ లక్ష్యం. కానీ, దేశాన్ని ముక్కలు చేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది" అని వ్యాఖ్యానించారు. శనివారం వికారాబాద్, వనపర్తి జిల్లా కేంద్రాల్లో జరిగిన బీజేపీ జనసభల్లో, హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అమిత్‌షా మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కుటిలనీతికి పాల్పడుతోందని మండిపడ్డారు. "రిజర్వేషన్లను తొలగిస్తామని

మిగతా 12వ పేజీలో...

కేసీఆర్.. దేశద్రోహి

- ఇంటెలిజెన్స్ డేటాను ధ్వంసం చేయించారు
- ఆయన్ను కాంగ్రెస్ సర్కార్ అరెస్టు చేయలేదేం?
- నన్ను ఓడించేందుకు ఏ, బీ, సీ గ్యాంగ్ కుట్ర
- నేను ఓడిపోతే హిందూత్వపై నోరెత్తను
- లేదంటే బీఆర్ఎస్‌ను కేసీఆర్ మూసేస్తారా?
- స్ట్రైక్స్ చేసిన జవాన్లను సీఎం అవమానించారు
- కాంగ్రెస్‌కు ఓటేస్తే మిగిలేది గాడిద గుడ్డే: బండి
- కరీంనగర్, సిరిసిల్లలో బీజేపీ బైక్ ర్యాలీలు

12

ఈ ఎన్నికలు దేనికి రెఫరెండం?

- కాంగ్రెస్ అవినీతికా? ఆర్ఆర్ ట్యాక్స్‌కా ?
- కేసీఆర్ లాగే రేవంత్ ప్రమాదకారి: కిషన్‌రెడ్డి

ఆంధ్రులకు ఆ విజ్ఞత ఉండదా?



తెలుగునాట అధికార, ప్రతిపక్ష నాయకులు, జాతీయ స్థాయి నాయకులు కూడా అర్ధసత్యాలు, అసత్యాలతో ప్రజలను ఊదరగొట్టారు. ప్రధాని మోదీ తెలంగాణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం ఈ ఎన్నికల్లో విశేషం. గత ఎన్నికల్లో తెలంగాణలో అనూహ్యంగా 4 సీట్లు గెలుచుకున్న బీజేపీ ఇప్పుడు మెజారిటీ స్థానాలు కైవసం చేసుకోవడానికి ఉవ్విళ్లూరుతుండగా.. అధికార కాంగ్రెస్ ఆధిపత్యం నిలుపుకొనే ప్రయత్నం చేస్తోంది. 5 నెలల క్రితం అధికారం కోల్పోయిన కేసీఆర్ ఒకటి రెండు స్థానాలైనా గెలుచుకొని పార్టీని కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయి ఐదు నెలలైనా వాస్తవంలోకి రాకుండా తెలంగాణను పాలించే సమర్థత తనకు మాత్రమే ఉందన్న భ్రమల్లో ఉన్న కేసీఆర్ బహిరంగ సభల్లో కూడా అదే విధంగా మాట్లాడారు. కేవలం ఐదు నెలల వ్యవధిలో తెలంగాణ రాష్ట్రం సర్వనాశనం అయిందని ప్రచారం చేయడం ఆయన అతి విశ్వాసానికి నిదర్శనం. ఇటీవల ఆయన చేస్తున్న వ్యాఖ్యలను బట్టి కేసీఆర్‌లో అహంభావం తొలగిపోలేదని అనిపిస్తోంది.

తెలంగాణలో ఈ ఎన్నికలు రాజకీయ పార్టీలకు కీలకం కాగా ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఎన్నికలు ఆ రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయి. తమ పిల్లలకు మంచి భవిష్యత్తు కావాలో, తాత్కాలిక తాయిలాలతో సంతృప్తిపడిపోవడమో అన్నది తేల్చుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు ఏపీ పౌరులపై ఉంది. రాజ్యం వీర భోజ్యం అన్నట్టుగా జగన్ పాలన సాగింది. రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే కాదు- ప్రభుత్వ చర్యలను తప్పుబట్టిన వారు కూడా వేధింపులకు, నిర్బంధాలకు గురయ్యారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్ పరిస్థితి ఏమిటో? అన్న ఆందోళన కలగకమానదు.

ఏపీ విడిపోయి పదేళ్లవుతోంది. ఇప్పటికీ రాజధాని అంటే ఇదీ అని చెప్పుకోలేని దుస్థితి కల్పించిన జగన్‌ను నెత్తిన పెట్టుకోవాలా? లేదా? అన్నది ఆంధ్రులు ఆలోచించుకోవాలి. జగన్ అధికారంలోకి వస్తే రాజధాని నిర్మాణం ఆగిపోతుంది, పోలవరం ప్రాజెక్టు మూలనపడుతుంది, అభివృద్ధి అడుగంటిపోతుంది, అరాచకం ప్రబలుతుంది అని 2019 ఎన్నికల సందర్భంగా బాధ్యతగల మీడియాగా మేం చెప్పాం. ఇప్పుడదే జరిగింది. సంక్షేమం పేరిట జనానికి ముష్టి వేస్తూ సహజ వనరులను చెరపట్టి అపర కుబేరులుగా అధికారంలో ఉన్న వారు అవతరిస్తున్నారని ప్రజలు గుర్తించాలి.

ఈ ఎన్నికలు ప్రజల తలరాతను మార్చబోతున్నందున ప్రజలు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకొని ఓటు వేయాలి. కులమతాలకు అతీతంగా రాష్ట్రం హితవు కోరే వారు సంఘటితం కావాలి. తెలంగాణలో అహంకారంతో వ్యవహరించిన కేసీఆర్‌ను అక్కడి ప్రజలు ఇంటికి పంపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆ మాత్రం విజ్ఞత ఉండదా?

4

ష్.. గప్‌చుప్!

- 3 వారాల హోరాహోరీ ప్రచారానికి తెర
- హైలైట్‌గా నిలిచిన 'గాడిద గుడ్డు'
- సుడిగాలిని మరిపించిన సీఎం రేవంత్
- మోదీ గ్యారెంటీనే బీజేపీ ట్రంపు కార్డు
- తేలిపోయిన బీఆర్ఎస్ ప్రచారాంశాలు


ప్రచార బ్యానర్లు తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

14

13న సెలవు ఇవ్వని సంస్థలపై చర్యలుంటాయ్

- అమల్లోకి 144 సెక్షన్.. ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం
- ఇప్పటిదాకా రాష్ట్రవ్యాప్తంగా రూ.350 కోట్ల సొత్తు సీజ్
- సీఈవో వికాస్ రాజ్ వెల్లడి.. 73వేల మందితో బందోబస్తు: డీజీపీ

13

నేను సైతం ప్రధాని రేసులో!!

- కేంద్రంలో ప్రాంతీయ పార్టీల కూటమిదే అధికారం
- ఆ పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నా
- బీజేపీకి రాష్ట్రంలో ఒకటి లేదా సున్నా సీట్లు
- ఆ పార్టీకి దక్షిణాదిన 10 సీట్లకు మించి రావు
- మాకు 12-14 సీట్లు.. కాంగ్రెస్‌కు 9చోట్ల 3వ స్థానమే
- బీఆర్ఎస్‌కు 14 సీట్లిస్తే తెలంగాణ తడాఖా చూపిస్తాం
- అసెంబ్లీలో నా ప్రళయతాండవం చూస్తారు.. ఆగస్టు 15లోగా రుణమాఫీ అసాధ్యం
- మా జాతీయ రాజకీయ ప్రస్థానం కొనసాగుతుంది.. మహారాష్ట్రలోనూ పోటీ: కేసీఆర్

12



నేటి మ్యాచ్‌లు

చెన్నై x రాజస్థాన్	మ.3.30 గం. నుంచి
బెంగళూరు x ఢిల్లీ	రాత్రి 7.30 గం. నుంచి

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లి (బెంగళూరు)	బుమ్రా (ముంబై)
634 (12	20 (13 మ్యాచ్‌లు)




పంత్‌పై ఓ మ్యాచ్ సస్పెన్షన్



న్యూఢిల్లీ: ప్లేఆఫ్స్ చేరాలంటే మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో కచ్చితంగా గెలవాల్సిన క్లిష్ట పరిస్థితుల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు షాక్ తగిలింది. ఆ జట్టు కెప్టెన్ రిషభ్ పంత్‌పై భారీ జరిమానాతోపాటు ఓ మ్యాచ్ సస్పెన్షన్‌ను విధించారు. డీసీ జట్టు ఇప్పటికే రెండుసార్లు స్లో ఓవర్ రేట్‌కు పాల్పడగా, గత మంగళవారం రాజస్థాన్‌పై కూడా పునరావృతమైంది. దీంతో ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘించినందుకు పంత్‌కు రూ.30 లక్షల జరిమానాతోపాటు ఓ మ్యాచ్ నిషేధం విధించారు. అలాగే ఇతర ఆటగాళ్లు కూడా రూ.12 లక్షలు లేదా మ్యాచ్ ఫీజులో 50శాతం.. వీటిలో ఏది తక్కువైతే దానిని ఫైన్‌గా కట్టాల్సి ఉంటుందని పాలకమండలి వెల్లడించింది. మరోవైపు ఢిల్లీ జట్టు మ్యాచ్ రెఫరీ నిర్ణయాన్ని సవాల్ చేసినా ఫలితం లేకపోయింది. కాగా ఆదివారం బెంగళూరు జట్టుతో జరిగే మ్యాచ్‌కు పంత్ స్థానంలో అక్షర్ పటేల్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించారు.

అమన్‌కు పారిస్ బెర్త్

పూనియా అవుట్
ఒలింపిక్ క్వాలిఫయింగ్ రెజ్లింగ్ టోర్నీ

ఇస్తాంబుల్ (టర్కీ): స్టార్ రెజ్లర్ దీపక్ పూనియా పారిస్ ఒలింపిక్ ఆశలు గల్లంతయ్యాయి. ఇక్కడ జరుగుతున్న ఒలింపిక్ వరల్డ్ క్వాలిఫయింగ్ టోర్నీ తొలి రౌండ్‌లో ఓడి విశ్వక్రీడల అవకాశాన్ని అతడు చేజార్చుకున్నాడు. మరోవైపు యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ అంచనాలను నిలబెట్టుకొని 57 కి. విభాగంలో సెమీస్‌లో నెగ్గి పారిస్ టిక్కెట్ దక్కించుకున్నాడు. శనివారం రాత్రి జరిగిన సెమీస్‌లో అమన్ 12-2తో చాంగ్‌సాంగ్ హన్ (ఉత్తరకొరియా)ను చిత్తు చేసి విశ్వక్రీడలకు అర్హత సాధించాడు. 65కి.ల సెమీస్‌లో సుజీత్ కల్‌కల్ 1-6తో మంగోలియాకు చెందిన బలమైన ప్రత్యర్థి తుల్గా చేతిలో ఓడిపోయాడు. అయితే ఆదివారం అతడు రెండు బౌట్లలో విజయం సాధిస్తే పారిస్ బెర్త్ లభిస్తుంది. తొలి బౌట్‌లో యుషెన్ లిన్ (చైనా)పై ఆధిక్యంలో ఉండీ 4-6తో దీపక్ పూనియా పరాజయం పాలయ్యాడు. 57 కేజీల విభాగంలో అమన్ మొదటి బౌట్‌లో 10-4తో వాలెంటినోవ్‌ను చిత్తు చేశాడు.

కోల్‌కతాదే

ప్లేఆఫ్స్‌లో చోటు
ముంబై ఇండియన్స్‌పై విజయం
రాణించిన వెంకటేశ్ అయ్యర్

తొలి అడుగు

1
టీ20 క్రికెట్‌లో అత్యధిక డకౌట్లు (44) అయిన బ్యాటర్‌గా సునీల్ నరైన్



కోల్‌కతా: అత్యంత రసవత్తరంగా సాగుతున్న తాజా ఐపీఎల్‌లో ఎట్టకేలకు ప్లేఆఫ్స్‌లో చేరిన తొలి జట్టేదో తేలిపోయింది. వరుసగా నాలుగు విజయాలతో జోరు చూపిన కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇతర టీమ్స్‌కన్నా ముందే బెర్త్ దక్కించుకుంది. శనివారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ 18 రన్స్ తేడాతో నెగ్గింది. దీంతో 18 పాయింట్లతో ఈ జట్టు అధికారికంగా ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. భారీ వర్షం కారణంగా రాత్రి 9.15 గంటలకు ఆరంభమైన మ్యాచ్‌ను 16 ఓవర్లకు కుదించారు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లకు 157 పరుగులు చేసింది. వెంకటేశ్ అయ్యర్ (21 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 42), నితీశ్ రాణా (23 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 33) రాణించారు. పీయూష్, బుమ్రాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ముంబై 16 ఓవర్లలో 8 వికెట్లకు 139 పరుగులు చేసి ఓడింది. ఇషాన్ (22 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 40), తిలక్ (17 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 32) మాత్రమే ఆకట్టుకున్నారు. వరుణ్, రస్సెల్, హర్షిత్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

ఓపెనర్లదే పోరాటం: ముంబై ఇండియన్స్ తమ ఛేదనను దీటుగానే ఆరంభించింది. ఓపెనర్లు ఇషాన్, రోహిత్ (19) తొలి వికెట్‌కు 65 పరుగులు జోడించారు. అయితే మొదటి ఏడు ఓవర్ల వరకే జట్టు పోటీలో ఉంది. ఇషాన్ నిష్క్రమణ తర్వాత ఒక్కసారిగా తడబడి మూల్యం చెల్లించుకుంది. ఓపెనర్ల ధాటికి పవర్‌ప్లేలోనే జట్టు 59 పరుగులు సాధించింది. నాలుగో ఓవర్‌లో 4,4,6తో 15 రన్స్ రాబట్టిన ఇషాన్, ఆ వెంటనే నరైన్ ఓవర్‌లోనూ 4,6తో ఆకట్టుకున్నాడు. అయితే ఆత్మవిశ్వాసంతో కనిపించిన ఇషాన్‌ను నరైన్, రోహిత్‌ను మరో స్పిన్నర్ వరుణ్ వరుస ఓవర్లలో అవుట్ చేయడంతో పతనం ఆరంభమైంది. సూర్యకుమార్ (11), కూడా ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. ఈ సమయంలో రన్‌రేట్ పెరిగిపోవడంతో ఒత్తిడికి లోనైన హార్దిక్ (2), డేవిడ్ (0) వికెట్లను చేజార్చుకున్నారు. 14వ ఓవర్‌లో తిలక్ 4,6,4తో 16 రన్స్. 15వ ఓవర్‌లో నమన్ (17) 6,6,4తో 19 రన్స్ అందించారు. దీంతో 6 బంతుల్లో 22 పరుగులు కావాల్సి ఉండగా.. పేసర్ హర్షిత్ తొలి మూడు బంతుల్లోనే నమన్, తిలక్ వికెట్లు తీసి షాకిచ్చాడు.

ఆదుకున్న వెంకటేశ్: టాస్ కోల్పోయి కోల్‌కతా బ్యాటింగ్‌కు దిగగా.. సూపర్ ఫామ్‌లో ఉన్న ఓపెనర్లు సాల్ట్ (6), నరైన్ (0) తొలి రెండు ఓవర్లలోనే వెనుదిరిగారు. పేసర్లు తుషార, బుమ్రా ఈ వికెట్లు తీశారు. అటు వెంకటేశ్ అయ్యర్ మాత్రం ఎదురుదాడితో బౌలర్లపై ఒత్తిడి పెంచాడు. వేగంగా పరుగులు సాధించాలన్న లక్ష్యంతో బ్యాటింగ్ సాగించి రెండు కీలక భాగస్వామ్యాలు అందించాడు. నాలుగో ఓవర్‌లో అతడు 4,6,4తో 15 రన్స్ సమకూర్చాడు. కెప్టెన్ శ్రేయాస్ (7) ఐదో ఓవర్‌లోనే అవుట్ కావడంతో మూడో వికెట్‌కు 30 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక సీజన్‌లో తొలిసారి స్థానం దక్కించుకున్న నితీశ్ రాణా వేగం కనబరుస్తూ ఎనిమిదో ఓవర్‌లో 4,6తో ఆకట్టుకున్నాడు. తర్వాతి ఓవర్‌లోనే వెంకటేశ్‌ను స్పిన్నర్ చావ్లా దెబ్బతీశాడు. ఐదో వికెట్‌కు వీరు 37 పరుగులు అందించారు. ఆ తర్వాత బరిలోకి దిగిన రస్సెల్ కూడా వేగంగా ఆడుతూ చావ్లా ఓవర్లలో భారీ షాట్లతో చెలరేగాడు. అయితే 12వ ఓవర్‌లో రెండు ఫోర్లతో జోరు మీదున్న రాణా.. తిలక్ వర్మ నేరుగా విసిరిన త్రోతో పెవిలియన్‌కు చేరాల్సి వచ్చింది. దీంతో ఐదో వికెట్‌కు 39 పరుగుల భాగస్వామ్యానికి తెర పడింది. ఇక చావ్లా ఓవర్‌లో మరో సిక్సర్ బాదిన రస్సెల్‌ను అతడే పెవిలియన్‌కు చేర్చగా కేకేఆర్ 125/6తో నిలిచింది. ఆ తర్వాత రింకూ (20) క్రీజులో ఉన్నా చివరి మూడు ఓవర్లలో 32 పరుగులే సాధించగలిగింది. ఆఖరి ఓవర్‌లో బుమ్రా.. రింకూ వికెట్ తీయగా, అటు కోల్‌కతా 150+ స్కోరుతో పర్వాలేదనిపించింది.

స్కోరుబోర్డు

కోల్‌కతా: సాల్ట్ (సి) కాంబోజ్ (బి) తుషార 6, నరైన్ (బి) బుమ్రా 0, వెంకటేశ్ (సి) సూర్య (బి) చావ్లా 42, శ్రేయాస్ (బి) కాంబోజ్ 7, రాణా (రనౌట్/తిలక్ వర్మ) 33, రస్సెల్ (సి) కాంబోజ్ (బి) చావ్లా 24, రింకూ (సి) ఇషాన్ (బి) బుమ్రా 20, రమణ్ దీప్ (నాటౌట్) 17, స్టార్క్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు : 6, మొత్తం: 16 ఓవర్లలో 157/7; వికెట్లపతనం:** 1-6, 2-10, 3-40, 4-77, 5-116, 6-125, 7-148; **బౌలింగ్:** తుషార 3-0-31-1, బుమ్రా 4-0-39-2, కాంబోజ్ 3-0-24-1, హార్దిక్ 3-0-32-0, చావ్లా 3-0-28-2.

ముంబై: ఇషాన్ (సి) రింకూ (బి) నరైన్ 40, రోహిత్ (సి) నరైన్ (బి) వరుణ్ 19, సూర్యకుమార్ (సి) రమణ్‌దీప్ (బి) రస్సెల్ 11, తిలక్ వర్మ (సి) సాల్ట్ (బి) హర్షిత్ 32, హార్దిక్ (సి) వైభవ్ (బి) వరుణ్ 2, డేవిడ్ (సి) శ్రేయాస్ (బి) రస్సెల్ 0 నేహల్ (రనౌట్/స్టార్క్-సాల్ట్) 3, నమన్ ధిర్ (సి) రింకూ (బి) హర్షిత్ 17, కాంబోజ్ (నాటౌట్) 2, చావ్లా (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు : 12, మొత్తం 16 ఓవర్లలో 139/8;వికెట్లపతనం :** 1-65, 2-67, 3-87, 4-91, 5-92, 6-117, 7-136, 8-137 ; **బౌలింగ్ :** వైభవ్ 2-0-16-0, స్టార్క్ 1-0-11-0, హర్షిత్ 3-0-34-2, నరైన్ 3-0-21-1, వరుణ్ 4-0-17-2, రస్సెల్ 3-0-34-2.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	12	9	3	0	18	1.428
రాజస్థాన్	11	8	3	0	16	0.476
హైదరాబాద్	12	7	5	0	14	0.406
చెన్నై	12	6	6	0	12	0.491
ఢిల్లీ	12	6	6	0	12	-0.316
లఖ్‌నవూ	12	6	6	0	12	-0.769
బెంగళూరు	12	5	7	0	10	0.217
గుజరాత్	12	5	7	0	10	-1.063
ముంబై	13	4	9	0	8	-0.271
పంజాబ్	12	4	8	0	8	-0.423



కళ్లన్నీ నీరజ్‌పైనే..

నేటినుంచి ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్

భువనేశ్వర్: చాలా సంవత్సరాల తర్వాత ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ స్టార్ కళ సంతరించుకుంటోంది. జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఆదివారం ఇక్కడ ప్రారంభమయ్యే ఈ నాలుగు రోజుల మీట్‌లో తలపడబోతున్నాడు. 2021 తర్వాత స్వదేశంలో ఓ చాంపియన్‌షిప్ బరిలో నీరజ్ తొలిసారి బరిలో దిగనుండడం విశేషం. 14న పురుషుల జావెలిన్ త్రో క్వాలిఫికేషన్ రౌండ్, 15న ఫైనల్ జరుగుతాయి. షాట్‌పుటర్ తజిందర్ పాల్ సింగ్ తూర్, కిశోర్ జెనా (జావెలిన్ త్రో), అమోజ్ జాకబ్, మహ్మద్ అజ్మల్ (పురుషుల 400మీ.), జస్విన్ ఆల్డ్రిన్ (పురుషుల లాంగ్ జంప్), ప్రవీణ్ చిత్రవేల్, అబూబాకర్ (పురుషుల ట్రిపుల్‌జంప్)తోపాటు తెలుగు రన్నర్ జ్యోతిశ్రీ దండిక మహిళల 4X400మీ. రిలేలో పాల్గొంటోంది.

అదే నా ఆఖరి టెస్ట్

ఇంగ్లండ్ పేసర్ అండర్సన్



లండన్: ఇంగ్లండ్ దిగ్గజ బౌలర్ జేమ్స్ అండర్సన్ తన సుదీర్ఘ టెస్ట్ కెరీర్‌కు వీడ్కోలు పలకనున్నాడు. జూలై 10 నుంచి లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్-వెస్టిండీస్ జట్ల మధ్య తొలి టెస్ట్ జరగనుంది. ఆ మ్యాచే తనకు చివరిదని 41 ఏళ్ల అండర్సన్ శనివారం వెల్లడించాడు. 'ఈ వేసవిలో లార్డ్స్‌లో విండీస్‌తో జరిగే టెస్టే నాకు ఆఖరిది' అని ఇన్‌స్టాలో అతడు ప్రకటించాడు. '20 ఏళ్లపాటు ఇంగ్లండ్‌కు ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉంది. బాల్యం నుంచే నాకు క్రికెట్ అంటే ఆసక్తి. ఇంగ్లండ్ జట్టును వీడనుండడం బాధాకరమే. కానీ నాలాగే ఇతర ఆటగాళ్లకు కూడా తమ కలను నెరవేర్చుకొనే అవకాశం ఇవ్వాలి' అని అండర్సన్ పేర్కొన్నాడు. 2003లో సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేసిన అండర్సన్ 187 టెస్ట్‌ల్లో 700 వికెట్లు పడగొట్టాడు.

రెండు విడతలుగా రంజీ ట్రోఫీ

- సీకే నాయుడులో టాస్ ఉండబోదు
- దేశవాళీ క్రికెట్‌లో ప్రక్షాళన



న్యూఢిల్లీ: ఈ ఏడాది నుంచి దేశవాళీ క్రికెట్‌లో మార్పులు చోటు చేసుకోనున్నాయి. దీనిలో భాగంగా రాహుల్ ద్రవిడ్, లక్ష్మణ్, అజిత్ అగార్కర్, బీసీసీఐ జీఎం అభయ్ కురువిల్లా నేతృత్వంలోని వర్కింగ్ గ్రూప్ తమ ప్రతిపాదనలను బోర్డు కార్యదర్శి జైషాకు సమర్పించింది. దీనిప్రకారం.. రంజీ ట్రోఫీ ఒకేసారి కాకుండా రెండు విడతలుగా నిర్వహించనున్నారు. అక్టోబరు రెండో వారం నుంచి ముందుగా ఐదు లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. అంతేకాకుండా మ్యాచ్‌ల మధ్య నాలుగు రోజులపాటు విరామం ఉంటుంది. నవంబరు మధ్య నుంచి జనవరి ఆరంభం దాకా సయ్యద్ ముస్తాక్ అలీ, విజయ్ హజారే ట్రోఫీ పరిమిత ఓవర్ల మ్యాచ్‌లు జరుగుతాయి. ఇవి ముగిశాక రంజీ ట్రోఫీ చివరి రెండు లీగ్ రౌండ్లతోపాటు నాకౌట్ మ్యాచ్‌లు కూడా మార్చి తొలి వారం వరకు జరుగుతాయి. ఇదిలావుండగా సీకే నాయుడు ట్రోఫీలో ప్రయోగాత్మకంగా టాస్‌ను ఎత్తివేయనున్నారు. దీంతో పర్యాటక జట్టుకు తమ ఇష్టప్రకారం బ్యాటింగ్ లేదా బౌలింగ్ తీసుకునే అవకాశం ఉంటుంది. ఇది సక్సెస్ అయితే రంజీల్లోనూ అమలు చేస్తారు.

కార్ల్‌సన్ చేతిలో అర్జున్ ఓటమి

వార్సా (పోలెండ్) : సూపర్ బెట్ చెస్ టోర్నీ బ్లిట్జ్ తొమ్మిదో రౌండ్‌లో వరల్డ్ నెం.1 మాగ్నస్ కార్ల్‌సన్ చేతిలో తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి పరాజయం పాలయ్యాడు. నల్లపావులతో బరిలోకి దిగిన అర్జున్‌పై 90 సుదీర్ఘ ఎత్తుల అనంతరం కానీ కార్ల్‌సన్ విజయం సాధించలేకపోయాడు. ఈ రౌండ్‌లో కీమర్ చేతిలో ప్రజ్ఞానంద కూడా పరాజయం చవిచూశాడు. అబుసత్తొరోవ్‌పై వీ, షెవ్‌చెంకోపై దుడా గెలుపొందగా, గుకేష్-అనీష్ గిరి మధ్య గేమ్ డ్రాగా ముగిసింది. తొమ్మిదో రౌండ్ ముగిసే సరికి.. వీ ఈ (20.5) అగ్రస్థానంలో నిలిచాడు. కార్ల్‌సన్ (18) రెండు, ప్రజ్ఞానంద (14.5) మూడు, అర్జున్ (14) నాలుగో స్థానంలో కొనసాగుతున్నారు. గుకేష్ (9.5) ఆఖరి స్థానంలో నిలిచాడు. ఆదివారం జరిగే మరో తొమ్మిది రౌండ్ల బ్లిట్జ్ గేమ్‌ల అనంతరం విజేతను నిర్ణయిస్తారు.

భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో

క్యూ1 విక్రయాల్లో 75% వాటా వీటిదే..

మళ్లీ చైనా కంపెనీలదే హవా



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం నిఘా కొనసాగుతున్నప్పటికీ దేశీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో చైనా బ్రాండ్ల హవా మళ్లీ పెరుగుతోంది. 2020 నాటి గరిష్ఠ స్థాయి నుంచి క్రమంగా తగ్గుతూ వచ్చిన చైనా కంపెనీల మొబైళ్ల అమ్మకాలు ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో మళ్లీ పెరిగాయి. 2020లో మార్చితో ముగిసిన మొదటి త్రైమాసికం (క్యూ1)లో నమోదైన స్మార్ట్‌ఫోన్ సేల్స్‌లో షామీ, వివో, ఒప్పో, రియల్‌మీ, ట్రాన్షన్‌తోపాటు గతంలో చైనా కంపెనీ కొనుగోలు చేసిన మోటోరోలా బ్రాండ్ల మొత్తం వాటా 77 శాతంగా ఉండగా.. 2023 క్యూ3 (జూలై-సెప్టెంబరు) నాటికి 61 శాతానికి తగ్గింది. కానీ, ఈ ఏడాది క్యూ1లో మళ్లీ 75 శాతానికి పెరిగిందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ తాజా నివేదిక వెల్లడించింది.

విక్రయాల విలువపరంగా తగ్గుముఖం..

స్మార్ట్‌ఫోన్ల విక్రయాల సంఖ్య పరంగా చైనా కంపెనీలదే మెజారిటీ వాటా అయినప్పటికీ, విక్రయాల విలువపరంగా వీటి వాటా మరింత తగ్గింది. 2020 క్యూ1లో నమోదైన ఫోన్ల విక్రయాల విలువలో చైనా బ్రాండ్ల వాటా 70 శాతంగా ఉండగా.. 2023 క్యూ1 నాటికి 50 శాతానికి తగ్గింది. 2024 క్యూ1లో 48 శాతానికి జారుకుంది. దేశీయ మార్కెట్లోనూ ప్రీమియమైజేషన్ (యాపిల్ ఐఫోన్, సామ్‌సంగ్ వంటి ఖరీదైన ఫోన్లకు గిరాకీ పెరుగుతుండటం) ట్రెండ్ ఊపందుకోవడం ఇందుకు కారణం.

క్యూ1 విక్రయాల్లో 5జీ ఫోన్లదే 70% వాటా

ఈ ఏడాది క్యూ1లో దేశీయ మార్కెట్లోకి సరఫరా అయిన మోడళ్లలో 5జీ ఫోన్ల వాటా ఆల్‌టైం రికార్డు స్థాయి 71 శాతానికి పెరిగిందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ వెల్లడించింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ సైట్లు భారీ డిస్కౌంట్లతో ఆకర్షిస్తున్నప్పటికీ, మొత్తం సరఫరాలో ఆఫ్‌లైన్ మార్కెట్ వాటానే 64 శాతమని పేర్కొంది. అంతేకాదు, ఈ జనవరి-మార్చి కాలానికి స్మార్ట్‌ఫోన్ల విక్రయాల్లో 19.20 శాతం మార్కెట్ వాటాతో చైనా బ్రాండ్ వివో అగ్రస్థానానికి చేరుకుంది. మరో చైనా బ్రాండ్ షామీ 18.80 శాతం మార్కెట్ వాటాతో రెండో స్థానంలో నిలవగా.. గత ఏడాది క్యూ1లో 20 శాతానికి పైగా మార్కెట్ షేర్‌తో టాప్ ప్లేస్‌లో ఉన్న దక్షిణ కొరియా కంపెనీ సామ్‌సంగ్.. ఈ క్యూ1లో 17.50 శాతం వాటాతో మూడో స్థానానికి పరిమితమైందని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ తెలిపింది.



బిజినెస్

గ్రామ స్థాయికి బీమా సేవల విస్తరణ

చర్యలకు శ్రీకారం చుట్టిన ఐఆర్‌డీఏఐ

న్యూఢిల్లీ: గ్రామీణ స్థాయికి జీవిత, ఆరోగ్య, థర్డ్ పార్టీ మోటార్ బీమా సేవలను విస్తరింపజేసేందుకు భారత బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా దేశంలో ఎంపిక చేసిన కొన్ని గ్రామ పంచాయితీలకు బీమా సేవలను విస్తరించాలని జీవిత, సాధారణ బీమా సంస్థలను ఐఆర్‌డీఏఐ ఆదేశించింది. పంచాయతీ రాజ్ శాఖతో సంప్రదించిన అనంతరం నియంత్రణ మండలి జారీ చేసిన మాస్టర్ సర్క్యులర్ ప్రకారం.. ప్రతి జీవిత లేదా సాధారణ బీమా సంస్థ మార్కెట్ వాటా లేదా ఇతర ప్రమాణాల ప్రకారంగా కనీసం ఎన్ని గ్రామాలకు తన సేవలను విస్తరించాల్సి ఉంటుందనే అంశాన్ని లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్, జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్‌లు నిర్ణయించనున్నాయి. ఆ తర్వాత నిర్దేశిత సంఖ్య మేరకు ఏయే రాష్ట్రాల్లోని గ్రామాల్లో తన సేవలను విస్తరించాలనుకునే అంశాన్ని మాత్రం బీమా సంస్థకే వదిలేయనునున్నాయి.

అమలు తీరు ఇలా..

ఎంపిక చేసుకున్న గ్రామ పంచాయతీలో ఎంత మంది వ్యక్తులు/జీవులు/వాహనాలకు బీమా కవరేజీ కల్పించామనే విషయాన్ని రికార్డు చేసి, సమాచారాన్ని పంచుకునేందుకు ప్రతి జీవిత, సాధారణ బీమా సంస్థ ప్రత్యేక యంత్రాగాన్ని ఏర్పాటు చేసుకోనుంది. గ్రామంలోని అందరు వ్యక్తులు, అన్ని వాహనాలకు బీమా కవరేజీ కల్పించే లక్ష్యంతో సదరు బీమా సంస్థ యంత్రాంగం ఆ గ్రామ సర్పంచ్ లేదా గ్రామ సచివాలయంతో కలిసి పనిచేయాల్సి ఉంటుందని బీమా నియంత్రణ మండలి పేర్కొంది. కొత్త నిబంధనలు ఈ ఆర్థిక సంవత్సరం నుంచే వర్తించనున్నాయి. 2047 నాటికి దేశ ప్రజలందరినీ బీమా సేవల పరిధిలోకి తీసుకురావాలని ఐఆర్‌డీఏఐ లక్ష్యంగా పెట్టుకుంది.

రిలయన్స్ క్యాపిటల్ టేకోవర్‌కు హిందూజాకు ఐఆర్‌డీఏఐ ఆమోదం

అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ క్యాపిటల్‌ను టేకోవర్ చేసేందుకు హిందూజా గ్రూప్ కంపెనీ ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ లిమిటెడ్ (ఐఐహెచ్‌ఎల్)కు ఐఆర్‌డీఏఐ షరతులతో కూడిన అనుమతి మంజూరు చేసింది. దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంగా రిలయన్స్ క్యాపిటల్‌ను రూ.9,650 కోట్లకు ఐఐహెచ్‌ఎల్ దక్కించుకుంది. అయితే, ఐఆర్‌డీఏఐ అనుమతితో రిలయన్స్ క్యాపిటల్‌కు చెందిన బీమా వ్యాపార అనుబంధ సంస్థలైన రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్, రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆస్తులను తమ గ్రూప్‌లోకి బదిలీ చేసుకునేందుకు ఐఐహెచ్‌ఎల్‌కు మార్గం సుగమమైంది.

ఒమెగా హాస్పిటల్ రూ.600 కోట్ల సమీకరణ !

ప్రైవేట్ ఈక్విటీ సంస్థలకు వాటా విక్రయించే యోచన

హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఒమెగా హాస్పిటల్స్ రూ.600 కోట్లు సమీకరించేందుకు సన్నాహాలు చేస్తోంది. అంకాలజీలో కీలక సేవలందిస్తున్న ఈ హాస్పిటల్ తన ఈక్విటీలో 10-15 శాతం వాటాను విక్రయించటం ద్వారా ఈ మొత్తాలను సమీకరించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్ ఈక్విటీ సంస్థ మోర్గాన్ స్టాన్లీ ప్రైవేట్ ఈక్విటీ.. ఒమెగా హాస్పిటల్‌లో ఈ వాటాను తీసుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. హాస్పిటల్ కార్యకలాపాల విస్తరణకు అవసరమైన నిధులను ఈ వాటా విక్రయించటం ద్వారా సమీకరించాలని ఒమెగా యోచిస్తున్నట్లు తెలుస్తోంది. 2010లో అంకాలజిస్ట్ డాక్టర్ మోహన వంశీ.. ఒమెగా హాస్పిటల్‌ను ప్రారంభించారు. హైదరాబాద్ సహా మరికొన్ని నగరాల్లో ఇప్పటికే హాస్పిటల్స్‌ను నిర్వహిస్తున్న ఒమెగా.. రానున్న రోజుల్లో తన కార్యకలాపాలను మరింతగా విస్తరించాలని భావిస్తోంది.

గత కొన్ని సంవత్సరాలుగా హాస్పిటల్ రంగంలో ప్రైవేట్ ఈక్విటీ సంస్థలు పెట్టుబడులు పెట్టడంతో పాటు కొన్ని బడా హాస్పిటల్స్ కూడా పెద్ద ఎత్తున హాస్పిటల్స్‌ను కొనుగోలు చేస్తూ వస్తున్నాయి. కొవిడ్ అనంతరం ప్రైవేట్ హెల్త్‌కేర్ రంగానికి అనూహ్యంగా డిమాండ్ పెరిగిపోవటంతో పాటు ఆదాయాలు గణనీయంగా వృద్ధి చెందటమే ఇందుకు కారణంగా ఉంది.

ఫార్చ్యూన్ 40 అండర్ 40 లిస్ట్‌లో అపోలో హాస్పిటల్స్ డైరెక్టర్ హర్షద్ రెడ్డి



న్యూఢిల్లీ: భారత పారిశ్రామిక రంగంలోని వర్ధమాన నాయకులకు (40 ఏళ్ల లోపు వారు) సంబంధించి ఫార్చ్యూన్ ఇండియా మేగజైన్ ఈ ఏడాదికి గాను '40 అండర్ 40' పేరుతో ఓ జాబితాను విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల నుంచి అపోలో హాస్పిటల్స్ డైరెక్టర్ హర్షద్ రెడ్డికి ఈ జాబితాలో చోటు దక్కింది. భారత కుబేరుడు ముకేశ్ అంబానీ కుమారుడు ఆకాశ్ అంబానీ (రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ ఛైర్మన్), కుమార్తె ఇషా అంబానీ (రిలయన్స్ రిటైల్ డైరెక్టర్)తోపాటు అల్లుడు ఆనంద్ పిరామల్ (పిరామల్ గ్రూప్ ఈడీ)కు కూడా ఈ లిస్ట్‌లో స్థానం లభించింది. అంతేకాదు, గౌతమ్ అదానీ కుమారుడు, అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీ, కుమార మంగళం బిర్లా కూతురు, స్వతంత్ర మైక్రోఫైనాన్స్ ఛైర్మన్ అనన్య బిర్లా సైతం జాబితాలో ఉన్నారు.

యూనియన్ బ్యాంక్ లాభం రూ.3,328 కోట్లు

క్యూ4లో 18 శాతం వృద్ధి
ఒక్కో షేరుకు 36 శాతం డివిడెండ్ సిఫారసు



యూబీఐ ఎండీ, సీఈఓ మణిమేఖలై

ముంబై: ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ).. గడిచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. మొండి బకాయిలకు కేటాయింపులు గణనీయంగా తగ్గటంతో జనవరి-మార్చి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన బ్యాంక్ నికర లాభం 18.38 శాతం వృద్ధితో రూ.3,328 కోట్లుగా నమోదైంది. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన నికర లాభం రూ.2,782 కోట్ల నుంచి రూ.3,311 కోట్లకు పెరిగింది. మరోవైపు మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంక్ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ.8,512 కోట్ల నుంచి రూ.13,797 కోట్లకు పెరిగింది. సమీక్షా త్రైమాసికంలో నికర వడ్డీ ఆదాయం 14.38 శాతం వృద్ధి చెంది రూ.9,437 కోట్లుగా నమోదైంది. రైటాఫ్ చేసిన కొన్ని పద్దుల నుంచి రికవరీలు నిలిచిపోవటంతో వడ్డీయేతర ఆదాయం 10 శాతం క్షీణించి రూ.4,707 కోట్లకు చేరుకుందని బ్యాంక్ తెలిపింది.

ఈ ఏడాది రుణ వృద్ధి రేటు 11-13 శాతం

కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో 11-13 శాతం రుణ వృద్ధి రేటును సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు యూబీఐ ఎండీ, సీఈఓ ఏ మణిమేఖలై తెలిపారు. మరోవైపు డిపాజిట్లలో కూడా 9-11 శాతం వృద్ధిని నమోదు చేయాలని చూస్తున్నట్లు పేర్కొన్నారు. 2023-24లో రికవరీలు రూ.18,000 కోట్లుగా ఉండగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.16,000 కోట్ల రికవరీలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గడచిన ఆర్థిక సంవత్సరంలో మొండి పద్దులు రూ.2,687 కోట్ల నుంచి రూ.3,202 కోట్లకు పెరిగినప్పటికీ.. కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవటంతో స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 7.53 శాతం నుంచి 4.76 శాతానికి తగ్గాయని వివరించారు. మరోవైపు 2024-25లో స్థూల ఎన్‌పీఏలను 4 శాతం దిగువకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రాజెక్ట్ ఫైనాన్స్‌కు సంబంధించి ఆర్‌బీఐ ఇటీవల తీసుకువచ్చిన ప్రతిపాదనలు బ్యాంక్ పనితీరుపై పెద్దగా ప్రభావం చూపించవని ఆమె తెలిపారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 250-300 శాఖలను ఏర్పాటు చేయాలని చూస్తున్నట్లు మణిమేఖలై తెలిపారు. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.3.60 (36 శాతం) డివిడెండ్‌ను బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

సీసీఎల్ ప్రాడక్ట్స్ ఆదాయం రూ.409 కోట్లు

హైదరాబాద్: సీసీఎల్ ప్రొడక్ట్స్. గడచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికానికి గాను స్టాండ్ఎలోన్ ప్రాతిపదికన రూ.409.10 కోట్ల ఆదాయంపై రూ.20.07 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2022-23) ఇదే త్రైమాసికంలో ఆదాయం రూ.332.41 కోట్లుగా ఉండగా లాభం రూ.50.30 కోట్లుగా ఉంది. సమీక్షా కాలంలో మొత్తం వ్యయాలు గణనీయంగా పెరగటంతో లాభం తగ్గింది. కాగా మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను మొత్తం ఆదాయం రూ.1,396.71 కోట్ల నుంచి రూ.1,461.76 కోట్లకు పెరిగినా లాభం మాత్రం రూ.175.36 కోట్ల నుంచి రూ.95.30 కోట్లకు తగ్గింది.

కాగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.2 తుది డివిడెండ్‌ను బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. గతంలో ప్రకటించిన రూ.2.50 మధ్యంతర డివిడెండ్‌ను కలుపుకుంటే మొత్తం ఆర్థిక సంవత్సరానికి రూ.4.50 డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించినట్టయింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,360 ▲	67,250 ▲	90,500 ▲
ముంబై	73,008 ▲	66,875 ▲	84,215 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	540
వరంగల్	532	గోదావరి	540
చిత్తూరు	608	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	140	గోదావరి	150
వరంగల్	140	విజయవాడ	150
కరీంనగర్	140	గుంటూరు	150
మహబూబ్‌నగర్	140	ఒంగోలు	150
కర్నూలు	140	చిత్తూరు	150
విశాఖపట్నం	142		

తెలంగాణలో ఈసారి క్లీన్ స్వీప్ చేస్తాం!

- రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలకు అభివృద్ధిపై విజన్ లేదు
- జగన్ మళ్లీ అధికారంలోకి రారు..
- ఆయన్ను ఎప్పుడూ మిత్రుడిగా భావించలేదు
- ఏపీలో ఎన్డీయేదే ప్రభుత్వం: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, మే 11: ఆంధ్రప్రదేశ్‌లోనే గాక తెలంగాణలోనూ బీజేపీకి సానుకూల పరిస్థితి ఉందని.. ఆ రాష్ట్రంలోనూ ఈసారి క్లీన్ స్వీప్ చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కొద్ది నెలల కిందట స్పష్టమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించారు. బీఆర్ఎస్‌పై ప్రజల్లో ఉన్న ఆగ్రహావేశాలు కాంగ్రెస్‌కు ఓట్లు తెచ్చిపెట్టాయని.. నిజానికి ప్రజలు ఆ పార్టీకి ఓటేద్దామని అనుకోలేదని ఓ వార్తాచానల్‌కు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రస్తుత ప్రభుత్వాలకు రాష్ట్రాభివృద్ధికి సంబంధించి స్పష్టమైన విజన్ గానీ, రోడ్‌మ్యాప్ గానీ లేవన్నారు. అభివృద్ధి దిశగా రెండు తెలుగు రాష్ట్రాలకు అనేక అవకాశాలు వచ్చాయని.. కానీ పాలక పార్టీల నేతలు తమలో తాము పోట్లాడుకోవడమో లేక కేంద్రంతో తగవు పడడమో చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో కనీసం 5 నుంచి 7 నగరాలను ఆధునిక వసతులతో తీర్చిదిద్దాల్సిన అవసరముందన్నారు. హైదరాబాద్ కేవలం రాష్ట్ర రాజధానే కాదని.. దానికి ప్రపంచ ఇమేజ్ ఉందని.. దానిని పరిరక్షిస్తూ మరింత అభివృద్ధి చేయాలన్నారు.

జగన్ మళ్లీ గెలవరు..

ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ఎప్పుడూ మిత్రపక్షంగా తాను పరిగణించలేదని ప్రధాని స్పష్టం చేశారు. ఆయన మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదన్నారు. అయితే కొన్ని అంశాలపై పార్లమెంటులో వైసీపీ ఎంపీలు తమకు మద్దతిచ్చిన మాట నిజమన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ కలిసి పోటీ చేస్తున్నాయని.. జనసేన కూడా తమతో ఉందని తెలిపారు. తమ ర్యాలీలు, రోడ్‌షోలకు వచ్చిన జనస్పందన చూశాక.. ఎన్డీయే ఆంధ్రలో మెజారిటీ లోక్‌సభ సీట్లు గెలుచుకోవడమే కాదు.. తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని నమ్మకంగా చెప్పగలను' అని ధీమా వ్యక్తం చేశారు.

రూ.2.07 కోట్ల గోవా మద్యం పట్టివేత

- ఏపీ ఎన్నికల్లో పంపిణీకి తరలిస్తున్న వైనం
- తెలంగాణ బాలానగర్‌లో పట్టివేత

మహబూబ్‌నగర్/బాలానగర్, మే 11: ఏపీ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు పెద్దఎత్తున గోవా మద్యం (నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్) తరలించేందుకు చేస్తున్న యత్నాలకు పాలమూరు పోలీసులు చెక్‌పెట్టారు. గోవా నుంచి రాజమండ్రికి సినీఫక్కీలో పలుచెక్‌పోస్టులు, పోలీస్ స్టేషన్లు దాటుకుంటూ తరలిస్తున్న 2000 మద్యం కాటన్లు ఉన్న లారీని మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ జాతీయ రహదారిపై పోలీసులు పట్టుకున్నారు. గోవాలో జాకబ్ అనే వ్యక్తి లారీలో రూ.2.07 కోట్ల విలువ చేసే 2000 కాటన్లలో 17280 లీటర్ల క్వార్టర్ సీసాల మద్యం రాజమండ్రికి తరలించేందుకు లారీలో లోడ్ చేసి పంపించారు. ముందస్తు సమాచారం రావడంతో శుక్రవారం అర్ధరాత్రి బాలానగర్ పోలీసులు, రంగారెడ్డి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో లారీ పట్టుకున్నారు. పైన ఎరువుల బస్తాలు, కింద మద్యం కాటన్లు ఉండడంతో మద్యం నిల్వలను సీజ్ చేసి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. దీనిపై దర్యాప్తు చేసి త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు.

ఓటేసి వద్దామని!

- హైదరాబాద్ నుంచి పయనమైన ఓటరు
- ప్రయాణికులతో బస్, రైల్వే స్టేషన్లు కిటకిట
- ఏపీ దారులు.. వాహనాలతో బారులు
- ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల్లో చార్జీల మోత



కేపీహెచ్‌బీ వద్ద బస్సుల కోసం వేచి ఉన్న ప్రజలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): భవితకు దారి చూపించే ఓటు హక్కును వినియోగించుకోవడానికి జనం ఊరి బాట పడుతున్నారు. ప్రభుత్వాల ఏర్పాటులో భాగమయ్యేందుకు తమకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి బాధ్యతగా కదులుతున్నారు. విద్య, ఉపాధి, ఇతర అవసరాల కోసం ఏ ప్రాంతంలో ఉంటున్నా.. ఓటు వేసి.. ప్రజాస్వామ్యాన్ని బలపరిచేందుకు సొంతూళ్లకు పయనమవుతున్నారు. ఓట్ల పండుగ కోసం పౌరులు పల్లె బాట పడుతుండటంతో హైదరాబాద్‌లోని బస్, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. రెండో శనివారం, ఆదివారాలతో పాటు సోమవారం పోలింగ్ సందర్భంగా వరుస సెలవులు రావడంతో జనం సొంతూళ్లకు బయలుదేరుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లతో పాటు జేబీఎస్, ఎంజీబీఎస్ వంటి ప్రధాన బస్ స్టేషన్లలో అడుగు పెట్టలేనంత రద్దీ ఉంది. బస్సు, రైలు రాగానే ప్రయాణికులు కిటికీల గుండా తోసుకుంటూ ఎక్కడం పరిస్థితిని తెలియజేస్తోంది. ఏపీకి వెళ్లే రైళ్లు ప్రయాణీకులతో కిటకిటలాడుతున్నాయి. పలు రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ చాంతాడంత ఉంది. దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు రిజర్వేషన్ కన్‌ఫర్మ్ కాకున్నా వెయిటింగ్ లిస్టు టికెట్లతోనే ప్రయాణిస్తున్నారు. మరికొందరు ప్రయాణానికి ఒక రోజు ముందుగా ఇచ్చే తత్కాల్ టికెట్ల కోసం రిజర్వేషన్ కౌంటర్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఏపీలో అసెంబ్లీతో పాటు లోక్‌సభ ఎన్నికలు కూడా జరుగుతుండటంతో అటు వైపు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. సంక్రాంతి పండుగ సమయంలో ఏపీకి వెళ్లే మార్గాల్లో ఎంతటి రద్దీ ఉంటుందో.. ప్రస్తుతం అలాంటి దృశ్యాలే ఆవిష్కృతమవుతున్నాయి. హైదరాబాద్ నుంచి ఏపీకి వెళ్లే దారులు బస్సులు, ప్రైవేటు వాహనాలతో నిండిపోయాయి. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద విజయవాడ వైపు వెళ్లే వాహనాలు బారులు తీరాయి. లక్షలాది మంది ఓటర్లు మహా నగరం నుంచి వివిధ ప్రాంతాలకు బయలుదేరడంతో శనివారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం ఏర్పడింది. నగరం నుంచి ఏపీకి వెళ్లేందుకు బస్సులు ఆగే మియాపూర్, కూకట్‌పల్లి, అమీర్‌పేట, లక్డీకాపూల్, ఎల్బీనగర్ తదితర బస్ స్టాపుల్లో ప్రయాణికుల రద్దీ కనిపించింది. కాగా, నగరంలో ఉండే ఏపీ ఓటర్లను పలు పార్టీల వారు దగ్గరుండి తీసుకెళుతున్నారు. బస్సు బయలుదేరే ముందు రూ.2,500 నగదు ఇస్తున్నారు. ఓటు వేశాక రూ.2,500 ఇస్తామని, తర్వాత బస్సులో నగరానికి తీసుకొస్తామని చెబుతున్నారు.

బస్సుల్లో చార్జీల బాదుడు..

హైదరాబాద్ నుంచి ఏపీకి డిమాండ్ పెరగడంతో టీఎస్ ఆర్టీసీ 30 నుంచి 50 శాతం వరకు చార్జీలు పెంచేసింది. రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. మరోవైపు, ప్రైవేట్ బస్సుల్లో ఆర్టీసీ చార్జీలకు రెండింతలు వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు హైదరాబాద్ నుంచి విజయవాడకు ఏసీ బస్సులో రూ.1,300 ఉండగా.. ప్రస్తుతం రూ.2,600 తీసుకుంటున్నారని పలువురు ఓటర్లు చెబుతున్నారు. నాన్ ఏసీ బస్సులో రూ.800 వసూలు చేస్తున్నారని వాపోతున్నారు.

సికింద్రాబాద్-విశాఖపట్నం ప్రత్యేక రైలు

ఓటు వేసేందుకు వెళ్లే వారి కోసం ఆదివారం సికింద్రాబాద్-విశాఖపట్నం(07097), సోమవారం విశాఖపట్నం-సికిందరాబాద్(07098) ప్రత్యేక రైలును నడుపుతున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. ఆది, సోమవారాల్లో సికిందరాబాద్, కాచిగూడ, లింగంపల్లి నుంచి గుంటూరు, తిరుపతి, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లి వచ్చే రైళ్లకు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు.

హీరో అల్లు అర్జున్‌పై కేసు నమోదు

- నంద్యాల ఎమ్మెల్యే రవిపై కూడా..

అనుమతి లేకుండా జనసమీకరణ

నంద్యాల, మే 11(ఆంధ్రజ్యోతి): సినీ హీరో అల్లు అర్జున్, నంద్యాల ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డిపై నంద్యాల రెండో పట్టణ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. అల్లు అర్జున్ శనివారం నంద్యాల ఎమ్మెల్యే రవి ఇంటికి వచ్చారు. సెలబ్రిటీలను తమ ప్రాంతాలకు ఆహ్వానించి జనసమీకరణ చేయాల్సి వస్తే సదరు పార్టీ అభ్యర్థులు ఎన్నికల అధికారుల నుంచి కచ్చితంగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే శిల్పా రవి ఇలాంటి అనుమతులు ఏమీ తీసుకోకుండా, అల్లు అర్జున్‌ను నంద్యాలకు ఆహ్వానించారు. ఈ సమయంలో అల్లు అర్జున్‌ను చూసేందుకు భారీ సంఖ్యలో వైసీపీ మద్దతుదారులు, అభిమానులు ఎగబడ్డారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకున్న ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పరిశీలించిన జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి బాధ్యులపై కేసు నమోదు చేయాలంటూ నంద్యాల రెండో పట్టణ పోలీసులను ఆదేశించారు. జేసీ ఆదేశాల మేరకు హీరో అల్లు అర్జున్, ఎమ్మెల్యే శిల్పా రవిపైన కేసు నమోదు చేశారు.



నంద్యాల ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి శిల్పారవితో కలిసి ప్రజలకు అభివాదం చేస్తున్న అల్లు అర్జున్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

మేలుకో ఆంధ్రుడా!

హమ్మయ్య! ఎన్నికల ప్రచారం ముగిసింది. తెలుగునాట అధికార, ప్రతిపక్ష నాయకులు, జాతీయ స్థాయి నాయకులు కూడా అర్ధసత్యాలు, అసత్యాలతో ప్రజలను ఊదరగొట్టారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడం ఈ ఎన్నికల్లో విశేషం. గత ఎన్నికల్లో తెలంగాణలో అనూహ్యంగా నాలుగు సీట్లు గెలుచుకున్న బీజేపీ ఇప్పుడు మెజారిటీ స్థానాలు కైవశం చేసుకోవడానికి ఉవ్విళ్లూరుతుండగా.. అధికార కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం నిలుపుకొనే ప్రయత్నం చేస్తోంది. ఐదు నెలల క్రితం అధికారం కోల్పోయిన కేసీఆర్ ఒకటి రెండు స్థానాలైనా గెలుచుకొని పార్టీని కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో నాయకులు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకున్నారు. లోక్‌సభ ఎన్నికలు తెలంగాణ భవిష్యత్ రాజకీయ ముఖచిత్రంపై ప్రభావం చూపనున్నందున మూడు ప్రధాన పార్టీలకూ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. సోమవారం జరగనున్న పోలింగ్‌లో తెలంగాణ ప్రజలు ఎవరిని ఆదరించబోతున్నారో, ఎవరిని తిరస్కరించబోతున్నారో తీర్పు ఇవ్వనున్నారు. శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయి ఐదు నెలలైనా వాస్తవంలోకి రాకుండా తెలంగాణను పాలించే సమర్థత తనకు మాత్రమే ఉందన్న భ్రమల్లో ఉన్న కేసీఆర్ బహిరంగ సభల్లో కూడా అదే విధంగా మాట్లాడారు. కేవలం ఐదు నెలల వ్యవధిలో తెలంగాణ రాష్ట్రం సర్వనాశనం అయిందని ప్రచారం చేయడం ఆయన అతి విశ్వాసానికి నిదర్శనం. ఇటీవల ఆయన చేస్తున్న వ్యాఖ్యలను బట్టి కేసీఆర్‌లో అహంభావం తొలగిపోలేదని అనిపిస్తోంది. తెలంగాణలో ఈ ఎన్నికలు రాజకీయ పార్టీలకు కీలకం కాగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పరిస్థితి వేరు. అక్కడ శాసనసభకు కూడా ఎన్నికలు జరుగుతున్నందున ఈ ఎన్నికలు ఆ రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించబోతున్నాయి. తమ పిల్లలకు మంచి భవిష్యత్తు కావాలో, తాత్కాలిక తాయిలాలతో సంతృప్తిపడిపోవడమో అన్నది తేల్చుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ పౌరులపై ఉంది. ఐదేళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు ఓడిపోయి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చారు. అప్పటి నుంచి రాష్ట్ర రాజకీయాలకు నిర్వచనం మారిపోయింది. రాజ్యం వీర భోజ్యం అన్నట్టుగా జగన్ పాలన సాగింది. రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే కాదు– ప్రభుత్వ చర్యలను తప్పుబట్టిన వారు కూడా వేధింపులకు, నిర్బంధాలకు గురయ్యారు. కనీవినీ ఎరుగని స్థాయిలో పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేశారు. ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వెల్లడించలేని భయానక వాతావరణాన్ని కల్పించారు. పగ, ప్రతీకారాలతో సాగిన జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనతో ఉక్కిరిబిక్కిరైన ప్రధాన ప్రతిపక్షాలు తెలుగుదేశం, జనసేన ఒక్కటయ్యాయి. చివరకు భారతీయ జనతా పార్టీ కూడా ఈ రెండు పార్టీలతో జట్టు కట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా తెలుగు చలనచిత్ర పరిశ్రమను కూడా వేధించడం ద్వారా టాప్ హీరోలను సైతం తన వద్దకు రప్పించుకొని తన అహాన్ని జగన్ సంతృప్తిపరచుకున్నారు. తనకు నచ్చని హీరోల సినిమాలు విడుదలైనప్పుడు థియేటర్లపై రెవెన్యూ అధికారులతో దాడులు చేయించారు. ఈ క్రమంలో జనసేనాని, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ప్రధాన బాధితుడిగా మిగిలారు. మెగాస్టార్‌గా, చిత్రపరిశ్రమలో అందరివాడుగా పిలవబడుతున్న చిరంజీవి స్వయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసి చేతులు జోడించి మరీ చిత్ర పరిశ్రమను ఆదుకోవలసిందిగా అర్థించాల్సిన పరిస్థితి కల్పించారు. తెలుగు చిత్రపరిశ్రమలో సూపర్ స్టార్లుగా వెలుగొందుతున్న ప్రభాస్, మహేశ్, ఉద్దండ దర్శకుడు రాజమౌళి వంటి వారు తమ కార్లను గేటు బయటే నిలిపి కాలి నడకన తాడేపల్లి ప్యాలెస్‌లోకి చేరుకోవాల్సిన పరిస్థితిని చూశాం. నాటి అవమాన భారం నుంచి చిత్ర ప్రముఖులు ఇంకా కోలుకోలేదు. జగన్మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్ర భవిష్యత్ సంగతి దేవుడెరుగు, తన సినీ కెరీర్ కూడా మసకబారుతుందన్న అభద్రతకు పవన్ కల్యాణ్ గురయ్యారు. దీంతో ఆవేశపరుడైన పవన్ కల్యాణ్ సీట్ల సర్దుబాటు సందర్భంగా పరిణతి ప్రదర్శించి ఒక అడుగు వెనక్కు తగ్గారు. గత ఎన్నికల సందర్భంగా చంద్రబాబు కాంగ్రెస్ పార్టీతో జట్టు కట్టడమే కాకుండా తనను వ్యక్తిగతంగా దూషించడంతో కినుక వహించి ఉన్న ప్రధాని మోదీ చివరికి ఒక మెట్టు దిగి తెలుగుదేశం పార్టీతో పొత్తుకు అంగీకరించారు. దీంతో రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ఎన్నికల బరిలోకి దిగింది. నరేంద్ర మోదీ, చంద్రబాబు మళ్లీ చేతులు కలపాల్సిన పరిస్థితి వచ్చిందంటే అందుకు జగన్మోహన్ రెడ్డి మాత్రమే ప్రధాన కారణం. బలాబలాలతో నిమిత్తం లేకుండా బీజేపీ అడిగిన సీట్లు ఇచ్చి పొత్తు కుదుర్చుకోవడానికి చంద్రబాబు ముందుకు రావడానికి కూడా జగనే కారణం. చంద్రబాబుపై అనేక కేసులు పెట్టిన జగన్ ప్రభుత్వం చివరకు స్కిల్ కేసు పేరిట 52 రోజుల పాటు జైల్లో నిర్బంధించింది. ఈ ఘటనతో తెలుగుదేశం, జనసేన మైత్రీ బంధం పటిష్ఠమైంది. ప్రభుత్వ బాధితులైన చంద్రబాబు, పవన్ కల్యాణ్ శషభిషలు లేకుండా చేతులు కలిపారు. జైలు నుంచి విడుదలైన చంద్రబాబు, ఈ ఎన్నికల్లో జగన్‌రెడ్డిని ఓడించకపోతే తన రాజకీయ జీవితం ఫెయిల్యూర్‌గా ముగుస్తుందని గుర్తించి మానసికంగా రాజీపడి భారతీయ జనతా పార్టీతో కూడా జతకట్టారు. దీంతో రాష్ట్రంలో ప్రధాన పోరు ఎన్డీయే కూటమికీ, వైసీపీకి మధ్య కేంద్రీకృతమైంది. ప్రజలు కూడా జగన్ అనుకూల, వ్యతిరేక వర్గాలుగా చీలిపోయారు. ఫలితంగా ఎన్నికల మేనిఫెస్టోలు అప్రధానమయ్యాయి. జగన్‌ను ఇంటికి పంపాలనుకొనేవారు మిగతా విషయాలు పట్టించుకోకుండా కూటమి వైపు మొహరించగా, జగన్ మళ్లీ రావాలనుకొనేవారు ప్రభుత్వ పనితీరు, అభివృద్ధితో పనిలేకుండా ఆయనకు మద్దతుగా నిలబడ్డారు. ఐదేళ్ల జగన్ పాలనలో మరో కీలక పరిణామం కూడా చోటుచేసుకుంది. 2019 ఎన్నికల వరకు జగన్‌కు అండగా ఉంటూ ఆయన కోసం పాదయాత్ర చేయడమే కాకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించిన చెల్లెలు షర్మిల.. జగన్ కుటుంబానికి దూరమయ్యారు. వైఎస్ రాజశేఖర రెడ్డి కుటుంబం రెండుగా చీలిపోయింది. వైసీపీ గౌరవ అధ్యక్షురాలి పదవి నుంచి తల్లి విజయమ్మను తప్పించిన జగన్‌రెడ్డి ఆమెకు పార్టీతో సంబంధం లేకుండా చేశారు. ఇద్దరు బిడ్డలూ చెరోదారి అయిన నేపథ్యంలో ఎటూ చెప్పలేక ఆమె అమెరికాకు వెళ్లిపోయారు. కాకపోతే ఎన్నికల ప్రచారం చివరి రోజున ఓ వీడియో సందేశం విడుదల చేశారు. కడప బరిలో అవినాశ్‌రెడ్డిపై పోటీ పడుతున్న షర్మిలకు మద్దతు ప్రకటించారు. తద్వారా జగన్ అన్యాయం వైపు నిలిచారని ఆమె చెప్పకనే చెప్పారు. గత ఎన్నికలకు ముందు దారుణ హత్యకు గురైన వివేకానంద రెడ్డి కుమార్తె డాక్టర్ సునీత కూడా నిందితులకు జగన్ రక్షణ కల్పిస్తున్నారని మండిపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బాధ్యతలు చేపట్టి కడప ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న షర్మిలకు మద్దతుగా సునీత నిలిచారు. ఏ ఎన్నికల్లో అయినా పోటీలో ఉన్న తండ్రి లేదా భర్త, లేదా సోదరుల తరఫున కుటుంబంలోని మహిళలు ప్రచారం చేయడం సహజం. ఇప్పుడు ఏపీలో జరుగుతున్న ఎన్నికల్లో మాత్రం జగన్మోహన్ రెడ్డి రక్తం పంచుకుపుట్టిన షర్మిలతో పాటు సునీత కూడా అన్నను ఓడించాలని ప్రజలకు పిలుపివ్వడం ఈ ఎన్నికల ప్రత్యేకత. నేరస్థులు, హంతకులకు ఓటు వేయవద్దని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ పరిస్థితి తలెత్తుతుందని ఐదేళ్ల క్రితం ఎవరూ ఊహించి ఉండరు. బంధుప్రీతి ఆరోపణలు రాకూడదనే షర్మిలను పదవులకు దూరంగా ఉంచానని జగన్ చెప్పడాన్ని షర్మిల తీవ్రంగా తప్పుబట్టారు. పదవుల్లో, పనుల్లో కావాలని తాను అడిగినట్టుగా జగన్ రెడ్డి బైబిల్ మీద ప్రమాణం చేసి చెప్పగలరా? అని షర్మిల సవాల్ చేశారు. ఈ సందర్భంగా ఆమె కంటతడి పెట్టారు. మరోవైపు డాక్టర్ సునీత ఇంకో అడుగు ముందుకేసి తనకూ, షర్మిలకూ ప్రాణహాని ఉందని, షర్మిలనూ, తననూ నరికి చంపించే ఆలోచనను జగన్ భార్య భారతీరెడ్డి చేయవచ్చునని ఆరోపించారు. తనను నరికి చంపవచ్చునన్న ప్రమాదాన్ని ఊహించి ముందుగానే తన పిల్లలకు వీలునామా రాసిచ్చి మరీ కడపలో షర్మిల తరఫున ప్రచారానికి వచ్చానని కూడా సునీత చెబుతున్నారు. న్యాయం కోసం రోడ్డెక్కిన ఇద్దరు ఆడపడుచులపై జగన్ అండ్ కో యథాప్రకారం దాడిని ముమ్మరం చేశారు. భారతీరెడ్డి ప్రధాన విలన్‌గా ఈ ఇద్దరు ఆడపడుచులూ బహిరంగంగానే ఆరోపణలు చేస్తున్నారు. రాజశేఖర రెడ్డి కుటుంబం ఇలా బజారున పడటం విషాదం. కడప నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అవినాశ్ రెడ్డి కోసం జగన్మోహన్ రెడ్డి తన సొంత చెల్లెలు షర్మిలను కూడా దూరం చేసుకోవడం ఆశ్చర్యం కలిగించక మానదు. ఒక ముఖ్యమంత్రిగా న్యాయం వైపు నిలబడాల్సిన జగన్మోహన్ రెడ్డి మాత్రం వివేకా కేసులో నిందితుల తరఫున నిలబడుతున్నారు. వివేకా హత్య జరిగినప్పుడు చంద్రబాబును నిందించిన జగన్మోహన్ రెడ్డి.. ఇప్పుడు ఆ ఊసు ఎత్తకపోగా ఆస్తుల కోసం వివేకాను సొంత అల్లుడే చంపించాడని తన మనుషులతో చెప్పిస్తున్నారు. ఈ మార్పును ప్రజలు కూడా గుర్తించారు.

> జగన్ పాలనలో అభివృద్ధి కుంటుపడి రాష్ట్రం అప్పులపాలవడానికి అమలులో ఉన్న పథకాలు కారణం కాదా? అయినా ఎన్డీయే కూటమికి నేతృత్వం వహిస్తున్న చంద్రబాబు ఇంతకంటే ఎక్కువే ఇస్తానని చెప్పుకోవాల్సి వచ్చింది. బటన్ నొక్కితే చాలు అన్నట్టుగా జగన్ పాలన సాగింది. ఈ క్రమంలో మౌలిక సదుపాయాలు కుంటుపడ్డాయి. రహదారుల పరిస్థితి దారుణంగా మారింది. యువతకు ఉపాధి మృగ్యమైంది. ఉపాధి అవకాశాలు కల్పించడం అంటే, పెట్టుబడులను ఆకర్షించి పరిశ్రమలు నెలకొల్పడం కాదని జగన్‌రెడ్డి ఈ మధ్య ఒక జాతీయ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. ఒక పెద్ద పరిశ్రమ వస్తే ఎంత మందికి ఉపాధి లభిస్తుంది? అని ఆయన ఎదురు ప్రశ్న వేశారు. చిరు వ్యాపారాలను, అంటే చేపల కొట్లు, కూరగాయల షాపులు, మంగలి షాపుల వంటి వాటిని ప్రోత్సహిస్తే ఎక్కువ మందికి ఉపాధి లభిస్తుందని ఆయన నిర్వచించారు. ఈ ధోరణి జగన్మోహన్ రెడ్డి మనోవికారాలకు నిదర్శనం కాదా?

> ఏ ఎన్నికల్లో అయినా పోటీలో ఉన్న తండ్రి లేదా భర్త, లేదా సోదరుల తరఫున కుటుంబంలోని మహిళలు ప్రచారం చేయడం సహజం. ఇప్పుడు ఏపీలో జరుగుతున్న ఎన్నికల్లో మాత్రం జగన్మోహన్ రెడ్డి రక్తం పంచుకుపుట్టిన షర్మిలతో పాటు సునీత కూడా అన్నను ఓడించాలని ప్రజలకు పిలుపివ్వడం ఈ ఎన్నికల ప్రత్యేకత.

హవ్వ.. పరిశ్రమలు ఎందుకంట!

ఆడపడుచుల రోదనలను పక్కనపెడితే జగన్ ఐదేళ్ల పాలనలోని మంచి చెడులను పరిశీలిద్దాం. ముఖ్యమంత్రిగా ఎవరున్నా తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తారు. అభివృద్ధి–సంక్షేమం మధ్య సమతుల్యం ఉండేలా చూసుకుంటారు. నవరత్నాలు పేరిట ప్రజలకు డబ్బు పంచడమే ముఖ్యమంత్రి చేయాల్సిన గొప్ప పని అని జగన్ భావించారు. అందుకే ప్రతి కుటుంబానికి డబ్బు పంచిన తనకే మళ్లీ అధికారం అప్పగించాలని ఆయన కోరుతున్నారు. తనకు ఓటు వేయకపోతే అమలులో ఉన్న పథకాలను ఎత్తేస్తారని ఆయన ప్రచారం చేస్తున్నారు. నిజానికి సంక్షేమ పథకాలను అవి ఎవరు ప్రవేశపెట్టినా వాటిని ఎత్తేయడం ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాల వల్ల కాదు. అమలులోకి వచ్చిన పథకాలను తమ హక్కుగా ప్రజలు భావిస్తారు. వైఎస్ రాజశేఖర రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జనాభాను మించి అన్నట్టుగా తెల్ల రేషన్ కార్డులను మంజూరు చేశారు. ఆ తర్వాత రాష్ట్రం విడిపోయింది. తెలంగాణలో వైసీపీ కూడా లేదు. అయినా తొమ్మిదిన్నరేళ్లు తెలంగాణను పాలించిన కేసీఆర్ గానీ, ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి గానీ బోగస్ కార్డుల ఏరివేత ఆలోచన కూడా చేయలేకపోయారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇదే పరిస్థితి. కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కిలో బియ్యం ధరను రెండు రూపాయల నుంచి రూపాయికి తగ్గించారు. ఈ ధరలో కూడా మార్పు చేయడానికి ఎవరూ ఇష్టపడలేదు. ఒకప్పటి సంక్షేమం వేరు, ఇప్పటి సంక్షేమం వేరు. అధికారంలోకి రావాలనుకొనేవారు చేతికి ఎముక లేదన్నట్టుగా వరాలు ప్రకటిస్తున్నారు. ఫలితంగా అన్ని రాజకీయ పార్టీలూ పులి మీద స్వారీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. జగన్ పాలనలో అభివృద్ధి కుంటుపడి రాష్ట్రం అప్పులపాలవడానికి అమలులో ఉన్న పథకాలు కారణం కాదా? అయినా ఎన్డీయే కూటమికి నేతృత్వం వహిస్తున్న చంద్రబాబు ఇంతకంటే ఎక్కువే ఇస్తానని చెప్పుకోవాల్సి వచ్చింది. బటన్ నొక్కితే చాలు అన్నట్టుగా జగన్ పాలన సాగింది. ఈ క్రమంలో మౌలిక సదుపాయాలు కుంటుపడ్డాయి. రహదారుల పరిస్థితి దారుణంగా మారింది. యువతకు ఉపాధి మృగ్యమైంది. ఉపాధి అవకాశాలు కల్పించడం అంటే, పెట్టుబడులను ఆకర్షించి పరిశ్రమలు నెలకొల్పడం కాదని జగన్‌రెడ్డి ఈ మధ్య ఒక జాతీయ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చారు. ఒక పెద్ద పరిశ్రమ వస్తే ఎంత మందికి ఉపాధి లభిస్తుంది? అని ఆయన ఎదురు ప్రశ్న వేశారు. చిరు వ్యాపారాలను, అంటే చేపల కొట్లు, కూరగాయల షాపులు, సెలూన్ల వంటి వాటిని ప్రోత్సహిస్తే ఎక్కువ మందికి ఉపాధి లభిస్తుందని ఆయన నిర్వచించారు. ఈ ధోరణి జగన్మోహన్ రెడ్డి మనోవికారాలకు నిదర్శనం కాదా? హైదరాబాద్‌లో బీహెచ్ఈఎల్‌ను ఏర్పాటు చేసిన తర్వాత అనేక అనుబంధ యూనిట్లు ఏర్పాటై పటాన్‌చెరువు అనే ప్రాంతం ఎంతలా అభివృద్ధి చెందిందో చూశాం. ఈసీఐఎల్ ఏర్పాటు వల్ల అదే పేరుతో మరో ప్రాంతం అభివృద్ధి చెందింది. జిరాక్స్ సెంటర్లు, మాంసం కొట్లు ఏర్పాటు చేసినంత మాత్రాన పట్టణాలు, నగరాలు విస్తరించకుండా వ్యాపారం ఎలా జరుగుతుంది? సాఫ్ట్‌వేర్ పరిశ్రమ అభివృద్ధి చెందడం వల్లే కదా హైదరాబాద్‌కు లక్షల మంది యువత తరలివచ్చారు. ఆ కారణంగానే జగన్ చెబుతున్న చిరు వ్యాపారులకు కూడా గిరాకీ ఉంటోంది. ఈ చిన్న లాజిక్ కూడా మిస్ అవుతున్న జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్ పరిస్థితి ఏమిటో? అన్న ఆందోళన కలగకమానదు.



మళ్లీ వస్తే.. ఇక అంతే!

ప్రతి ఇంటికీ మేలు జరిగిందని జగన్ చెప్పుకొంటున్నది నిజమైతే ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు వలసలు ఎందుకు పెరిగాయి? సోమవారం పోలింగ్ జరగనున్నందున హైదరాబాద్‌లో పనిచేసి కడుపు నింపుకొంటున్న లక్షల మంది స్వగ్రామాలకు తరలివెళ్లడాన్ని చూస్తున్నాం. వలంటీర్ వ్యవస్థను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం వల్ల దాని ఏర్పాటు లక్ష్యం కూడా దెబ్బతింది. రాష్ట్ర సంపద పెంచే ఆలోచన చేయని వ్యక్తి గొప్ప ముఖ్యమంత్రి ఎలా అవుతారు? చిరుద్యోగులు, చిరువ్యాపారులు మాత్రమే ఉండాలనుకొనే జగన్ పాలనలో ఆర్థికాభివృద్ధి ఆశించడం అత్యాశే అవుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు కూడా ఉండాలనుకోవడం పెత్తందారుల పోకడ అని ప్రచారం చేయడం దుర్మార్గం. తెలుగు భాష చనిపోతే తెలుగుజాతి ఎక్కడుంటుంది? అప్పుడు మనల్ని ఏమని పిలుచుకుంటాం? పది కోట్ల మందికి పైగా జనాభా మాట్లాడే తెలుగు భాషకు ఈ దుస్థితి కల్పిస్తున్న జగన్మోహన్ రెడ్డి మాతృభాషకు ద్రోహం చేస్తున్నవారే అవుతారు. ధర్మో రక్షతి రక్షితః అని అంటాం. అలాగే వ్యవస్థలను మనం కాపాడుకుంటే అవి మనల్ని కాపాడతాయి. జగన్ ప్రభుత్వంలో అన్ని ప్రభుత్వ శాఖలు కుప్పకూలిపోయాయి. న్యాయ పాలన చేయాలన్న స్పృహను అన్ని స్థాయిల్లో మరచిపోయారు. పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అన్ని విలువలనూ వదిలేశారు. ప్రజలు, రాష్ట్రం ఏమైపోయినా ఫర్వాలేదు, నేను బాగుంటే చాలు అనుకుంటున్నారు. ఈ బాపతుగాళ్లు ఎవరూ పదవీ విరమణ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఉండరు. అందరూ హైదరాబాద్ వచ్చి వాలిపోతారు. అక్కడ ఉండబోయేది ఏ ఆదరణా లేని, ఎక్కడకూ వెళ్లలేని నిస్సహాయులు మాత్రమే. మన పిల్లలు ఉద్యోగాల కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు వెళ్లాల్సిన ఖర్మ ఏమిటి? అని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రశ్నించుకోవాలి. అభివృద్ధి చెందిన ప్రాంతానికే జనం వలస వెళతారు. అమెరికాకు మన వాళ్లు ఎందుకు వెళుతున్నారు? మాంసం కొట్లు, కూరగాయల కొట్లు పెట్టుకోవడానికి కాదు గదా? మెరుగైన జీవితం కోసం వెళతాం. పొరుగు రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వలసలు ఉంటున్నాయా? ఎందుకు లేవు? అంటే ఇక్కడ ఏమీ లేదు! తిన్నామా.. పడుకున్నామా.. తెల్లారిందా? అని మాత్రమే ఆలోచించే సమాజం ఉన్న చోట అభివృద్ధి జరగదని ప్రజలు గ్రహించాలి. రాష్ట్రం విడిపోయి పదేళ్లవుతోంది. ఇప్పటికీ రాజధాని అంటే ఇదీ అని చెప్పుకోలేని దుస్థితి కల్పించిన జగన్‌ను నెత్తిన పెట్టుకోవాలా? లేదా? అన్నది ఆంధ్రులు ఆలోచించుకోవాలి. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వస్తే రాజధాని నిర్మాణం ఆగిపోతుంది, పోలవరం ప్రాజెక్టు మూలనపడుతుంది, అభివృద్ధి అడుగంటిపోతుంది, అరాచకం ప్రబలుతుంది అని 2019 ఎన్నికల సందర్భంగా బాధ్యతగల మీడియాగా మేం చెప్పాం. ఇప్పుడు అదే జరిగింది. సంక్షేమం పేరిట జనానికి ముష్టి వేస్తూ సహజ వనరులను చెరపట్టి అపర కుబేరులుగా అధికారంలో ఉన్న వారు అవతరిస్తున్నారని ప్రజలు గుర్తించాలి. మాది ఫలానా రాష్ట్రం, మా రాజధాని ఫలానా అని గర్వంగా చెప్పే విధంగా జగన్ ఏదైనా అభివృద్ధి చేశారా? అంటే సున్నా అని చెప్పాలి. దేశంలో ఎక్కడా లేని విధంగా దిక్కుమాలిన మద్యాన్ని విక్రయిస్తూ ప్రజల ప్రాణాలు తీస్తున్న ప్రభుత్వం మళ్లీ రావాలా? మద్యంపై వచ్చే ఆదాయాన్నీ, ప్రభుత్వ ఆస్తులనూ కుదవపెట్టి అప్పులు చేసిన జగన్ ప్రభుత్వానికి మళ్లీ అవకాశం ఇస్తే జరిగేదేమిటో ప్రజలకు తెలియదా? అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టుగా అభివృద్ధికి అవసరమైన అన్ని వనరులూ, అవకాశాలూ ఉన్నప్పటికీ పొరుగు రాష్ట్రాల ముందు తల దించుకోవాల్సిన పరిస్థితి కల్పించిన జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సిద్ధం కావాలా? వద్దా? అని ప్రజలు ఆలోచించుకోవాలి. ఈ ఎన్నికలు ప్రజల తలరాతను మార్చబోతున్నందున ప్రజలు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకొని ఓటు వేయాలి. కులమతాలకు అతీతంగా రాష్ట్రం హితవు కోరే వారు సంఘటితం కావాలి. తెలంగాణలో అహంకారంతో వ్యవహరించిన కేసీఆర్‌ను అక్కడి ప్రజలు ఇంటికి పంపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆ మాత్రం విజ్ఞత ఉండదా? పతనం అంచున ఉన్న రాష్ట్రాన్ని నిలబెట్టుకోవడమా? లేదా? అన్నది ప్రజల చేతుల్లోనే ఉంది. చూద్దాం.. సోమవారంనాడు ప్రజలు ఎలా స్పందిస్తారో!

> జగన్ ప్రభుత్వంలో అన్ని ప్రభుత్వ శాఖలు కుప్పకూలిపోయాయి. న్యాయ పాలన చేయాలన్న స్పృహను అన్ని స్థాయిల్లో మరచిపోయారు. పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అన్ని విలువలనూ వదిలేశారు. ప్రజలు, రాష్ట్రం ఏమైపోయినా ఫర్వాలేదు, నేను బాగుంటే చాలు అనుకుంటున్నారు. ఈ బాపతుగాళ్లు ఎవరూ పదవీ విరమణ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఉండరు. అందరూ హైదరాబాద్ వచ్చి వాలిపోతారు. అక్కడ ఉండబోయేది ఏ ఆదరణా లేని, ఎక్కడకూ వెళ్లలేని నిస్సహాయులు మాత్రమే. మన పిల్లలు ఉద్యోగాల కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు వెళ్లాల్సిన ఖర్మ ఏమిటి? అని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రశ్నించుకోవాలి. అభివృద్ధి చెందిన ప్రాంతానికే జనం వలస వెళతారు. అమెరికాకు మన వాళ్లు ఎందుకు వెళుతున్నారు? మాంసం కొట్లు, కూరగాయల కొట్లు పెట్టుకోవడానికి కాదు గదా? మెరుగైన జీవితం కోసం వెళతాం. పొరుగు రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వలసలు ఉంటున్నాయా? ఎందుకు లేవు? అంటే ఇక్కడ ఏమీ లేదు! తిన్నామా.. పడుకున్నామా.. తెల్లారిందా? అని మాత్రమే ఆలోచించే సమాజం ఉన్న చోట అభివృద్ధి జరగదని ప్రజలు గ్రహించాలి.

> నరేంద్ర మోదీ, చంద్రబాబు మళ్లీ చేతులు కలపాల్సిన పరిస్థితి వచ్చిందంటే అందుకు జగన్మోహన్ రెడ్డి మాత్రమే ప్రధాన కారణం. బలాబలాలతో నిమిత్తం లేకుండా బీజేపీ అడిగిన సీట్లు ఇచ్చి పొత్తు కుదుర్చుకోవడానికి చంద్రబాబు ముందుకు రావడానికి కూడా జగనే కారణం. చంద్రబాబుపై అనేక కేసులు పెట్టిన జగన్ ప్రభుత్వం చివరకు స్కిల్ కేసు పేరిట 52 రోజుల పాటు జైల్లో నిర్బంధించింది. ఈ ఘటనతో తెలుగుదేశం, జనసేన మైత్రీ బంధం పటిష్ఠమైంది. ప్రభుత్వ బాధితులైన చంద్రబాబు, పవన్ కల్యాణ్ శషభిషలు లేకుండా చేతులు కలిపారు. జైలు నుంచి విడుదలైన చంద్రబాబు, ఈ ఎన్నికల్లో జగన్‌రెడ్డిని ఓడించకపోతే తన రాజకీయ జీవితం ఫెయిల్యూర్‌గా ముగుస్తుందని గుర్తించి మానసికంగా రాజీపడి భారతీయ జనతా పార్టీతో కూడా జతకట్టారు. దీంతో రాష్ట్రంలో ప్రధాన పోరు ఎన్డీయే కూటమికీ, వైసీపీకి మధ్య కేంద్రీకృతమైంది. ప్రజలు కూడా జగన్ అనుకూల, వ్యతిరేక వర్గాలుగా చీలిపోయారు.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

పలుకు సంస్కారం

పొలాల్ని పోగొట్టుకున్న భూమి భాష
భూముల్ని పోగొట్టుకున్న సేద్యకారుల భాష
నెలవులను పోగొట్టుకున్న నిర్వాసితుల భాష
ఉపాధి లేక వాలిపోతున్న ఖాళీ చేతుల భాష
వలసలతో ఖాళీ అవుతున్న గ్రామాల భాష
ఆకలితో మాడిపోతున్న లక్షల నాగళ్ళ భాష
మూతపడ్డ కుటీర శ్రమాలయాల దుఃఖభాష
తెరుచుకున్న పానశాలల్లో కూలిన కాపురాల భాష
మాదక వాణిజ్యకాండలో మత్తిల్లిన పిల్లల భాష
మీకు అక్కర లేదు

బ్యాలెట్ కోసం మీకు అక్కరైన భాష వేరు,
అధికారార్జనే దాని ఏకైక వ్యాకరణ సూత్రం

మీ భాష నిండా
అసత్య ఘీంకారాలు అహంకార హుంకారాలు
అభూత కల్పనలూ అల్లిక కథలూ మాయల ప్రాసలూ
నిందాపూర్తి దండకాలూ స్వోత్కర్షల వమనాలూ
బూతు ప్రేలాపనలూ బట్టలిడిచిన బరిబాత సవాళ్లు
కల్పితావేశాల వ్యంగ్యేంద్రజాల వాచక ప్రదర్శనలు

మీ భాషకు తేటగాలులు మకిలబారుతున్నాయి
సంస్కార పుష్పాలు వడలి తెగి రాలిపోతున్నాయి
మర్యాద గృహాలు నిరసన గడియలేసుకుంటున్నాయి
పూర్వ మహనీయులు వీధి విగ్రహాల్లో ఖిన్నులవుతున్నారు

భాష మీ సొంత ఆస్తి కాదు, జాతి ఉమ్మడి ఆస్తి
బతుక్కి లాగానే భాషనూ కాపాడుకుంటుంది ప్రజ!
బహుళ జనులు శ్రోతల పాత్ర నుంచి జరిగి ఎగిసి
వేదిక లెక్కి తమ బతుకు కలల భాషే, కడగండ్ల భాషే
పనిముట్ల భాషే అసలైన సజీవ భాష అని ప్రకటిస్తారు

మీ భాషను ఓడించి సజీవ భాష వర్ధిల్లుతుంది

– దర్భశయనం శ్రీనివాసాచార్య

వాతావరణం ఎట్లా ఉన్నదంటే, పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేట్టు. దేవుణ్ణి తలచుకుంటే కూడా బూతుగా ధ్వనించేట్టు. ఏం మాట్లాడినా మరుక్షణం దాన్ని అపచారంగా, అత్యాచారంగా మార్చి ప్రతిధ్వనింపజేయగల యంత్రాంగాలు మోహరించి ఉన్నాయి. కాసేపు స్థిమితపడి, ఆలోచించి, మంచిచెడ్డలు వివేచించే సహనం ఎవరికీ లేదు. సగం అర్థంతోనో, అపార్థంలోనో ఆవేశపడిపోవాలి. ఆవలిపక్షం మీద విరుచుకుపడాలి.

అంకెలమధ్య అసలు వాస్తవం చూడాలి!

ప్రధానమంత్రి కార్యాలయానికి ఆర్థిక వ్యవహారాలలో సహకరించే సలహామండలి (ఇఎసిపిఎం) ఈ మధ్య ఒక మధ్యంతర అవగాహన పత్రాన్ని విడుదల చేసింది. దాని ప్రకారం భారతదేశంలో 1950 నుంచి 2015 మధ్యకాలంలో హిందువుల జనాభా 7.82 శాతం తగ్గింది. ముస్లిముల జనాభా 43.15 శాతం పెరిగింది. ఇంకేముంది? మతవిభజన ఆధారంగా వేడెక్కి ఉన్న రాజకీయ వాతావరణానికి ఎండుగడ్డే దొరికినట్టయింది. లెక్కలకు తప్పుడు వ్యాఖ్యానం ఇవ్వాలనే తాపత్రయంలో, ఆ పత్రం మైనారిటీ మతస్థుల జనాభాపెరుగుదలను ఒక సానుకూల అంశంగా చెప్పిందనే వాస్తవాన్ని మరుగుపరిచారు. గణాంకాలను ఎట్లా అర్థం చేసుకోవాలి, జనాభా పెరుగుదల ధోరణులను చూసే పద్ధతేమిటి వంటి లోతైన అంశాలు ఎవరికీ అక్కరలేదు. ఒకటి తగ్గింది. ఒకటి పెరిగింది. అంతే. ఆ పత్రం రాసిన నిపుణుల బృందం కూడా ఆ పెరుగుదల ధోరణులను అనుకూల ధోరణులుగా చెప్పినా సరే. రాజకీయంగా పనికివచ్చే కోణాన్నే ప్రదర్శిస్తాం, టీవీ చర్చల్లో దాన్నే టముకు వేస్తాం.

ఈ గణాంకాల చర్చలోకి వెళ్లే ముందు, ఎవరికైనా రావలసిన ప్రశ్న, ఈ మధ్యంతరపత్రం ఈ సమయంలో ఎందుకు బయటకు వచ్చింది? ముస్లిములు ఎక్కువమంది పిల్లలను కంటారని, వారికి వనరుల మీద మొదటి హక్కు ఉండాలని కొందరు వాదిస్తున్నారని సాక్షాత్తూ ప్రధానమంత్రే మాట్లాడిన నేపథ్యంలో, ఈ ఆవేశకావేశాలకు ఆజ్యం పోయాలనే ఉద్దేశ్యంతో ఈ పత్రాన్ని ఇప్పుడు ఎవరైనా రంగం మీదకు తెచ్చారా? రాజకీయ సంవాదాల్లో ఆపద్ధర్మంగా ఈ పత్రాలూ నివేదికలూ ఎందుకు ప్రత్యక్షమవుతాయి? ఆలోచనలు సారిస్తే, మూలకారణాలు అర్థం కాకుండా పోవు.

అధికసంతానం వెనుకబాటుతనానికి ఒక సంకేతం. సంతానం దైవదత్తమన్న నమ్మకం అన్ని సామాజిక వర్గాలలోనూ ఉంటుంది. సాక్షత్తూ మన ప్రధాని నరేంద్రమోదీ, ఆరుగురు సంతానంలో ఒకరు. అధికసంతానం కలిగిన నాయకులుగా ఎన్టీయార్, లాలూ ప్రసాద్ యాదవ్ పేర్లు అందరికీ తెలిసినవే. విద్యాసంస్కారాలు, ఆదాయాలు పెరిగే కొద్దీ, కుటుంబ నియంత్రణకు ఆమోదం పెరుగుతూ వచ్చింది. ముస్లిమ్ మత వర్గంలో కూడా, మతపరమైన కారణాలతో కుటుంబ నియంత్రణను వ్యతిరేకించే ధోరణి, ఆ వర్గంలోని విద్యాసంస్కారాల వ్యాప్తికి తగినట్టుగా తగ్గుతూ వస్తోంది. ఇప్పటికీ హిందువులతో సహా, అన్ని మతవర్గాలలో అవిద్య, దారిద్ర్యం ఆవరించిన శ్రేణులలో అధికసంతానం కనిపిస్తుంది.

> ఈ మధ్యంతరపత్రం ఈ సమయంలో ఎందుకు బయటకు వచ్చింది? ముస్లిములు ఎక్కువమంది పిల్లలను కంటారని, వారికి వనరుల మీద మొదటి హక్కు ఉండాలని కొందరు వాదిస్తున్నారని సాక్షాత్తూ ప్రధానమంత్రే మాట్లాడిన నేపథ్యంలో, ఈ ఆవేశకావేశాలకు ఆజ్యం పోయాలనే ఉద్దేశ్యంతో ఈ పత్రాన్ని ఇప్పుడు ఎవరైనా రంగం మీదకు తెచ్చారా? రాజకీయ సంవాదాల్లో ఆపద్ధర్మంగా ఈ పత్రాలూ నివేదికలూ ఎందుకు ప్రత్యక్షమవుతాయి?



ఒకస్థితిని పేర్కొన్న మాత్రం చేత దానిని అర్థం చేసుకోలేం. ఎటు నుంచి ఎటు పోతున్న గతిలో ఆ స్థితి ఉన్నది అని తెలియాలి. ముస్లిముల జనాభా 43 శాతం పెరిగింది, అన్నంత మాత్రాన, దశాబ్ది పెరుగుదల రేటు, దాని వృద్ధి పతనాలు అర్థం కావు. 1951–1961 మధ్య కాలంలో, హిందువుల జనాభా 20.7 శాతం పెరిగితే, ముస్లిములది 32.7 శాతం పెరిగింది. 1961–71 మధ్య పదేళ్లలో హిందువులు 23.7 శాతం, ముస్లిములు 30.7 శాతం పెరిగారు. 1991–2001 పదేళ్లలో హిందువులు 19.9 శాతం, ముస్లిములు 29.4 పెరిగారు. 2001-11 మధ్య కాలంలో హిందువులు 16.7 శాతం, ముస్లిములు 24.7 శాతం పెరిగారు. ముస్లిముల జనాభా పెరుగుదల రేటు 1990 దశకం నుంచి క్రమంగా తగ్గుతూ వస్తోంది. అంటే ధోరణి తరుగుదల దిశగా ఉన్నదన్న మాట. ప్రస్తుతానికి ఇంకా, అది హిందువుల పెరుగుదల కంటె అధికంగా ఉండవచ్చు. కానీ, అతి త్వరలోనే రెండు జనాభావర్గాల మధ్య పెరుగుదల రేటులో వ్యత్యాసం తరిగిపోతుంది. 2021 జనాభా లెక్కల సేకరణ జరగలేదు కానీ, జరిగి ఉంటే దాని ఫలితాలలో ఇదే ధోరణిని, మరింత తరుగుదలను చూసేవాళ్లము.

ఈ సందర్భంలో ఒక ప్రశ్న వేసుకోవాలి. జనాభా పెరుగుదల రేటును మతాల వారీగా మాత్రమే ఎందుకు చూడాలి? హిందువులలోని అన్ని కులాలలో జనాభా పెరుగుదల రేటు సమానంగా ఉందా? జనాభా పెరుగుదల రేటు ఎక్కువగా ఉన్న కులాలను తక్కినవారు దోషులుగా చూడాలి. విద్యాసంస్కారాలకు, ఆర్థిక స్థితిగతులకు సంతానానికి సంబంధం ఉంది కాబట్టి, సహజంగానే అగ్రకులాలలో జనాభా పెరుగుదల రేటు తగ్గిపోతూ వస్తుంది. అణగారిన కులాలలో ఇంకా అధికసంతానం కొనసాగుతూ ఉంటుంది. బిహార్‌లో 2023లో నిర్వహించిన కులగణనలో షెడ్యూల్డు కులాల వారీ జనాభా 2011 జనాభా లెక్కల నాటి 16 శాతం నుంచి 19.5 శాతానికి పెరిగింది. అదే ముస్లిముల జనాభా 2011 నాటి 16.9 శాతం నుంచి 17.7 శాతానికి మాత్రమే పెరిగింది. అంటే బిహార్‌లో ముస్లిముల జనాభా పెరుగుదల రేటు కంటె షెడ్యూల్డు కులాల వారి జనాభా పెరుగుదల రేటు ఎక్కువ. కులగణన దేశవ్యాప్తంగా జరిగితే, జనాభా పెరుగుదలలోని అనేక విశేషాలు తెలుస్తాయి.

మధ్యంతర ఆర్థికపత్రంలోని అంకెలు చూసి హడావుడి చేసిన నాయకులు, మీడియా ముఖ్యమైన మరికొన్ని వివరాలను చూడనే లేదు, చూసినా విస్మరించారు. మెజారిటీ మతస్థుల జనాభా పెరుగుదల రేటు తగ్గిపోవడం ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న ధోరణి అట. అది ప్రశంసనీయమైన పరిణామం అట. మైనారిటీల జనాభా తరిగిపోవడాన్ని ప్రతికూల అంశంగా పరిగణించిన ఆ పత్రం, దక్షిణాసియాలోని బంగ్లాదేశ్, పాకిస్థాన్, శ్రీలంక, భూటాన్, అఫ్ఘానిస్తాన్ దేశాల ధోరణిని తప్పుపట్టింది. ఆ దేశాల్లో మెజారిటీ జనాభా పెరుగుదల రేటు ఎక్కువుంది. మన పొరుగుదేశాల్లో ఒక మాల్దీవుల్లో మాత్రమే మెజారిటీ జనాభా తగ్గింది. చుట్టుపక్కల దేశాల్లో మైనారిటీలకు ప్రతికూల వాతావరణం ఉండడం వల్లనే, వారు భారత్‌ను ఆశ్రయిస్తున్నారని ఆ పత్రం చెప్పింది. భారతదేశంలో సర్వమతస్థులకు, ముఖ్యంగా మైనారిటీలకు అనుకూల వాతావరణం ఉన్నదని ఆ పత్రం భావం. ఆ వాస్తవాన్ని ఎన్నికల సందర్భంగా మైనారిటీలపై ప్రతికూలంగా ఎక్కుపెట్టడం విచారకరం. ప్రధానమంత్రి కార్యాలయానికి చెందిన గణాంకపత్రానికి సాక్షాత్తూ ప్రధాని ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీనుంచి, అనుకూల మీడియానుంచి తప్పుడు వ్యాఖ్యానాలు వస్తున్నాయంటే, ఇక వాస్తవాలను గుర్తించడం ఎంత కష్టం?

■ కె. భారత్ బాబు


www.andhrajyothy.com

ANDHRAJYOTHI

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru











పింఛను దానం కాదు.. హక్కు

రిటైర్డ్ ఉద్యోగులకు పూర్తి పెన్షన్ ఇవ్వండి.. జాప్యం జరిగినందుకు 6% వడ్డీ కూడా ఇవ్వాలి

- 2 వారాల్లో చెల్లింపులు పూర్తి చేయాలి
- తెలుగు అకాడమీలకు హైకోర్టు ఆదేశాలు
- సర్వీసు రికార్డులను ఇరు రాష్ట్రాలు మార్చుకోవాలని సూచన



హైదరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు అకాడమీలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు హైకోర్టు భారీ ఊరట కలిగించింది. వారికి పెన్షన్ బకాయిలతో పాటు, జాప్యం జరిగినందుకు వడ్డీ చెల్లించాలని ఆదేశించింది. ఈ ప్రక్రియను రెండు వారాల్లో పూర్తి చేయాలని స్పష్టం చేసింది. పింఛను అనేది రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చే దానమో, వరమో కాదని.. రాజ్యాంగ బద్ధమైన హక్కు అని స్పష్టం చేసింది. ఫిర్యాదిదారైన బి.వరలక్ష్మి సహా మరో 14 మంది ఉమ్మడి రాష్ట్ర తెలుగు అకాడమీలో వివిధ పోస్టుల్లో ఉద్యోగాలు చేసి 2014 జూన్ 2 (అపాయింటెడ్ డే) తర్వాత రిటైర్ అయ్యారు. ఉమ్మడి తెలుగు అకాడమీ విభజన వివాదాలు పెండింగ్‌లో ఉండటం, నిధులు, ఉద్యోగుల పంపకాలు తేలకపోవడంతో పింఛన్లు సక్రమంగా చెల్లించలేదు. దాంతో వారు 2020లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న హైకోర్టు.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు రెండు నెలల్లో పిటిషనర్లు సహా ఉద్యోగుల విభజనను పూర్తిచేయాలని ఆదేశాలు జారీచేసింది. ఆస్తులు - అప్పులను 58శాతం, 42 శాతం నిష్పత్తిలో రెండు రాష్ట్రాలు పంచుకోవాలని పేర్కొంది. ఈ తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని సుప్రీంకోర్టు చెప్పడంతో ఏపీ, తెలంగాణ ఉద్యోగుల విభజన, నిధులు, పెన్షన్ నిధుల విభజనపై ఒప్పందానికి వచ్చాయి. ఈ ఒప్పందం ప్రకారం పించర్లకు వారి స్థానికత ఆధారంగా ఆయా అకాడమీలు నేరుగా చెల్లింపులు చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత 2022 మే 1న తెలుగు అకాడమీని ఇరురాష్ట్రాల మధ్య విభజించి.. ప్రత్యేక తెలుగు అకాడమీలు ఏర్పాటు చేశారు. ఒప్పందం ప్రకారం తెలంగాణ 11 మందికి.. ఏపీ నలుగురికి పూర్తిస్థాయి పింఛను చెల్లించాల్సి ఉంది. దీనిపై తెలంగాణ తెలుగు అకాడమీ అభ్యంతరం తెలిపింది. విభజన చట్టం ప్రకారం పింఛనర్లు ఏ రాష్ట్రానికి కేటాయించినా.. 42 శాతం తెలంగాణ, మిగతా 58 ఏపీ చెల్లించాలని.. వారిని ఏ రాష్ట్రానికి కేటాయించారనేదాంతో సంబంధం లేదని పేర్కొంది. ఏపీ మాత్రం స్థానికత కలిగిన వారికి పూర్తి స్థాయి చెల్లింపులు చేస్తామని పేర్కొంది. ఈ వివాదం నేపథ్యంలో తమకు పూర్తిస్థాయి పింఛను రావడం లేదని పేర్కొంటూ పిటిషనర్లు మళ్లీ 2023 డిసెంబర్‌లో హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ తుకారాంజీల ధర్మాసనం.. సుప్రీంకోర్టు ఎదుట ఇరు రాష్ట్రాలు అంగీకరించిన ఒప్పందం ప్రకారం.. రెండు రాష్ట్రాలు వారి వైపు నుంచి లాంఛనాలను పూర్తిచేయాలని స్పష్టం చేసింది. ఉద్యోగుల కేటాయింపులకు అనుగుణంగా 15 రోజుల్లోగా ఉద్యోగులు, పింఛనర్ల సర్వీసు రికార్డులు, రిజిస్టర్లను ఒకరికొకరు బదిలీ చేసుకోవాలని పేర్కొంది. పిటిషనర్ల పింఛన్లను మళ్లీ లెక్కగట్టి.. మిగిలిన బకాయిలను రెండువారాల్లో చెల్లించాలని తెలిపింది. ఆలస్యం చేసినందుకు ఆరు శాతం వడ్డీని అదనంగా చెల్లించాలని పేర్కొంది. ఇరు రాష్ట్రాల తెలుగు అకాడమీలు ఈ ఆదేశాలను అమలు చేసి జూన్ 24 లోపు హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)కు నివేదికను సమర్పించాలని తెలిపింది. నివేదికలను ఇచ్చిందీ లేనిదీ పరిశీలించడానికి కేసును జూన్ 27న మళ్లీ లిస్ట్ చేయాలని సూచించింది.



ఎంత నిర్దయురాలివి తల్లీ!

14 ఏళ్ల కూతుర్ని వ్యభిచారంలోకి దించిన మహిళ

జూనియర్ ఆర్టిస్‌గా వచ్చే డబ్బులు సరిపోక వ్యభిచారంలోకి దిగిన బాలిక తల్లి

పాడుపనికి తిరస్కరించిన చిన్నారికి వేధింపులు...రెండేళ్లుగా నరకం..

బాలికను రక్షించిన పోలీసులు.. పెంపుడు తల్లి అని వెలుగులోకి



హైదరాబాద్ సిటీ, మే 11(ఆంధ్రజ్యోతి): ఆ తల్లిది గుండెనా? పాషాణమా? అభం శుభం తెలియని 14 ఏళ్ల కూతుర్ని వ్యభిచారంలోకి దించింది. 'ఆ పాడుపని' నేను చేయలేనమ్మా అని వేడుకున్నా చిత్రహింసలు పెట్టింది. జుట్టు కత్తిరించి.. కర్రతో ఇష్టంవచ్చినట్లు కొట్టింది. ఏడుస్తున్నా కనికరించకుండా బాలికతో వ్యభిచారం చేయించింది. ఇలా ఆ రాకాసి చెరలో చిన్నారి ఏకంగా రెండేళ్లు నరకం చూసింది. జూబ్లీహిల్స్‌లో నివాసం ఉంటూ.. సినిమాల్లో జూనియర్ ఆర్టిస్టుగా పనిచేస్తున్న ఓ మహిళ పాల్పడిన దారుణమిది. ఒంటినిండా గాయాలతో ఇంట్లో బందీగా ఉన్న బాలికను చూసి పోలీసులు చలించిపోయారు. కన్నతల్లి అయివుండి తన పట్ల ఎందుకింత నిర్దయగా వ్యవహరిస్తోందనే విషయం అర్థంకాని ఆ బాధిత బాలికకు తాజాగా ఆమె తన తల్లే కాదనే విషయం తెలిసింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న 38 ఏళ్ల జూనియర్ ఆర్టిస్టు దాదాపు 15 ఏళ్లుగా ఇంట్లోనే వ్యభిచారం నిర్వహిస్తోంది. విటుల డిమాండ్ మేరకు తన స్నేహితురాళ్లనూ ఇంటికి పిలిపించుకునేది. 13 ఏళ్ల క్రితం స్నేహితురాళ్లలో ఒకరు తన ఏడాది బిడ్డను ఆమెకు అప్పగించి నగరం విడిచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి బాలికను ఆమె పెంచుకుంటోంది. బడికీ పంపుతోంది. పెంపుడు కూతురు అనే సంగతి బాలికకు చెప్పకపోవడంతో ఆమే తన తల్లి అని చిన్నారి భావిస్తూవస్తోంది. ఆమె ఇంటికి వచ్చే విటుల్లో కొందరు బాలికపై కన్నేసి, ఎక్కువ డబ్బులిస్తామని మహిళకు ఆఫర్ చేశారు. దీంతో బాలికనూ పాడుపనిలోకి దించాలని భావించి, రెండేళ్ల క్రితమే బడి మాన్పించింది. అప్పటి నుంచి చిన్నారితో బలవంతంగా వ్యభిచారం చేయిస్తోంది. ఇంట్లోంచి బాలిక కేకలను విని స్థానికులు, పోలీసులకు సమాచారమిచ్చారు. వెస్ట్ జోన్ ఇన్‌స్పెక్టర్ జంగయ్య తన బృందంతో ఆ మహిళ ఇంటిపై దాడిచేశారు. బాలిక చేతులు, కాళ్లపై అట్లకాడతో కాల్చిన గాయాలతో పాటు మెడ, పెదవిపైనా గాయాలున్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే బాధిత బాలికను వైద్య పరీక్షలు, చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. నిందితురాలిని పోలీసులు అరెస్టు చేశారు. తనతో పాటు వ్యభిచారంలోకి దిగిన మహిళే తనకు 13 ఏళ్ల క్రితం చిన్నారిని అప్పగించి నగరం విడిచి వెళ్లిపోయిందని ఒకసారి.. బాలికను అప్పగించి చనిపోయిందని మరోసారి నిందితురాలు చెబుతోంది.

ముగిసిన టీఎస్ ఎప్‌సెట్

- అగ్రికల్చర్‌కు 91.50%, ఇంజనీరింగ్‌కు 94.50% హాజరు
- పది రోజుల్లో ఫలితాల వెల్లడికి అధికారుల కసరత్తు

హైదరాబాద్ సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం తెలంగాణ ప్రభుత్వం గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న టీఎస్ ఎప్‌సెట్ పరీక్షలు శనివారం ముగిశాయి. ఈ నెల 7 నుంచి పరీక్షలు ప్రారంభం కాగా వర్షం పడిన తొలిరోజు మినహా మిగిలిన పరీక్షలన్నీ ప్రశాంతంగా ముగియడంతో ఎప్‌సెట్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఐదురోజుల్లో రెండ్రోజులు అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు జరగ్గా, మూడు రోజుల పాటు ఇంజనీరింగ్ పరీక్షలు జరిగాయి. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 1,00,942 మంది నమోదు చేసుకోగా, 91,880 మంది (91.50 శాతం) అభ్యర్థులు హాజరయ్యారు. ఇంజనీరింగ్ పరీక్షలకు 2,54,750 మంది దరఖాస్తు చేసుకోగా, 2,40,617 మంది (94.50 శాతం) అభ్యర్థులు పరీక్షలు రాశారు. కాగా, గతేడాది ఎంసెట్ మాదిరిగానే ఈ ఏడాది ఎప్‌సెట్ పరీక్షా ఫలితాలను పది రోజుల్లో విడుదల చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షల రెస్పాన్స్ షీట్లను వెబ్‌సైట్‌లో ఉంచిన అధికారులు.. ఆదివారం ఉదయం 10గంటల నుంచి ఇంజనీరింగ్ ప్రాథమిక కీ, రెస్పాన్స్ షీట్లను అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. 14లోగా అభ్యంతరాలను స్వీకరించి 20 లేదా 21వ తేదీకల్లా తుది కీతో పాటు ఫలితాలను కూడా వెల్లడించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు.

బకాయిల నోటీసులిస్తే ఆరోపణలు సరికాదు : టీఎస్ఆర్టీసీ

హైదరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ బస్టాండ్ సమీపంలోని షాపింగ్ మాల్ అద్దె బకాయిలు పేరుకుపోవడంతో తక్షణం చెల్లించాలని లీజుదారులకు నోటీసులు జారీ చేసినట్లు టీఎస్ ఆర్టీసీ శనివారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేసింది. 2013లో ఆర్మూర్ బస్టాండ్ సమీపంలో ఖాళీగా ఉన్న 7059 చ.గస్థలాన్ని విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 33 ఏళ్లకు అద్దెకు ఇస్తూ ఆర్టీసీ ఒప్పందం చేసుకుందన్నారు. ఈ స్థలంలో షాపింగ్‌మాల్‌ను నిర్మించినట్టు పేర్కొన్నారు. కాగా, 2017లో విష్ణుజిత్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సతీమణి రజితారెడ్డి టేక్‌ఓవర్ చేసుకుని.. షాపింగ్ మాల్‌కు జీవన్‌రెడ్డి మాల్ అండ్ మల్టీప్లెక్స్‌గా పేరుపెట్టి అందులోని స్టాళ్లను థర్డ్ పార్టీకి లీజ్‌కు ఇచ్చినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఒప్పందం ప్రకారం సకాలంలో కంపెనీ అద్దె చెల్లించలేదన్నారు. 2015 అక్టోబర్ వరకు రూ.4.30 కోట్లు బకాయి పడగా గత అక్టోబర్ నాటికి రూ.8.65 కోట్లకు పేరుకుపోయినట్టు తెలిపారు. అద్దె బకాయిలు చెల్లించాలని నోటీసులు జారీ చేయడంతో లీజుదారులు హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. కోర్టు కూడా బకాయిలన్నీ నెలరోజుల్లో చెల్లించాలని మార్చి 27న ఆదేశించినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు తాము బకాయిలు చెల్లించాలని నోటీసు జారీ చేయడానికి మాల్‌కు వెళ్తే లీజు దారులు లేక పోవడంతో మైక్‌లో ప్రకటించాల్సి వచ్చిందని వివరించారు. మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి టీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులపై అసత్య ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. అద్దె బకాయిల వసూళ్ల విషయంలో రాజీపడేది లేదని అధికారులు స్పష్టం చేశారు.

అభివృద్ధి కావాలంటే

కాంగ్రెస్‌కు ఓటేయాలి

- వంద రోజుల్లోనే సంక్షేమ పథకాలను అమలు చేశాం
- స్కైవేల పనులు చేపట్టాం
- సీఎం సహకారంతో పెండింగ్ పనులు పూర్తి చేస్తాం
- మల్కాజిగిరి అభివృద్ధికి నాది పూచి
- జెడ్పీ చైర్మన్‌గా ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో మల్కాజిగిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి



ఇంటర్వ్యూ...

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్‌కు ఓటేయాలని మల్కాజిగిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిందని చెప్పారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో దిగిన పట్నం సునీతారెడ్డి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సునీతారెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. తమది అభివృద్ధి, సంక్షేమ బాట అని అన్నారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రజలు ప్రయోజనం పొందుతున్నారని చెప్పారు. ఎన్నికల్లో గెలిపిస్తే సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. గతంలో ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్‌గా ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషిచేశానని, ఎంపీగా అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

పార్టీ కేడర్ సహకారంతో ముందుకు..

కాంగ్రెస్ కేడర్ ఈ ఎన్నికల్లో గెలుపు కోసం ఎంతో కష్టపడి పనిచేస్తున్నారు. మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో ఒక్క ఎమ్మెల్యే లేకపోయినా కేడర్ కాంగ్రెస్ గెలుపు కోసం శ్రమిస్తున్నారు. అక్కడక్కడ చిన్న, చిన్న సమస్యలు ఉన్నా అందురూ సర్దుకుపోతున్నారు.

గెలిపిస్తే కష్టపడి పనిచేస్తా

మల్కాజిగిరి నియోజకవర్గం దేశంలోనే పెద్దది. చెన్నారెడ్డి, దేవేందర్ గౌడ్, సర్వే సత్యనారాయణ, ఉమా వెంకట్రామిరెడ్డి తదితర నేతలు ఇక్కడి నుంచే రాజకీయాల్లో ఎదిగారు. ఇక్కడ నుంచి గత ఎన్నికల్లో గెలిచిన రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి సీఎం అయ్యారు. ఎంతోమంది రాజకీయ నేతలకు అవకాశం కల్పించిన ఈ ప్రాంత ప్రజలు ఈసారి నన్ను ఆదరించాలని కోరుతున్నా. ఎన్నికల్లో గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కష్టపడి పనిచేస్తా. అభివృద్ధికి పూచీ తీసుకుంటా. గతంలో ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేసిన సమయంలో మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలోని ప్రాంతాల అభివృద్ధికి ఎంతో కృషి చేశా. నియోజకవర్గంలో ట్రాఫిక్, రోడ్ల సమస్యలు ఉన్నాయి. మౌలిక సదుపాయాలు లేక బస్తీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు కాలనీలు, బస్తీలు మునిగిపోతున్నాయి. సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణ పనులకు, రోడ్ల విస్తరణకు రూ. 50 నుంచి 60 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా. వీటిని తక్షణమే చేపట్టి ప్రజలకు ఇబ్బందుల నుంచి శాశ్వతంగా విముక్తి కలిగిస్తాం.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అన్నివర్గాల వారికి సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందుతున్నాయి. మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో పెండింగ్‌లో ఉన్న స్కైవే నిర్మాణ పనులను ప్రారంభించాం. త్వరలో నియోజకవర్గ పరిధిలో మెట్రో రైలు నిర్మాణ పనులు చేపట్టబోతున్నాం. పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం ప్రభుత్వం అనేక ప్రణాళికలు అమలు చేయనుంది. ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మాకు పోటీనే కాదు.

సండే సెలబ్రిటీ



అజయ్ ఘోష్.. ఈ పేరు వినగానే ఏ బెంగాలీ నటుడో అనిపిస్తుంది. కానీ ఆయన పక్కా లోకల్. అచ్చంగా తెలుగోడు. ఆయన తండ్రి కమ్యూనిస్ట్ పార్టీ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అజయ్ ఘోష్‌కు అనుచరుడు. అందుకే కొడుక్కి ఆ పేరు పెట్టుకున్నారు. 'ప్రస్థానం' చిత్రంతో దాదాపు పదిహేనేళ్ల క్రితం సినీ రంగంలో నడక ప్రారంభించి, ప్రస్తుతం పరిశ్రమలో పరుగులు పెడుతున్న అజయ్ ఘోష్ 'నవ్య'కు ఇచ్చిన ఇంటర్వ్యూ.

వద్దన్నా ఆ వేషం వేయించారు

కంగ్రాట్స్.. మీరు కూడా హీరోల లిస్టులో చేరారుగా

హీరో అనే పెద్ద పదాలు వద్దు సామీ! 'మ్యూజిక్ షాప్ మూర్తి'లో నాది ప్రధాన పాత్ర.. అంతే. కరోనాకు ముందు పాలడుగు శివ అనే దర్శకుడు నా దగ్గరకు వచ్చి, ఈ కథ చెప్పాడు అప్పటికి 'పుష్ప' కూడా రాలేదు. చిన్న చిన్న వేషాలతో నెట్టుకొస్తున్నా. అందుకే ఆలోచించుకోమని చెప్పా. సరేనని వెళ్లిపోయి, మళ్లీ రెండేళ్ల తర్వాత ఒక రోజు పొద్దున్నే వేటపాలెంలో మా ఇంటికి వచ్చి "మీరు చేస్తానంటే కథను డెవలప్ చేసుకుంటా" అన్నాడు. మరోసారి కథ చెప్పించుకుని విన్నా. "రాజేంద్రప్రసాద్, నరేశ్ లాంటి పెద్ద ఆర్టిస్టులు ఉన్నారు కదా! నా దగ్గరకే ఎందుకు వచ్చావు?" అని అడిగా. "ఈ తరహా పాత్రలు వాళ్లు చాలా చేసేశారు. మీరు చేస్తే వెరైటీ అవుతుంది" అని నన్ను కన్విన్స్ చేశాడు. అతని తపన చూసి 'సరే' అన్నా. 'మ్యూజిక్ షాప్ మూర్తి' పాత్ర నాకు కూడా బాగా కనెక్ట్ అయింది. మూర్తికి ఇంటా, బయట అన్నీ ప్రతికూల పరిస్థితులే. అయినా అనుకున్నది అతను ఎలా సాధించాడన్నదే కథ.

సుకుమార్ డ్యాన్స్ చేశారు...

తమిళంలో నేను 'మూక్కుత్తి అమ్మన్' అనే చిత్రంలో నటించాను. తెలుగులో అది 'అమ్మోరు తల్లి' పేరుతో విడుదల అయింది. అందులో నయనతార, నేను పాల్గొన్న సాంగ్ బాగా హిట్ అయింది. 'పుష్ప' షూటింగ్‌లో ఒకసారి రెండు వందల మంది యూనిట్ సభ్యుల ముందు డాన్సు చేస్తూ "ఆ పాటకు నువ్వు ఇలాగే డ్యాన్స్ చేశావు కదూ" అన్నారు సుకుమార్. నన్ను ఎంతో ఎంకరేజ్ చేశారాయన. నా కోసం నెల రోజుల పాటు షూటింగ్ కూడా ఆయన వాయిదా వేయడానికి కూడా సిద్ధమయ్యారని తెలిసి కళ్లు చెమర్చాయి.

వేషాల కోసం అలుపెరుగని పోరాటం చేసి, ఈ స్థాయికి చేరుకున్నారు. వెనక్కి తిరిగి చూసుకుంటే ఏమనిపిస్తోంది?

నాకు మొదటి నుంచీ నటన అంటే పిచ్చి. సినిమాల్లో నటించాలనీ, సత్యనారాయణ, నాగభూషణం, కోట శ్రీనివాసరావు లాగా విలన్ పాత్రలు పోషించాలనీ కలలు కనేవాణ్ణి. కానీ పరిశ్రమలో ఎవరితోనూ పరిచయాలు లేవు. అయినా ఏదో ఆశ, నమ్మకం. వేషాల కోసం తిరగని చోటు లేదు. సినిమాల్లో ఛాన్సు దొరకక్క యూసఫ్‌గూడ అడ్డాలో నిల్చొని, కూలి పనులకు వెళ్లిన రోజులు కూడా ఉన్నాయి. అవి కూడా దొరకని రోజున మా ఊరికి వెళ్లి, ఆశ చంపుకోలేక మళ్లీ ఇక్కడికి వచ్చేవాణ్ణి. ఇదంతా చూసి ఓ రోజు మా ఆవిడ ఒక మాట అంది. 'సినిమాల్లో అవకాశాల కోసం వెళ్లిన వాడివి అక్కడే ఉండి కొంత కాలం ప్రయత్నం చెయ్యి. మళ్లీ మళ్లీ ఇలా తిరిగి వస్తుంటే ఇక్కడి వాళ్లకి సమాధానం చెప్పడం కష్టమవుతోంది. పిల్లల విషయం నేను చూసుకుంటాను. నువ్వు వెళ్లు" అని ధైర్యం చెప్పింది. తను కూడా పొలంలో కూలి పనులకు వెళ్లి పిల్లల్ని చూసేది. ఆ రోజుల్లో మా ఊరి నుంచి హైదరాబాద్ రావాలంటే టికెట్ ఖరీదు 105 రూపాయలు. అవి కూడా నా దగ్గర లేకపోవడంతో మా ఆవిడ అప్పు చేసి ఇస్తే ట్రైన్ ఎక్కా. సికింద్రాబాద్‌లో రైలు దిగిన తర్వాత... చేతిలో డబ్బు లేకపోవడంతో అక్కడి నుంచి యూసఫ్‌గూడ వరకూ నడుచుకుంటూ వచ్చిన రోజుల్ని మరిచిపోలేను.



"నిరుపేద కుటుంబం కదా. రెండు జతల బట్టలే ఉండేవి. కొనుక్కుందామంటే డబ్బు ఉండేది కాదు. నా పరిస్థితి చూసి నా స్నేహితులు జాలిపడి... వాళ్ల అన్నయ్యలు వాడిన బట్టల్ని నాకు తెచ్చి ఇచ్చేవారు. కొంచెం లూజుగా ఉన్నా మొహమాటపడకుండా అవే వేసుకునేవాణ్ణి. ఇప్పటికీ ఇలాగే ఉండడం ఇష్టమయ్యా. లుంగీ, ఖద్దరు షర్ట్, పైన టవల్... ఇదే నాకు కంఫర్ట్."

ప్రారంభంలో అవమానాలు ఎదుర్కొన్నారా?

కామాక్షి మూవీస్ సంస్థలో చెంచురెడ్డి అని ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ ఉండేవాడు. ఆయన్ని ఓసారి కలవమని మిత్రుడు చెబితే యూసఫ్‌గూడ నుంచి భారతీయ విద్యాభవన్ స్కూల్ దగ్గర ఉన్న వాళ్ల ఆఫీసుకు నడుచుకుంటూ వెళ్లా. అప్పట్లో నా అవతారం వేరేగా ఉండేది. లూజు ప్యాంటు, బట్టతల, రబ్బరు చెప్పులు. చెంచురెడ్డిని కలవగానే ఆయన ఏ చిరాకులో ఉన్నాడో ఏమో... "ఆయన చెప్పగానే నీకు వేషం ఇచ్చేస్తారా? అద్దంలో నీ ముఖం చూసుకున్నావా? నాగార్జునగారికి ఖాళీ లేదంట. పోనీ నువ్వు చేస్తావా హీరోగా..." అని వేళాకోళంగా మాట్లాడాడు. 'ఏవిటిలా మాట్లాడుతున్నాడు?' అని అప్పుడు బాధ కలిగినా... నాలాంటి వాళ్లు రోజూ చాలా మంది వస్తుంటారు కనుక అతనికున్న టెన్షన్‌లో అలా అని ఉంటాడని సరిపెట్టుకున్నా. ఇలా అవమానాలు సహిస్తూ, వేషాల కోసం తిరిగి తిరిగి విసుగు పుట్టేది. ఆ రోజుల్లో యాపిల్ పండు కొనుక్కొని తినాలనే కోరిక చాలా బలంగా ఉండేది. మనసు చంపుకోలేక ఓ రోజు యూసఫ్‌గూడ చెక్‌పోస్ట్‌లో ఉన్న షాప్‌లో యాపిల్ రేటు ఎంతో అడిగా. 30 రూపాయలో, 40 రూపాయలో చెప్పాడు. 'అంత డబ్బు ఉంటే నాకు రెండు రోజులు గడుస్తాయి కదా' అనుకొని... "తక్కువకి రాదా?" అని అడిగాను. 'నీది కొనే మొహమేనా' అన్నట్టు నా వంక చూసి "ఛలో... ఛలో" అన్నాడు షాపతను. ఇప్పుడు ఇంత సంపాదిస్తున్నా... డబ్బు విలువ నాకు తెలుసు. అందుకే ఖర్చు పెట్టడానికి వెనకా ముందు ఆలోచిస్తుంటా. నాది చాదస్తం అనుకోవచ్చు. అనుకున్నా నేనేమీ ఫీల్ అవను.

"'రంగస్థలం' తర్వాత ఏర్పడిన నమ్మకం 'పుష్ప'తో బలపడింది. 'హమ్మయ్య నాకు పని దొరుకుతోంది' అనుకుంటూ ఉన్నాను. ఆ ధైర్యంతోనే మా ఊళ్లో ఇల్లు కట్టుకున్నా. నాకు ఇద్దరు పిల్లలు. పెద్దవాడు చంద్రశేఖర్ ఆజాద్‌కు పెళ్లయింది. ఉద్యోగం చేస్తున్నాడు. చిన్నవాడు భగత్‌సింగ్ వ్యాపారం ప్రారంభించే ఆలోచనలో ఉన్నాడు. వాడికి కూడా పెళ్లి చేస్తే నా బాధ్యత తీరినట్లే."

'జ్యోతిలక్ష్మి' తర్వాత కూడా మీకు అవకాశాలు పెద్దగా రాలేదు కదా...

అదో విచిత్రం సామీ. మీకు చెప్పాలి. షూటింగ్ పూర్తయిన తర్వాత ఓ రోజు పూరి జగన్నాథ్ ఫోన్ చేసి "ఇప్పుడే ఎయిర్‌పోర్ట్‌లో నాగబాబు కలిశారు. "చాలా బాగుంది రా. మంచి నటుణ్ణి తీసుకొచ్చావు" అని నీకు కాంప్లిమెంట్ ఇచ్చాడు అజయ్" అని చెప్పగానే పొంగిపోయా. ఆ సినిమా రిలీజ్ అయ్యాక బాగా చేశావని అందరూ పొగుడుతూ ఉంటే.. 'హమ్మయ్య కష్టాలు గట్టెక్కాయి' అనుకున్నా. అయితే ఒక్క కొత్త వేషం కూడా రాలేదు. ఏడాది గడిచిపోయింది. కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. అద్దె కట్టడం కూడా కష్టమవుతుండడంతో మళ్లీ పూరి జగన్నాథ్ దగ్గరకు వెళ్లి నా కష్టాలు చెప్పుకొన్నా. "దిగులు పడకు. నీకు మంచి రోజులు వస్తాయి. నీ గురించి పాత్రలు రాసుకొనే రోజులు వస్తాయి. కొంచెం ఓపిక పట్టు" అని ధైర్యం చెప్పారు. దేవుడి దయ వల్ల ఆయన మాటలు నిజమయ్యాయి. తమిళంలో 'విశారణై' చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. ఆ సినిమా చూసి నాకు 'రంగస్థలం'లో అవకాశం ఇచ్చారు సుకుమార్. ఇక 'పుష్ప' చిత్రం నన్నెక్కడికో తీసుకెళ్లింది. మీకో గమ్మత్తు విషయం చెప్పనా.. 'పుష్ప' సినిమాలో నటించడానికి నేను మొదట ఒప్పుకోలేదు. "నేను చేయను మొర్రో" అంటున్నా వినకుండా కన్విన్స్ చేసి ఆ వేషం చేయించారు.

హిందీలో యశ్‌రాజ్ ఫిల్మ్స్ వాళ్లు ఓ సినిమాకు అడిగారు. భాష మీద పట్టు ఉంటే చేయగలం కానీ హిందీ బొత్తిగా రాదు. అందుకే ఏదో చెప్పి తప్పించుకున్నా. ఇప్పుడు సన్నీ డియోల్‌తో మలినేని గోపీచంద్ తీస్తున్న చిత్రంలో విలన్‌గా చేయడానికి ఓకే చెప్పా.

ఎందుకు చేయనన్నారు?

ఆ సమయంలో కరోనాతో బాధ పడుతున్నా. ఇంట్లోనే ఉంటున్నా. అడుగు తీసి అడుగు వేయడమే కష్టమైన పరిస్థితి. 'ఇక నా పని అయిపోయింది. చచ్చిపోవడం ఖాయం' అనుకున్నా. ఆ సమయంలోనే 'పుష్ప' సినిమా కోసం ఫోన్ చేశారు. "నాకు సినిమాలూ వద్దు. ఏమీ వద్దు. ఇలా బతకనివ్వండి చాలు" అని చెప్పేశాను. చాలా సార్లు ఫోన్లు చేసినా అదే మాట చెప్పేవాణ్ణి. చివరికి ఒక రోజు సుకుమార్ ఫోన్ చేసి అరగంట సేపు నాతో మాట్లాడారు. సుకుమార్‌గారు ఒకటే అన్నారు.. "అజయ్ నువ్వు ఈ సినిమాలో నటించవద్దు. కానీ ఎంతకాలం అక్కడ ఒంటరిగా ఉంటావు. ఒకసారి మనుషుల్లోకి రా. మేమందరం ఇక్కడ పని చేస్తున్నాం. మాతో పాటే నువ్వూ" అని ఆయన చెప్పగానే "వస్తున్నాను సార్" అనేశా. మారేడుమిల్లి అడవుల్లో షూటింగ్. నా కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు నిర్మాతలు.

• వినాయకరావు

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/qm3Z9T4 లో చదవండి.

'దిక్సూచి' వెబ్ పేజీలో... సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Pm4E283లో చదవండి.



అలనాటి కథ

ఆయనంటే నిజాంకు ఎంతో గౌరవం



స్వాతంత్ర్యోద్యమంలో చురుగ్గా పాల్గొని ప్రజా సేవలో నిమగ్నమైన అనేకమంది సమర్థులు నిజాం ప్రభుత్వంలో ఉన్నత స్థానాలు పొందారు. అలాంటివారిలో నవాబ్ చహతారి ఒకరు. నిజాం ప్రభుత్వంలో ప్రధానిగా పని చేసి, రజాకార్ ఉద్యమ సమయంలో తన పదవికి రాజీనామా చేసిన నవాబ్ చహతారి గురించి అతి తక్కువ మందికి తెలుసు. మహరాజా కిషన్‌ప్రసాద్ తర్వాత హైదరాబాద్ ప్రధానిగా పదవి చేపట్టిన చహతారితో నాకు వ్యక్తిగత పరిచయం కూడా ఉంది.

డిసెంబర్ 1944... చలికాలం. ఒకప్పుడు హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో అన్నీ పొలాలే ఉండేవి. దీనివల్ల చలి కూడా ఎక్కువగా ఉండేది. తేదీ గుర్తు లేదు కానీ ఒక రోజు మా నాన్న రాజా ధన్‌రాజ్‌గిర్ నన్ను పిలిచి... "మనకు కొత్త ప్రధానమంత్రి వచ్చారు. ఆయన గౌరవార్థం మనం పార్టీ ఇస్తున్నాం. నువ్వు వారికి ఆతిథ్యం ఇవ్వాలి" అని చెప్పారు. ఆ మర్నాడు ప్యాలెస్ అంతా పండుగ వాతావరణం నెలకొంది. ప్యాలెస్ అంతా దీపాలతో అలంకరించారు. సాయంత్రం అతిథులు అందరూ రావటం మొదలుపెట్టారు. ప్యాలెస్ పోర్టికోలో ఒక పెద్ద కారు వచ్చి ఆగింది. నాన, నేను, తమ్ముళ్లు కలిసి నవాబ్ సాబ్‌కు స్వాగతం చెప్పటానికి పోర్టికోలోకి వెళ్లాం. నాన్న నవాబ్ సాబ్‌కు షేక్‌హ్యాండ్ ఇచ్చి... "వెల్‌కం టూ హైదరాబాద్" అని స్వాగతించారు. నవాబ్ సాబ్ ఒక తెల్లటి షెర్వానీ వేసుకున్నారు. వాటికి డైమండ్ బటన్స్ మెరుస్తూ కనిపించాయి. ఆ తర్వాత నాన్న, నవాబ్‌సాబ్ అతిథులందరూ వేచి చూస్తున్న డిన్నర్ టేబుల్ దగ్గరకు వెళ్లిపోయారు. తమ్ముళ్లిద్దరూ నన్ను వదిలేసి ఆడుకోవటానికి పారిపోయారు. నేను, మా గవర్నెస్ మాత్రం గేటు దగ్గరే ఉండిపోయాం. ఈ లోపు నాన్న నా కోసం కబురు పంపారు. ఆ సమయంలో నేను చిన్నపిల్లనే అయినా... ఏవైనా పార్టీలు అయినప్పుడు చీర కట్టేవారు. నాకు ఆ చీర ఊడిపోతుందనే భయం ఉండేది. దాంతో నా దృష్టంతా చీర మీదే ఉండేది. అటు ఇటూ కదలాలంటే చాలా కష్టపడాల్సి వచ్చింది. నెమ్మదిగా నడుచుకుంటూ నాన్న దగ్గరకి వెళ్లా. నాన్న నన్ను నవాబ్ సాబ్‌కు పరిచయం చేశారు. నేను ఆయనకు ఆదాబ్ చేసి, ఆశీర్వాదం తీసుకున్నా. ఆ తర్వాత ఏం చేయాలో అర్థం కాలేదు. దూరంగా ఒక కుర్చీ లాక్కొని కూర్చున్నా. మా అమ్మ కోసం వెతికా. ఆ రోజుల్లో పార్టీలు అయితే మహిళలు పై అంతస్తులో వేరుగా కూర్చుని, కింద ఉన్న మగవాళ్లను చూస్తూ ఉండేవారు. అమ్మ పై అంతస్తులో కూర్చుని మిగిలిన అతిథులతో మాట్లాడుతోంది. నాకు ఏం చేయాలో తెలియక అక్కడే కూర్చుండిపోయా. కాసేపటి తర్వాత ప్రముఖ గాయని కేసరిబాయ్ ఖేడ్కర్ కచేరీ కోసం అందరూ మ్యూజిక్ రూమ్ వైపు వెళ్లారు. ఆ రోజుల్లో కేసరీబాయ్‌కు దేశ వ్యాప్తంగా మంచి పేరు ఉండేది. ఆమె చాలాసార్లు జ్ఞాన్‌బాగ్ ప్యాలెస్‌కు వచ్చి నెల రోజుల వరకూ ఉండేవారు. ఆమె గానాన్ని వినటానికి అనేకమంది అతిథులు వస్తూ ఉండేవారు. నవాబ్ సాబ్‌కు సంబంధించి ఇది నా తొలి జ్ఞాపకం.

నా చిన్నప్పుడు రాజ కుటుంబాలలోని మహిళలు పరదా పద్ధతిని పాటించేవారు. సాధారణంగా రాజ కుటుంబాలకు చెందిన మహిళలు బయటకు వెళ్లాల్సి వస్తే నల్ల అద్దాలు ఉన్న కార్లనే వాడేవారు. ఎప్పుడైనా మేము బొంబాయికి వెళ్తే... అక్కడ రైల్వే స్టేషన్‌లో మా కోసం ఒక పెద్ద గొడుగు పట్టుకొని ఒక మహిళ ఉండేది. ఆ గొడుగును అడ్డం పెట్టి మమ్మల్ని కార్ల దాకా తీసుకువెళ్లేవారు.

ఆ తర్వాత కాలంలో కూడా నేను చాలాసార్లు నవాబ్ సాబ్‌ను కలిశాను. ఆయన ఇతరులు చెప్పే విషయాన్ని చాలా జాగ్రత్తగా వినేవారు. ఆ తర్వాత సమాధానం కూడా చాలా సూటిగా ఉండేది. బహుశా ఈ గుణాలవల్లే ఆయన జాతీయోద్యమంలో ఒక ముఖ్య పాత్ర



పోషించగలిగారేమో. అవిభాజ్య భారత దేశంలోని యునైటెడ్ ప్రావిన్స్‌లో ఆయన మంత్రిగా పని చేశారు. 1930లో లండన్‌లో జరిగిన తొలి రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ముస్లిం డెలిగేషన్‌లో నవాబ్ సాబ్ కూడా సభ్యుడు. ఆయనకు గాంధీజీతో చాలా సన్నిహిత సంబంధాలు ఉండేవి. జిన్నా సిద్ధాంతాలతో ఆయన విభేదించేవారు. కానీ, ఆయనకు ఉన్న విషయ పరిజ్ఞానాన్ని నిజాం చాలా మెచ్చుకొనేవారు. ప్రస్తుతం ఖైరతాబాద్‌లో ఉన్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ భవనానికి పునాది వేసింది నవాబ్ సాబే. 1947 జూలైలో హైదరాబాద్‌కు స్వతంత్ర ప్రతిపత్తి ఇవ్వాలని అప్పటి గవర్నర్ జనరల్ లార్డ్ మౌంట్ బాటెన్‌ను కోరటానికి నవాబ్ సాబ్‌ను, తన రాజ్యాంగ సలహాదారు వాల్టర్ మానక్టన్‌ను ఢిల్లీ పంపాలనుకున్నారు. అయితే ఈలోపే రజాకార్ల దాడులు ప్రారంభమయ్యాయి. దీంతో నవాబ్ సాబ్ తన పదవికి రాజీనామా చేశారు. అయితే దీన్ని నిజాం అంగీకరించలేదు. నవాబ్ సాబ్ పట్ల నిజాంకు ఉన్న గౌరవాన్ని ఈ సంఘటన తెలియజేస్తుంది.

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

నవ్య | చిత్రజ్యోతి

ఇది మురుగడి మాయ



చిత్తూరు జిల్లా కుప్పంలో 1989లో జరిగిన సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకుంటున్న చిత్రం 'హరోంహర'. ఇందులో హీరోగా నటిస్తున్న సుధీర్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా 'మురుగడి మాయ' పాటను విడుదల చేశారు. ప్రపంచంలో జరిగే ప్రతి చర్యకు కారణమైన మురుగన్ శక్తిని నిర్వచిస్తూ సాగే ఈ పాటను కుప్పం యాసలో భరద్వాజ పాత్రుడు రాశారు. చైతన్ భరద్వాజ్ స్వరపరిచారు. సుధీర్‌బాబు, సునీల్ స్నేహాన్ని వివరించే పాట ఇదని దర్శకుడు జ్ఞానసాగర్ ద్వారక చెప్పారు. మాళవిక శర్మ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని సుమంత్ జి. నాయుడు నిర్మిస్తున్నారు.

స్టాండింగ్ ఒవేషన్ దక్కుతోంది




మోహన్ భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ నటించిన చిత్రం 'ఆరంభం'. అజయ్ నాగ్ వి దర్శకత్వం వహించగా అభిషేక్ వీటీ నిర్మించారు. ఈ ఎమోషనల్ థ్రిల్లర్ ఇటీవలే విడుదలై హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శనివారం సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత అభిషేక్ వీటీ మాట్లాడుతూ "సినిమా చూసిన వారందరిని నుంచి మంచి ఫీడ్‌బ్యాక్ రావడం సంతోషంగా ఉంది" అని అన్నారు. దర్శకుడు అజయ్ వి నాగ్ మాట్లాడుతూ "ఈ సినిమా క్లైమాక్స్‌కు పలు థియేటర్లలో స్టాండింగ్ ఒవేషన్ దక్కుతోంది. ఇంతలా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు" తెలిపారు. హీరో మోహన్ భగత్ మాట్లాడుతూ "ఈ సినిమాకు ప్రతీ షోకు ఆదరణ పెరుగుతోంది" అని అన్నారు.

పోలీస్ ఆఫీసర్ కథ



గ్లామర్ కథానాయిక పాయల్ రాజ్‌పుత్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా తొలిసారిగా నటిస్తున్న చిత్రం 'రక్షణ'. క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని ప్రణదీప్ ఠాకూర్ దర్శకుడు. 'ఇప్పటివరకూ పాయల్ పోషించిన పాత్రలకు భిన్నంగా ఉండే సినిమా ఇది. ఒక పోలీస్ ఆఫీసర్ జీవితంలో జరిగిన సంఘటన స్ఫూర్తితో రాసిన కథతో చిత్రం రూపుదిద్దుకుంది. సీట్ ఎడ్జ్ క్రైమ్ థ్రిల్లర్ ఇది. త్వరలోనే విడుదల చేస్తాం' అని ఆయన చెప్పారు. రోషన్, మానస్, రాజీవ్ కనకాల, వినోద్ బాల, శివన్నారాయణ తదితరులు నటించిన ఈ చిత్రానికి ప్రణదీప్ ఠాకూర్ నిర్మాత.



నవ్విస్తూనే భయపెట్టే ఓ మంచి ఘోస్ట్

హారర్, కామెడీ జానర్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'ఓ మంచి ఘోస్ట్'. శంకర్ మార్తాండ దర్శకత్వం వహిస్తున్నారు. వెన్నెల కిశోర్, నందిత శ్వేతా, షకలక శంకర్, నవమి గాయక్, నవీన్ నేని, రజత్ రాఘవ్, రఘుబాబు నటిస్తున్నారు. డాక్టర్ అబినికా ఇనాబతుని నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేశారు. ఇందులోని సన్నివేశాలను చూస్తుంటే థియేటర్‌లో ప్రేక్షకులను నవ్విస్తూనే భయపెట్టేలా ఉంది. ఈ చిత్రానికి ఎడిటర్: ఎం.ఆర్.వర్మ, సినిమాటోగ్రాఫర్: ఐ ఆండ్రూ, సంగీతం: అనూప్ రూబెన్స్

సత్యభామ సాహసం



కాజల్ అగర్వాల్ కీలక పాత్ర పోషిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ 'సత్యభామ'. నవీన్‌చంద్ర మరో ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. నేరస్తులను పట్టుకోవడంలో పోలీస్ ఆఫీసర్‌గా కాజల్ చేసే సాహసాల్ని 'వెతుకు వెతుకు' అనే పాటలో చూపిస్తున్నారు. ఈ పాటను ఈ నెల 15న విడుదల చేయనున్నారు. సుమన్ చిక్కాల దర్శకత్వంలో బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మిస్తున్నారు. 'మేజర్' చిత్ర దర్శకుడు శశికిరణ్ తిక్క సమర్పకుడు. త్వరలో సినిమాను విడుదల చేస్తామని ఆయన చెప్పారు,



అన్నా చెల్లెలి అనుబంధంతో...

రామ్ మిట్టకంటి, పవిత్ర, కస్వి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'చిట్టి పొట్టి'. భాస్కర్‌యాదవ్ దాసరి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఇటీవలే ఈ సినిమా ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు చిత్ర బృందం. "అన్నా చెల్లెలి అనుబంధంతో నడిచే ఈ సినిమాలో అన్ని రకాల ఫ్యామిలీ ఎమోషన్స్ ఉంటాయి. ఒక ఆడపిల్లకి పుట్టింటిపై ఉన్న మమకారాన్ని తెలిపేలా సినిమా ఉంటుంది" అని నిర్మాత భాస్కర్‌యాదవ్ దాసరి తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: బాలకృష్ణ బోయ, కెమెరామెన్: మల్హర్భట్ జోషి, సంగీతం: శ్రీ వెంకట్.

మళ్లీ వస్తున్న అపరిచితుడు



తెలుగు సినీ ప్రేక్షకులను మరోమారు అలరించడానికి చియాన్ విక్రమ్ 'అపరిచితుడు' వస్తున్నాడు. దేశం గర్వించదగిన దర్శకులలో ఒకరైన ఎస్.శంకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం రీరిలీజ్‌కు సిద్ధమైంది. ఇందులో విక్రమ్ మూడు వైవిధ్యభరిత పాత్రలు పోషించి అప్పట్లో ప్రేక్షకుల ప్రశంసలు పొందారు. ప్రపంచ వ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించి, బ్లాక్ బస్టర్ హిట్ అయింది. ఫ్రెంచ్ భాషలోకి అనువాదం చేసిన తొలి భారతీయ చిత్రంగా చరిత్రలో నిలిచిన 'అపరిచితుడు' చిత్రాన్ని, 700కు పైగా థియేటర్లలో విడుదల చేయనున్నారు.

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.8 కనిష్ఠం 25.2

ఓటెయ్యండి... ఆఫర్ పొందండి

- ఊరెళ్లటానికి టికెట్‌పై ఆఫర్ ఇస్తున్న ట్రావెల్ యాప్‌లు
- సిటీలో పోలింగ్‌స్టేషన్‌కు ఉచిత రైడ్
- ఆస్పత్రిలో ఉచిత కన్సల్టేషన్

10

ప్రయాణ కష్టాలు

స్వగ్రామాలకు వెళ్లేందుకు పడరానిపాట్లు



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మే 11 (ఆంధ్రజ్యోతి) ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు నగరంలో ఉంటున్న ఆంధ్రా ఓటర్లు రైలెక్కుతున్నారు. లక్షలాదిమంది ప్రయాణికులు రావడంతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ శనివారం కిక్కిరిసిపోయింది. రైళ్లలో రిజర్వేషన్లు దొరకనివారు కిక్కిరిసిన జనరల్ బోగీల్లో ప్రయాణం చేసేందుకు కుస్తీలు పట్టారు. భార్యాపిల్లలతో వెళ్తున్నప్పటికీ ఎంత కష్టమైనా సరే.. ఊరు చేరితే చాలన్నట్లుగా పోటీ పడ్డారు. అయితే, రిజర్వేషన్ బోగీలో సాధారణ ప్రయాణికులు ఎక్కకుండా ఉండేందుకు శనివారం ఆర్పీఎఫ్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ సీఐ సారస్వత్ తెలిపారు. మరోవైపు జేబీఎస్, ఎంజీబీఎస్ బస్‌స్టేషన్లతోపాటు ప్రైవేట్ బస్ ఆపరేటర్ల పాయింట్లు కూడా కిటకిటలాడాయి. ఓటు వేసేందుకు నగరం నుంచి భారీగా ప్రజలు తరలి వెళ్లారు. శనివారం రాత్రి ఏపీ వైపు వెళ్లే బస్సులతో కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, అమీర్‌పేట, లక్డీకపూల్ తదితర ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది.




కేపీహెచ్‌బీ బస్టాండ్ వద్ద ట్రాఫిక్‌జామ్


ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్ సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నిక, లోక్‌సభ ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని హైదరాబాద్ సీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శనివారం గోషామహల్‌లోని శివకుమార్‌లాల్ స్టేడియం, పేట్లబురుజులోని సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ సిబ్బంది, హోంగార్డులు, టీఎస్ న్యాబ్, టీఎస్ఐసీసీసీ, సీసీఎస్ అధికారులతో సీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మద్యానికి అడ్డుకట్ట వేయడం, నగదు పంపిణీని అరికట్టడం, నాయకులు ఓటర్లకు పంపిణీ చేయడానికి ప్రయత్నించే ఉచితాలను స్వాధీనం చేసుకోవడం గురించి వివరించారు. కల్యాణ మండపాలు, లాడ్జీలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూల నిర్వహణ, పోలింగ్ సిబ్బంది ఇచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద సాయంత్రం 6 తర్వాత కూడా ఓటర్లు ఎక్కువ సంఖ్యలో క్యూలో ఉంటే ప్రిసైడింగ్ అధికారి సూచనతో ఓటు వేయడానికి అనుమతించనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్స్ అనుమతించొద్దని పోలీసులను ఆదేశించారు.



సమావేశంలో సీపీ శ్రీనివాస్‌రెడ్డి





ముగిసిన ప్రచారం

- చివరిరోజు నేతల ఉరుకులు.. పరుగులు
- బస్తీ ఓటర్లే లక్ష్యంగా ర్యాలీలు, ఆఫర్లు

ఎన్నికల ప్రచారం చివరిరోజు శనివారం బస్తీలన్నీ ఉదయం 7గంటల నుంచే హోరెత్తాయి. పార్లమెంట్ పరిధిలో ప్రధాన పార్టీలకు చెందిన నేతలంతా ఎవరికి వారే నియోజకవర్గాలు, డివిజన్లలో ఎన్నికల ప్రచారం కొనసాగించారు. సికింద్రాబాద్, హైదరాబాద్, మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో బస్తీల్లో నేతలు ఉదయం కార్యకర్తలకు టిఫిన్లు, మధ్యాహ్నం భోజనాలు పెట్టించి సాయంత్రం వరకు ప్రచారం ముగించారు. బస్తీల ఓటర్లే లక్ష్యంగా ప్రధానపార్టీల నేతలు చివరిరోజు ప్రచారం చేస్తూ ముందుకుసాగారు. నియోజకవర్గాల్లో చివరి రోజు ఓ పక్క ప్రచార రథాలు, మరోవైపు ప్రధాన పార్టీల ర్యాలీలతో సందడి వాతావరణం నెలకొంది. బస్తీల్లో పార్టీ ఓటింగ్ శాతం పెంచే స్థానిక నేతలకు ఫలితాల తర్వాత ప్రత్యేక బహుమతులిస్తామంటూ కొంతమంది నియోజక వర్గాల ఇంచార్జ్‌లు ఆఫర్లు ప్రకటించారు.

-హైదరాబాద్ సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి)

చివరి ప్రచారంలో ఎవరెక్కడంటే..

- టి.పద్మారావుగౌడ్(బీఆర్ఎస్) ముషీరాబాద్‌లో మాజీమంత్రి కేటీఆర్‌తో కలిసి మైనారిటీల సమావేశంలో పాల్గొన్నారు.
- దానం నాగేందర్ (కాంగ్రెస్) బంజారాహిల్స్‌లో బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.
- బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి శుక్రవారం ప్రధాని మోదీ సభతో తన ఎన్నికల ప్రచారాన్ని నిలిపివేశారు.
- రాగిడి లక్ష్మారెడ్డి(బీఆర్ఎస్) ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో కలిసి రామంతాపూర్‌లో బైక్ ర్యాలీలో..
- ఈటల రాజేందర్(బీజేపీ) అమిత్ షాతో కలిసి ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు.
- పట్నం సునీతారెడ్డి (కాంగ్రెస్) కుత్బుల్లాపూర్, రంగారెడ్డినగర్‌లో ప్రచారంలో పాల్గొన్నారు.

జోరుగా కాంగ్రెస్ ప్రచారం

రోడ్‌షోలతో సీఎం రేవంత్, బస్సులో ప్రయాణికులతో రాహుల్..

గ్రేటర్‌లో కాంగ్రెస్ జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని నగర శివారులోని తుక్కుగూడలో రాహుల్‌గాంధీ నేతృత్వంలో ప్రారంభించారు. గురువారం సరూర్‌నగర్‌లో రాహుల్‌గాంధీతో మళ్లీ మల్కాజిగిరి, చేవెళ్ల ఎంపీ ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు. అదే రోజు దిల్‌సుఖ్‌నగర్‌లో



సునీతా మహేందర్‌రెడ్డి ప్రచారం

మిగతా 10వ పేజీలో..

గ్రేటర్‌పై గులాబీ గురి

మహానగరంలో మెజార్టీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు విస్తృత ప్రచారం చేశారు. సికింద్రాబాద్ నుంచి ఎమ్మెల్యే టి.పద్మారావుగౌడ్, మల్కాజ్‌గిరి నుంచి రాగిడి లక్ష్మారెడ్డి, చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్, హైదరాబాద్‌లో గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌ను బరిలో నిలిపారు. సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానాల పరిధిలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విస్తృత ప్రచారం నిర్వహించారు. రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు, యువజన, మైనార్టీలతో నిర్వహించిన

మిగతా 10వ పేజీలో..



చివరిరోజు బైక్ ర్యాలీలో బుల్లెట్‌పై పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే తలసాని

దూకుడుగా బీజేపీ

- ప్రధాని రోడ్డు షో మొదలు.. జనసభతో ముగింపు
- జాతీయ నాయకుల ర్యాలీలు, రోడ్డు షో

ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటినుంచి బీజేపీ ప్రచార దూకుడును కొనసాగించింది. విజయమే లక్ష్యంగా ప్రచారాన్ని వ్యూహాత్మంగా చేపట్టారు. శనివారం సాయంత్రం వరకు ప్రచారానికి అవకాశం ఉన్నప్పటికీ శుక్రవారం నాటికే ప్రచారం దాదాపు ముగిసింది. అన్ని పార్టీల కంటే ముందే మొదలు పెట్టి, ముందే ముగించారు. మల్కాజిగిరిలో ప్రధాని నరేంద్ర మోదీ రోడ్డు షోతో ఎన్నికల శ్రీకారానికి చుట్టిన కమలనాథులు.. ఎల్బీస్టేడియంలో మరో సారి ప్రధాని మోదీ జనసభతో దాదాపు ప్రచారానికి తెర వేశారు. అభ్యర్థులు కూడా దాదాపు శుక్రవారం నాటికే ప్రచారం పూర్తి చేశారు. శనివారం కార్యకర్తలు, నాయకులతో ప్రచారం నిర్వహించారు. అభ్యర్థులు సమావేశాలు, సమీక్షలు, ఎన్నికల



ప్రచారంలో ఎమ్మెల్యే రాజాసింగ్‌తో మాధవీలత (ఫైల్)

మిగతా 10వ పేజీలో..

ఎన్నికల వేళ.. నగదు, వస్తువులు స్వాధీనం..!

హైదరాబాద్ సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ సమయం దగ్గర పడుతోన్న నేపథ్యంలో భారీగా డబ్బులు, ఇతర వస్తువులు పట్టుబడుతున్నాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో రూ.6.54 కోట్ల విలువైన వస్తువులు, రూ.34.28 లక్షల నగదు పట్టుబడినట్టు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ ప్రకటించారు. ఓటర్లకు పంపిణీ చేసేందుకు తీసుకెళ్తోన్న కుక్కర్లు, కుట్టు మిషన్లు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఆధారాలు చూపని బంగారం, వెండి తనిఖీల్లో పట్టుకున్నారు. 126.70 లీటర్ల మద్యం సీజ్ చేశారు. తొమ్మిది మందిపై కేసులు నమోదు చేశామని, వారిలో ఆరుగురిని అరెస్ట్ చేసినట్టు తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

● చేవెళ్ల రిటర్నింగ్ ఆఫీసర్, కలెక్టర్ శశాంక



వివరాలు వెల్లడిస్తున్న శశాంక, రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

రాజేంద్రనగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని రిటర్నింగ్ ఆఫీసర్, రంగారెడ్డి కలెక్టర్ శశాంక తెలిపారు. రాజేంద్రనగర్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్‌తో కలిసి పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్ల వివరాలను శశాంక వెల్లడించారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో మొత్తం 2,877 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ద్వారా సీసీ కెమెరాల నిఘా నీడలో పోలింగ్ జరిపేలా ఏర్పాట్లు చేశామన్నారు. 216 మంది సూక్ష్మ పరిశీలకులు క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌లలో సేవలందిస్తున్నారని తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గంలో 29,38,370 మంది ఓటర్లు ఉన్నారన్నారు. పోటీలో 43 మంది అభ్యర్థులు ఉన్నందున పోలింగ్ కోసం మూడు చొప్పున బ్యాలెట్ యూనిట్‌లు ఉపయోగిస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల సంఖ్య కంటే 25 శాతం అదనంగా లెక్కిస్తూ(రిజర్వ్) బ్యాలెట్ యూనిట్లు 10,757, కంట్రోల్ యూనిట్లు 3,591 కేటాయించడం జరిగిందన్నారు. వీవీ ప్యాట్‌లు 4,008 కేటాయించామని వివరించారు. అనంతరం రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేలా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఐదంచెల బందోబస్తు ఉంటుందన్నారు. సెక్టార్ ఆఫీసర్లు, పోలీస్ బృందాలతో కూడిన టీములు, క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు, ఏసీపీల స్థాయిలో స్ట్రైకింగ్ ఫోర్స్, డీసీసీ, సీపీ, ఏడీజీల స్థాయిలో పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు రూ. 10,70,16,937 నగదు, రూ.1,76,12,006 లక్షల విలువ చేసే మద్యం, రూ. 5,05,03,026 విలువ చేసే 1,84,68,203 గంజాయి, రూ. 31,14,44,388 విలువ చేసే బంగారం, రూ.3,034,700 విలువ చేసే వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

ఓటర్లు ప్రలోభాలకు గురికావద్దు : తరుణ్ జోషి



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ తరుణ్‌జోషి

హైదరాబాద్ సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): మీ ఓటే మీ స్వరం, మీ స్వరాన్ని వినిపించాలంటే ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటేయాలని రాచకొండ సీపీ తరుణ్‌జోషి విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని, దానిని ప్రలోభాలకు గురికాకుండా వినియోగించుకోవాలని కోరారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎన్నికల బందోబస్తుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. నేరేడ్‌మెట్‌లోని కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలో 35.27 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, 1590 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 3,396 పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకుంటారని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఈవీఎంలను భద్రపరిచేందుకు 3 స్ట్రాంగ్ రూములు ఉన్నాయన్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా 8 ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, 29 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 25 స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలతో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ఇప్పటి వరకు రూ. 11.9 కోట్ల నగదు, రూ. 75.75 లక్షల విలువైన 12,240 లీటర్ల మద్యం, రూ. 14.7 లక్షల విలువైన బంగారం, వెండి, ఎన్నికల్లో పంచేందుకు తరలిస్తున్న 9.26 లక్షల విలువైన వస్తువులు, 638 కిలోల గంజాయి, 2 కిలోల నల్లమందు, 120 గ్రాముల ఎండీఎంఏ, 29 గ్రాముల హెరాయిన్‌తో కలిపి మొత్తం 1.95 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎన్నికల విధుల్లో 6 వేల మంది రాచకొండ పోలీసులు, టీఎస్‌పీఏ నుంచి 1063 మంది ట్రైనీలు, సీఏపీఎఫ్ 12 కాయ్స్, టీఎస్ఎస్‌పీకి చెందిన 25 సెక్షన్ల సిబ్బంది, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, లీగల్ మెట్రాలజీ శాఖలకు చెందిన అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని 114 ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్‌లు నిర్వహించి, ప్రజల్లో భరోసా కల్పించామన్నారు. పోలింగ్ కేంద్రాలను జియో ట్యాగింగ్ చేయడంతో పాటు 72 మంది ఐటీ అధికారులతో నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు 4892 మంది నేరగాళ్లు, రౌడీషీటర్లను బైండోవర్ చేశామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక ఉల్లంఘనలకు సంబంధించి 14 కేసులు నమోదు చేశామన్నారు. కమిషనరేట్ పరిధిలో 1114 లైసెన్స్ ఆయుధాల్లో 806 ఆయుధాలు డిపాజిట్ అయ్యాయని చెప్పారు.



ప్రియాంకగాంధీకి బేగంపేటలో స్వాగతం

ప్రియాంకగాంధీకి ఘన స్వాగతం

ఎన్నికల ప్రచారానికి బేగంపేట ఎయిర్‌పోర్టుకు ప్రత్యేక విమానంలో చేరుకున్న ఏఐసీసీ నేత ప్రియాంకగాంధీకి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు

- హైదరాబాద్ సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి)

పోలింగ్ కేంద్రాలకు టీమ్‌ల కేటాయింపు

● పోలింగ్ సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి

హైదరాబాద్ సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లాలోని 15 అసెంబ్లీ సెగ్మెంట్‌ల పరిధిలో మొత్తం 3986 పోలింగ్ కేంద్రాలకు టీమ్‌లు కేటాయించారు. జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ నేతృత్వంలో శనివారం ఎన్నికల సంఘం నిబంధనలు అనుసరిస్తూ థర్డ్ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ సాధారణ పరిశీలకులు పీఐ శ్రీవిద్య, డాక్టర్ సరోజ్‌కుమార్ సమక్షంలో ర్యాండమైజేషన్‌ను నిర్వహించారు. జిల్లాలోని హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో గల పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలతో కూడిన బృందాలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. కార్యక్రమంలో హైదరాబాద్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ అదనపు కలెక్టర్ సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్‌పాటిల్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, సీఈవో మధుకర్ నాయక్, మ్యాన్ పవర్ నోడల్ అధికారి ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈటల ఓ కిరాతకుడు.. ఎన్నికల్లో ఓడించాలి

● హుజూరాబాద్ బాధితులు



మాట్లాడుతున్న ఈటల బాధితులు

హైదరాబాద్ సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఓ కిరాతకుడని, ఈటల అరాచకాలను భరించలేక తామే ఓడిస్తే మల్కాజిగిరికి వచ్చిపడ్డాడని.. ఇక్కడ కూడా ఎంపీ ఎన్నికల్లో ఓడించాలని హుజురాబాద్ ఈటల బాధితులు కోరారు. శనివారం బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో హుజురాబాద్‌కు చెందిన ఈటల బాధితులు సురేష్, అఖిల్, రంజిత్‌లతో కలిసి ఇమ్మడి సతీష్ విలేకరులతో మాట్లాడారు. ఈటల రాజేందర్‌కు అత్యంత సన్నిహితంగా 15ఏళ్ల పాటు ముఖ్య అనుచరుడిగా పని చేశానని, ఈటల హుజూరాబాద్‌లో చేసిన అక్రమాలను, అరాచకాలను ప్రశ్నిస్తున్నానని తెలిసి తనను వెళ్లగొట్టారని తెలిపారు. సివిల్ సప్లయ్ ధాన్యం కొనుగోలులో రూ.5వేల కోట్లకు పైగా స్కామ్ చేశారని, విచారణ జరగకుండా డబ్బులతో తొక్కిపెట్టాడని తెలిపారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో చల్లూరు ఎంపీటీసీ బాలరాజును తన మనుషులతో చంపించాడని, ఆస్పత్రిలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేసే ప్రవీణ్‌యాదవ్‌ను తీవ్రంగా కొట్టి మరీ చంపిచారని ఆయన ఆరోపించారు. హుజూరాబాద్‌లో పేదల భూములను కబ్జా చేశారని, మల్కాజిగిరిలో గెలిస్తే ఈ ప్రాంతంలో సెంటు భూమి మిగలదని అన్నారు. తమ ప్రాణాలకు హానీ జరిగితే ఈటల రాజేందర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

మెట్రోలో మహిళలు

తగ్గుతున్నారు..!

- రూ.35 చెల్లించి పురుషులు మాత్రమే మెట్రోకు వస్తున్నారు..
- రానున్న రోజుల్లో ఇది ఆర్థిక భారంగా మారుతుంది
- ఎల్‌అండ్‌టీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ వ్యాఖ్యలు



హైదరాబాద్ సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోన్న 'మహాలక్ష్మి' పథకంతో మహిళలు బస్సుల్లో ఎక్కువగా ప్రయాణిస్తున్నారు. మెట్రో రైలు తక్కువగా ఎక్కుతున్నారు. పురుషులు రూ.35 చార్జితో రైళ్లలో ప్రయాణిస్తున్నారు. ఇది బాధాకరం. రాష్ట్రానికి ఆర్థిక భారం.." అని ఎల్‌అండ్‌టీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ శంకర్‌రామన్ ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రోలో ప్రస్తుతం రోజుకు 4.80 లక్షల మంది మాత్రమే ప్రయాణిస్తున్నారు. రానున్న రోజుల్లో 10 లక్షల సంఖ్యకు చేరుకునే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన అందులో చెప్పారు. మెట్రో నిర్వహణ కోసం తమకు ప్రభుత్వంతో 65 ఏళ్ల పాటు రాయితీ ఒప్పందం ఉందని, 2021 నుంచి 2026 వరకు సంస్థ పనితీరుపై కూలంకషంగా నివేదికను పొందుపర్చామని, రానున్న ఐదేళ్లకు సంబంధించి చర్చలు నడుస్తున్నాయని పేర్కొన్నారు. నష్టం వచ్చే ప్రాజెక్టుల నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకోవాలని, లాభాలు వస్తున్న ప్రాజెక్టులకు పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్నామన్నారు. ప్రస్తుతం మెట్రో ఇన్‌ఫ్రా మొదటి లెవల్ డెవలప్‌మెంట్ పూర్తయిందని, రానున్న రెండేళ్లలో మరో దశ డెవలప్‌మెంట్ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం మహిళలకు ఫ్రీ బస్సు పథకం అమలు చేస్తున్నారు.. దీని ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు నష్టం కలుగుతోంది.. అని ఆయన అభిప్రాయపడ్డారు. దీనిపై హైదరాబాద్ మెట్రోలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి ఏడాది జరిగే వార్షిక నివేదిక సమయంలో ఎల్‌అండ్‌టీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని పలువురు వాపోతున్నారు.

గతంలో వాటాలు అమ్ముతామని వ్యాఖ్యలు..

కొవిడ్ సమయంలో కూడా శంకర్‌రామన్ ఎల్‌అండ్‌టీ వాటాలపై కీలక వ్యాఖ్యలు చేసినట్లు తెలిసింది. నష్టాలతో హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టును నడుపుతున్నామని, ఆసక్తి కలిగిన వారు వస్తే కొంత వాటాను ఇస్తామని అప్పట్లో ఆయన ప్రకటన చేసినట్లు సమాచారం. తాజాగా ఫ్రీ బస్సు పథకంపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వంతో కలిపి నడిపిస్తున్న ప్రాజెక్టుపై ఆయన చేసిన ప్రకటనలు సరికావని హెచ్ఎంఆర్ అధికారులు తోసిపుచ్చుతున్నారు.

ఎంపీగా గెలిపించండి... ఐదేళ్లు సేవచేస్తా: దానం


దానంకు మద్దతు తెలుపుతున్న గంగపుత్ర సంఘం నాయకులు


తిలక్‌నగర్‌లో కరపత్రాలను పంపిణీ చేస్తున్న శ్యామ్‌రావు తదితరులు

ముషీరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎంపీగా గెలిపించండి ఐదేళ్లు మీకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ ప్రజలకు హామీ ఇచ్చారు. శనివారం ముషీరాబాద్‌కు చెందిన గంగపుత్ర సంఘం నాయకులు గోవింద్ ఆధ్వర్యంలో దానం నాగేందర్‌ను కలిసి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గోవింద్‌కు దానం తలపాగ పెట్టి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల మద్దతు కాంగ్రెస్‌కే ఉందని, తన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తథ్యం

బర్కత్‌పుర: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తథ్యమని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం బర్కత్‌పురలో నిర్వహించిన బైక్ ర్యాలీలో కాంగ్రెస్ నాయకుడు తొలుపునూరి కృష్ణగౌడ్, ఎన్ఎస్‌యుఐ గ్రేటర్ అధ్యక్షుడు ఎడ్ల అభిజిత్‌యాదవ్‌తో కలిసి దానం నాగేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న ప్రతి ఒక్కరు పోలింగ్ స్టేషన్‌కు వెళ్లి హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం: శ్యామ్‌రావు

నల్లకుంట/రాంనగర్: ఎంపీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ మెజార్టీ సీట్లు గెలుచుకోవడం ఖాయమని ఉమ్మడి ఏపీసీసీ ఎస్సీసెల్ మాజీ చైర్మన్ జీబీ శ్యామ్‌రావు అన్నారు. శనివారం నల్లకుంట డివిజన్‌లోని తిలక్‌నగర్‌లో దానం నాగేందర్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి హస్తం గుర్తుకు ఓటేసి దానం నాగేందర్‌ను గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం హిమాయత్‌నగర్‌లో రోడ్‌షో నిర్వహించారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న గ్యారంటీలు చూసి హస్తం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ కోరారు. తాను గెలిస్తే నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడతానన్నారు.

దానం గెలిస్తేనే నియోజకవర్గం అభివృద్ధి: యాదగిరి గౌడ్

చిక్కడపలి: సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ గెలిస్తేనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ బంటారం యాదగిరిగౌడ్ అన్నారు. శనివారం గాంధీనగర్ డివిజన్‌లో అభిషేక్ కెన్నడీ ఆధ్వర్యంలో గోల్కొండ చౌరస్తా వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలిసి చేయి గుర్తుపై ఓటు వేసి దానంను గెలిపించాలని కోరారు. డివిజన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి, నగర ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్, నాయకులు శీలం సత్యనారాయణ, జయేందర్‌బాబు, గుండుజగదీశ్ బాబు, బాబ్జి, మారిశెట్టి నర్సింగ్‌రావు, చంద్రకళ, జయ, నవీన్‌కుమార్, భూకాల కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి


మైలార్‌దేవుపల్లి బైక్ ర్యాలీలో మాట్లాడుతున్న సామ ఇంద్రపాల్‌రెడ్డి


రోడ్డు షోలో సీఎం సోదరుడు కొండల్‌రెడ్డి

రాజేంద్రనగర్, మే11(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల ప్రచారం చివరి రోజైన శనివారం మైలార్‌దేవుపల్లి, రాజేంద్రనగర్ డివిజన్‌ల పరిధిలో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా బైక్ ర్యాలీలు నిర్వహించారు. రాజేంద్రనగర్ డివిజన్‌లో జరిగిన ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి పాన్నారు. రాజేంద్రనగర్, బుద్వేల్, ఉప్పర్‌పల్లి, శివరాంపల్లి, ఎర్రబోడ ప్రాంతాలలో బైక్ ర్యాలీ జరిగింది. ర్యాలీలో రాజేంద్రనగర్ డివిజన్ ఎన్నికల కో ఆర్డినేటర్ పలుగుచెరువు మహేశ్, డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్‌రెడ్డి, పి.ఉమా మహేశ్వరీ, దుంబాల ఝాన్సీరెడ్డి, కోరని బాల్‌రాజ్, కోరని శ్యామ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైలార్‌దేవుపల్లి డివిజన్‌లో...

మైలార్‌దేవుపల్లి, దుర్గానగర్, కాటేదాన్, లక్ష్మీగూడ, వాంబేకాలనీ, పద్మశాలిపురం, టీఎన్‌జీవోస్ కాలనీ, మధుబన్‌కాలనీ, నేతాజీనగర్, గగన్‌పహాడ్ బస్తీలలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీ ఎన్నికలలో చేవెళ్ల నియోజకవర్గంలో చేతి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ర్యాలీలో మైలార్‌దేవుపల్లి కాంగ్రెస్ ఎన్నికల కో ఆర్డినేటర్ సామ ఇంద్రపాల్‌రెడ్డి, అధ్యక్షుడు ఎన్.ధనుంజయ్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎసదాలక్ష్మీ, అడికె అర్జున్, సరికొండ వెంకటేశ్, సుధాకర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షాహీన్‌నగర్‌లో రంజిత్‌రెడ్డి సోదరి ప్రచారం

పహాడిషరీఫ్ మే 11(ఆంధ్రజ్యోతి): ఎంపీ ఎన్నికలలో చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన సోదరి రాజ్యలక్ష్మి కోరారు. శనివారం రంజిత్‌రెడ్డిని గెలిపించాలని జల్‌పల్లి మున్సిపాలిటీ, షాహీన్‌నగర్, సాధత్‌నగర్‌లలో మాజీ ఎంపీటీసీలు రాజేశ్, మహ్మద్ అబ్దుల్ రవూఫ్ తదితరులతో కలిసి ప్రచారం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని చూసిన అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తారని అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ జహంగీర్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, బుడమాల యాదగిరి తదితరులు రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం చేశారు. వారి వెంట మస్నా రవికుమార్,బాబు నవీన్, నవాజ్, బాలాజీ, మల్లికార్జున్ యంజాల శ్రీను తదితరులు ఉన్నారు.

రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఎంఐఎం నాయకులు

జలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేట్,పాత గ్రామంలో కాంగ్రెస్ నాయకులతో ఎంఐఎం నాయకులు రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటికి ప్రచారం చేశారు. చేవెళ్లలో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మజ్లిస్ పార్టీ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ మాజీ మండల ఉపాధ్యక్షుడు ఓమర్ తెలిపారు.

చందానగర్ కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం

చందానగర్: చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మిరియాల రాఘవరావు ఆధ్వర్యంలో చందానగర్‌లో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చందానగర్ శ్రీనివాస అపార్టుమెంట్‌లో స్థానికులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాఘవరావు, ఎంబీసీ చైర్మన్ జైపాల్ పాల్గొని కాంగ్రెస్‌కు ఓటు వేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

రంజిత్‌రెడ్డి విజయం తథ్యం: టీపీసీసీ ప్రతినిధి దేప

ఎల్బీనగర్: చేవెళ్ల ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి విజయం తథ్యమని టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ నాయకులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో వచ్చిన వంద రోజుల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిందన్నారు. మే 13న జరుగనున్న ఎన్నికలలో హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు.

బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించండి : ప్రకాశ్‌గౌడ్


మద్దతు తెలిపిన మహిళలతో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

రాజేంద్రనగర్, మే11(ఆంధ్రజ్యోతి) : బడుగు బలహీనవర్గాల గొంతుక కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శనివారం కాటేదాన్ ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బి.గట్టయ్య ఆధ్వర్యంలో రెండు వందల మంది మహిళలు ప్రకాశ్‌గౌడ్‌ను కలసి మద్దతు తెలిపారు. ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ ఎంపీ ఎన్నికలలో చేవెళ్లలో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపిస్తే వెనుకబడిన వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరపున విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిని ఎంపీలుగా గెలిపిస్తే మోసం చేశారన్నారు. మద్దతు తెలిపిన వారిలో శ్రీలత, యాదమ్మ, సువర్ణ, మంజుల, జంగమ్మ, రేణుక, మహలక్ష్మి, ధనలక్ష్మి, వాసవి, స్వప్న, అరుణ, రాధిక తదితరులు ఉన్నారు.

చేవెళ్లలో బీఆర్ఎస్ విజయం ఖాయం

పహాడిషరీఫ్: చేవెళ్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ విజయం సాధించడం ఖాయమని శ్రీరాంకాలనీ కౌన్సిలర్ పల్లపు శంకర్ అన్నారు. శనివారం శ్రీరాం కాలనీలో ఇంటింటికి ప్రచారం చేసి కారు గుర్తుకు ఓటేసి కాసానిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

గచ్చిబౌలి డివిజన్‌లో బీఆర్ఎస్ బైక్‌ర్యాలీ

రాయదుర్గం: కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా మాజీ కార్పొరేటర్ సాయిబాబా ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. రాయదుర్గం, టెలికామ్‌నగర్, గచ్చిబౌలి, జీపీఆర్ఏ క్వార్టర్స్, గుల్‌మొహర్ పార్కు, నల్లగండ్ల, గోపన్‌పల్లి ఎన్టీఆర్‌నగర్, గౌలిదొడ్డి, నానక్‌రాంగూడ మీదుగా గచ్చిబౌలి డివిజన్లలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. చేవెళ్లలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని సాయిబాబా ధీమా వ్యక్తం చేశారు.

మియాపూర్: బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపునకు మద్దతుగా హఫీజ్‌పేట డివిజన్, గచ్చిబౌలి, చందానగర్ డివిజన్‌లో శనివారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పార్టీ నాయకులతో కలిసి భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ చేవెళ్ల గడ్డపై మూడోసారి బీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని అన్నారు. పార్టీలు మారిన అభ్యర్థులకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని సూచించారు.

హైదర్‌నగర్: హైదర్‌నగర్ డివిజన్ సాయిప్రశాంత్‌నగర్ ఫేజ్-2, ఇందిరానగర్‌లో చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలిసి కారుగుర్తుపై ఓటు వేసి జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు.


శ్రీరాం కాలనీలో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ పల్లపు శంకర్

ఎంపీగా ఒక్క అవకాశం ఇవ్వండి: పద్మారావు


జామై ఉస్మానియా గార్డెన్‌లో జరిగిన యువజన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): 'ఎమ్మెల్యేగా సికింద్రాబాద్ అసెంబ్లీ పరిధిలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేశాను. ఒక్క అవకాశం ఇవ్వండి సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రాంతాలనూ అభివృద్ధి చేస్తాను. బీఆర్ఎస్‌తోనే సికింద్రాబాద్ నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని' బీఆర్ఎస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. శనివాంరం బౌద్ధనగర్ డివిజన్ జామై ఉస్మానియా గార్డెన్‌లో నిర్వహించిన సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ యువజన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇరవై ఏళ్లగా సికింద్రాబాద్ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు.

తనను పలుమార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన మహిళలకు, నియోజకవర్గ ఓటర్లకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నమ్మవద్దని, ఆ పార్టీలు చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. తనను పార్లమెంట్ సభ్యుడిగా గెలిపిస్తే ప్రజలకు మరింత సేవ చేస్తానని తెలిపారు. యువనేతలు కిరణ్‌కుమార్ గౌడ్, రామేశ్వర్‌గౌడ్, శిల్ప. సికింద్రాబాద్ ఇన్‌చార్జి రవి, కార్పొరేటర్లు కంది శైలజ, హేమ, రాసూరి సునీత, లింగాని ప్రసన్నలక్ష్మి, మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, కరాటేరాజు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌పై గులాబీ జెండా ఎగురవేస్తాం: కాలేరు

బర్కత్‌పుర: సికింద్రాబాద్‌పై గులాబీ జెండా ఎగురువేస్తామనిఅంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ధీమా వ్యక్తంచేశారు. శనివారం కాచిగూడ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్లమెంట్ ఇన్‌చార్జి దానోజు శ్రావణ్‌తో కలిసి కాలేరు వెంకటేష్ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. కాచిగూడ, నల్లకుంట, బాగ్‌అంబర్‌పేట, గోల్నాక, అంబర్‌పేట డివిజన్ల గుండా ఈ బైక్ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబర్‌పేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుకు 50 ఓట్ల మెజారిటీ అందిస్తామన్నారు.



మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/nWMIATq లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిది

● ప్రొ. హరగోపాల్



సదస్సుకు హాజరైన ప్రొ.హరగోపాల్ తదితరులు

తార్నాక, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ప్రొ.హరగోపాల్ అన్నారు. శనివారం ఓయూలోని సీఎఫ్ ఆర్డీ కార్యాలయంలో తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్, ఓయూ బహుజన వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రమాదంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణకై మేధావుల సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొ. హరగోపాల్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చడం అంటే దాని విలువలను విధ్వంసం చేయడమేనని ఆయన అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కాశీం, జస్టిస్ చంద్రకుమార్, పీహెచ్‌డీ విద్యార్థి జంపాల రాజేష్, బాలరాజ్, గండమల్ల వినోద్ రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించాలి : ఆర్.కృష్ణయ్య



ప్రణీతరాణికి నియామక పత్రం అందజేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, మే 11 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల తొలగింపునకు కుట్ర చేస్తున్న బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ప్రజలకు సూచించారు. ప్రధాని మోదీ రిజర్వేషన్లపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన సమావేశానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మోదీ పదేళ్ల పాలనలో బీసీల అభివృద్ధికి ఒక చిన్న స్కీము కూడా చేపట్టలేదని విమర్శించారు. బడ్జెట్‌లో రెండు లక్షల కోట్లు కేటాయించమంటే 2 వేల కోట్లు కేటాయించి అవమానించారని కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా కె.ప్రణీతరాణిని ప్రకటించి ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు నీల వెంకటేష్, అనంతయ్య, నందగోపాల్, కృష్ణమూర్తి, ఉమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఓడించాలి'

బర్కత్‌పుర, మే 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఓడించాలని ఓటర్లకు అఖిల భారత వెనుకబడిన ప్రజల సునామీ పార్టీ జాతీయ అధ్యక్షుడు సీహెచ్ భూపాల్‌గౌడ్ సూచించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ప్రధాని మోదీ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు మాట్లాడుతున్నారని, వీరికి ప్రజలు ఓటు ద్వారా సరైన గుణపాఠం చెప్పాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత డీసీపీ బద్రీనాథ్ పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

పంజాగుట్ట, మే 11(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అంతర్జాతీయ దాసన్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఆర్చి బిషప్ రెవరెండ్ పీపీ దాసన్న సూచించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఓటర్ అవగాహనా సదస్సు జరిగింది. మతం, ప్రాంత విభేదాలు చూడని నాయకుణ్ణి ఎన్నుకోవాలని సూచించారు. సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేవీ శ్రీధర్, బిషప్ దయానంద్, కేఎస్ ప్రకాష్ రావు, అనిల్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫేక్ వీడియోపై చర్యలు తీసుకోవాలి



ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌కు ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న కొండా సంగీతారెడ్డి

హైదరాబాద్ సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి కమలం పువ్వు గుర్తు ఈవీఎంపై రెండో స్థానంలో ఉండగా.. నాలుగో స్థానంలో ఓటు వేయాలంటూ ఫేక్ వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేశారని ఎన్నికల అధికారికి విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి కొండా సంగీతారెడ్డి ఫిర్యాదు చేశారు. శనివారం బీఆర్‌కే భవన్‌లో రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్‌ను సంగీతారెడ్డి కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్న తప్పుడు ప్రచారాన్ని వెంటనే అడ్డుకోవాలని, కుట్రకు కారణమైన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి పై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.



ఎన్నికల ప్రచారానికి శనివారం సాయత్రం తెరపడడంతో ఎన్టీఆర్ స్టేడియంలో ప్రచార రథాల ఫ్లెక్సీలు, మైకులను తొలగిస్తున్న సిబ్బంది

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి)





లోక్‌సభ ఎన్నికల సందర్భంగా 48గంటల పాటు వైన్స్‌లు బంద్ చేయనున్న నేపథ్యంలో శనివారం వైన్స్‌ల వద్ద భారీగా మందు బాటిళ్లు కొనుగోలు చేస్తున్న జనాలు

● ఊరెళ్లటానికి టికెట్‌పై ఆఫర్ ఇస్తున్న ట్రావెల్ యాప్‌లు
● సిటీలో పోలింగ్‌స్టేషన్‌కు ఉచిత రైడ్
● ఆస్పత్రిలో ఉచిత కన్సల్టేషన్స్
● అమ్యూజ్‌మెంట్ పార్కుల్లో డిస్కౌంట్లు

ఓటెయ్యండి.. ఆఫర్ పొందండి!



హైదరాబాద్ సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య ప్రక్రియలో అత్యంత కీలకమైన ఓటింగ్ డేను నగరవాసి హాలీడేగా భావిస్తున్నాడు. పోలింగ్ బూత్ మొహమే చూడని వారి కోసం పలు సంస్థలు ఆఫర్లను ప్రకటించాయి. ట్రావెల్ మొదలు ఆస్పత్రుల వరకూ, హోటల్స్ మొదలు అమ్యూజ్‌మెంట్ పార్క్‌ల వరకూ పలు సంస్థలు ఆఫర్లు అందిస్తున్నాయి. పోలింగ్‌కు ఒక్క రోజే ఉండటంతో మరికొన్ని సంస్థలు చివరి నిమిషంలో ఆఫర్లను ప్రకటించనున్నాయి. ఆఫర్ల వెనుక ఆ సంస్థల ప్రయోజనాలు దాగి ఉన్నాయనేది నిజమే అయినా ఓటింగ్ పెంచడం కోసం ఆఫర్లు ప్రకటించాల్సి రావడం దురదృష్టకరమని పరిశీలకులు చెబుతున్నారు. గతంలో ఆఫర్లు అందించినా నగరంలో ఓటింగ్ శాతం పెరగలేదని, ఈసారి ఎలా ఉంటుందో చూడాలంటున్నారు.

ఊరెళ్లే వారి కోసం..



ఓటేయడానికి ఇప్పటికే చాలా మంది ఊరెళ్లిపోయారు. మరికొంత మంది ఆ ప్రయత్నంలో ఉన్నారు. పలు రాజకీయ పార్టీల నాయకులు ఓటర్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రెడ్‌బస్, అభిబస్ లాంటి సంస్థలు టికెట్లపై దాదాపు 20 శాతం రాయితీ అందిస్తామని చెబుతున్నాయి.

విమానం టికెట్‌పై రాయితీ



తొలిసారి ఓటేసే యువకులకు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఆఫర్ ప్రకటించింది. చదువు కోసం లేదంటే ఉద్యోగం కోసం వేర్వేరు నగరాలకు వెళ్లిన యువత సొంతూరులో ఓటేయడానికి వెళ్లాలనుకుంటే టికెట్లపై 19 శాతం రాయితీ ఇస్తామని ప్రకటించింది. ఏప్రిల్ 19న ఆఫర్ ప్రకటించగా సంస్థ వెబ్‌సైట్‌లో జరుగుతున్న ప్రతి 20 బుకింగ్‌లలో ఒకటి ఫస్ట్ టైమ్ ఓటర్‌దే కావడం విశేషం! ఓటరు గుర్తింపు కార్డును ఎయిర్‌పోర్ట్‌లోనే చూపాల్సి ఉంటుంది.

సంస్థలు అందిస్తున్న ఆఫర్లు



డాక్టర్ కన్సల్టేషన్ ఉచితం



ఆరోగ్యపరంగా ఇబ్బంది ఉన్న వారికి డాక్టర్ కన్సల్టేషన్ ఉచితంగా అందించడంతో పాటు ల్యాబ్ పరీక్షల్లో 50 శాతం రాయితీ ఇస్తామంటోంది ఏఐజీ హాస్పిటల్స్. ట్రావెల్ కంపెనీల్లా ఆఫర్‌పై ఎలాంటి పరిమితి లేదు.

పోలింగ్ బూత్ వద్దకు సవారీ ఫ్రీ..



రాపిడో సంస్థ హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు నగర ఓటర్లకు పోలింగ్‌స్టేషన్ వరకూ బైక్ రైడ్‌ను ఉచితంగా అందిస్తుంది. దివ్యాంగులు క్యాబ్, ఆటోలను ఉచితంగా వినియోగించుకునే అవకాశం ఆ రోజు అందిస్తామంటుంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా ఇలాంటి ఆఫర్‌నే ఈ సంస్థ అందించింది.

టికెట్లపై 20 శాతం రాయితీ

ఓటు వేసినట్లు సిరా గుర్తు చూపితే ప్రవేశ టికెట్లపై 20 శాతం రాయితీ అందిస్తామంటోంది అమ్యూజ్‌మెంట్ పార్క్ (వండర్‌లా). ఈ నెల 13 నుంచి 15 తేదీల్లో ఆఫర్ వర్తిస్తుందని ప్రకటించింది.

ఫుడ్‌పై రాయితీ పొందండి..



దేశవ్యాప్తంగా పలు రెస్టారెంట్స్ అసోసియేషన్లు ఓటింగ్ పెంచడం కోసం ఆఫర్లను ఇవ్వాల్సిందిగా హోటల్స్ రెస్టారెంట్లకు సూచించాయి. స్పందించిన కొన్ని రెస్టారెంట్ చైన్స్ ఇప్పటికే పలు నగరాల్లో 20 శాతం వరకూ ఆఫర్‌ను అందించాయి. ఇంప్రెసారియో ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ హాస్పిటాలిటీ సంస్థ 20 శాతం రాయితీ అందిస్తామని వెల్లడించింది. ఓటేసిన మార్కు చూపితే టికెట్‌పై మాత్రమే కాకుండా ఫుడ్, డ్రింక్స్‌పై రాయితీ అందించనున్నారు.

ఉదయం ఓటేయండి.. రాత్రికి డైనింగ్‌పై 50% రాయితీ అందుకోండి



డైనింగ్ ఔట్ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ, ఓటర్ల కోసం ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి ఓ ప్రకటనలో తెలిపారు. ఓటు వేసిన తరువాత సిరా గుర్తు చూపితే చాలుహైదరాబాద్‌లో కొన్ని ప్రముఖ రెస్టారెంట్‌లలో డైనింగ్‌పై 50% రాయితీ ని తమ డైనవుట్ ద్వారా అందిస్తామంటుంది. ఈ రెస్టారెంట్‌లలో అంటేరా కిచెన్ అండ్ బార్, పాపాయ, ఎయిర్ లైవ్, నోవోటెల్, లీ మెరిడియన్, రెడ్ రైనో, కాఫీ కప్ వంటివి ఉన్నాయి.

మా మద్దతు ఎవరికంటే..



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ

బీజేపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి

● మంద కృష్ణ మాదిగ

పంజాగుట్ట, మే 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వస్తే రాజ్యాంగం, రిజర్వేషన్లు రద్దవుతాయని కాంగ్రెస్ నాయకులు చెబుతున్న మాటలను ఎస్సీ, ఎస్టీ, బీసీలు నమ్మవద్దని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. బీజేపీతోనే అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతుందని అన్నారు. తనకు బీజేపీలో సభ్యత్వం లేదని స్పష్టం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేతతో కలిసి మాట్లాడారు. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను కాపాడంలో మోదీ ముందు వరుసలో ఉంటారని మందకృష్ణ అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు పెంచుతామని చేవెళ్ల డిక్లరేషన్ పెట్టిన కాంగ్రెస్ పార్టీ ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో మాదిగ, నేతకాని సామాజిక వర్గానికి ఒక్క టిక్కెట్ ఇవ్వకుండా, మాదిగల దృష్టిలో కాంగ్రెస్ పార్టీ దోషిగా నిలబడిందని అన్నారు. రేవంత్ రెడ్డి పిట్టల దొర మాటలు మాట్లాడుతున్నారని, ఎమ్మార్పీఎస్‌తో మాట్లాడేటప్పుడు నాలిక దగ్గర పెట్టుకుని మాట్లాడకపోతే ఎదురుదాడి జరుగుతుందని ఆయన హెచ్చరించారు. సామాజిక న్యాయాన్ని కాంగ్రెస్ పార్టీ సమాధి చేస్తున్నదని పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత అన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేష్ మాదిగ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివకుమార్ మాదిగ, కే.శివకుమార్, నవీన్, కుమార్, బట్ట శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

బీజేపీకి లోక్‌సత్తా పార్టీ మద్దతు



జయప్రకాష్ నారాయణను కలిసిన లోక్‌సత్తా పార్టీ నాయకులు

అల్వాల్, మే 11 (ఆంధ్రజ్యోతి): లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ ఆదేశాల మేరకు దేశ ఆర్థిక భవిష్యత్ కోసం లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీకి, ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమికి తమ మద్దతు ప్రకటిస్తున్నామని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ వర్మ పేర్కొన్నారు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో శనివారం నిర్వహించిన 'లెట్స్ ఓట్ మేకింగ్ హండ్రెడ్ పర్సెంట్' (వంద శాతం ఓటు నమోదు చేద్దాం) కార్యక్రమానికి హాజరైన జయప్రకాశ్‌నారాయణతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్, కిషోర్ వంశీ, వరకుమార్, ప్రదీప్, సత్యనారాయణ, వేణు, రవి, భాస్కర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఈటలకు అండగా బీసీలు, ఎంబీసీలు, దివ్యాంగులు

పంజాగుట్ట, మే 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి స్థానం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు తమ పూర్తి మద్దతు అని బీసీ, ఎంబీసీ, దివ్యాంగుల సంఘాలు ప్రకటించాయి. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు, దివ్యాంగుల హక్కుల వేదిక అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, ఎంబీసీ సంఘం అధ్యక్షుడు పల్లె సత్యం వంశరాజ్ మాట్లాడారు. ఈటలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల అధ్యక్షుడు బి.కరుణాకర్, బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.దుర్గయ్య గౌడ్, ముదిరాజ్ సంఘం యువత విభాగం అధ్యక్షుడు రాజు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఆర్యవైశ్యులు..

హైదరాబాద్ సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరి మద్దతుతో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి మెజారిటీ మూడు లక్షలు దాటుతుందని ఆయన సతీమణి కొండా సంగీతారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మియాపూర్ లోని హోటల్ మిలీనియం గ్రాండ్‌లో శనివారం నిర్వహించిన నియోజకవర్గ ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో కొండా సంగీతారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఆర్యవైశ్యులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు రవికుమార్‌యాదవ్, నియోజకవర్గ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

మతోన్మాదానికి వ్యతిరేకంగా ఓటు వేయండి

పంజాగుట్ట, మే 11(ఆంధ్రజ్యోతి): ఇండియా కూటమికి మద్దతు ఇవ్వాలని, ప్రజాస్వామిక శక్తులకు అనుకూలంగా ఓట్లు వేయాలని ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి అధ్యక్షుడు జస్టిస్ బి.చంద్ర కుమార్ అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమితి నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. హిందువుల మెడలో ఉన్న బంగారు మంగళసూత్రం తీసుకుని ముస్లింలకు ఇస్తారని అబద్ధపు ప్రచారం మోదీ చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో సమితి ప్రధాన కార్యదర్శి ఎ.ఎం.షోయబ్, కార్యదర్శి సుందర్, రాజేష్ నాయక్, కోల జనార్దన్, గోపాలకృష్ణ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఇండియా కూటమికి మద్దతు

పంజాగుట్ట, మే 11(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం సంక్లిష్ట పరిస్థితిలో ఉన్నాయని, దీనిని కాపాడుకోవడానికి ఇండియా కూటమికి మద్దతు ఇస్తున్నట్లు వక్తలు తెలిపారు. రాజకీయ పార్టీలు ఇచ్చే గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఓట్ నీడ్ గ్యారెంటీ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు సొగరా బేగం అధ్యక్షతన శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఓటు విలువ, ప్రజాస్వామ్యం అనే అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, సంస్థ ప్రధాన కార్యదర్శి డి.నాగరాజు, ఉపాధ్యక్షురాలు స్నేహారెడ్డి, తెలంగాణ లోక్‌సత్తా అధ్యక్షుడు మన్నారం నాగరాజు, సినీ దర్శక, నిర్మాత సయ్యద్ రఫీ, వివిధ సంఘాల నాయకులు ఇస్లాముద్దీన్, ఇంద్రవెల్లి రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకే మాలల మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న జి.చెన్నయ్య

పంజాగుట్ట, మే 11(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య తెలిపారు. శనివారం బంజారాహిల్స్‌లోని మాల మహానాడు జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కులగణన చేయటంతో పాటు, రిజర్వేషన్లను పెంచి అణగారిన వర్గాలకు మేలు చేస్తుందన్నారు. జాతి భవిష్యత్ కోసం మాలలు కాంగ్రెస్ పార్టీకే ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు బంగి ఆనంద్, బురుగు రమేష్, రాజు, జి.రమేష్, వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు

దానం నాగేందర్‌కు పలు సంఘాలు

పంజాగుట్ట, మే 11(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌కు తమ మద్దతు తెలుపుతున్నట్లు వివిధ సంఘాల నాయకులు ప్రకటించారు. ఆయనను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని వారు సూచించారు. అఖిల భారత ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీస్ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కె.మహేశ్వర్ రాజ్ అధ్యక్షతన శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు పీవీ రమణ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం ఫ్రంట్ అధ్యక్షుడు సనాఉల్లా ఖాన్, తెలంగాణ అడ్వొకేట్స్ జేఏసీ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్ యాదవ్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి క్రిస్టియన్ కౌన్సిల్..

బర్కత్‌పుర, మే 11 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు భారత క్రిస్టియన్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు బిషప్ డాక్టర్. భాస్కర్ ముల్కలా వెల్లడించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి వెంకట్రావ్, టీపీసీసీ మైనారిటీ సెల్ కార్యదర్శి కెనెడీ, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు భరత్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఎస్. కె. రాణి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

'మున్నూరుకాపులందరూ కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేయాలి'

నల్లకుంట, మే 11 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మున్నూరుకాపులందరూ ఓటు వేసి గెలిపించాలని పలు మున్నూరుకాపు సంఘాల నేతలు కోరారు. సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌ను మున్నూరుకాపులు ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు. శనివారం నల్లకుంటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్నూరుకాపు తెలంగాణ రాష్ట్ర ఐక్యపోరాట సమితి అధ్యక్షుడు కొండూరు వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కట్టెల సుభాష్, నాయకులు తిరుపతి చందు, మాడుగుల భాస్కర్, రామ్మోహన్‌రావు, ఆకుల మంజుల తదితరులు మాట్లాడారు.

గ్రేటర్‌పై గులాబీ గురి

(7వ పేజీ తరువాయి)

సమావేశాల్లో పాల్గొన్నారు. సికింద్రాబాద్‌లో ఐదుగురు ఎమ్మెల్యేలున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తం చేస్తూ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేసేలా మార్గదర్శనం చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఆరుగురు ఎమ్మెల్యేలు పార్టీకి చెందిన వారే ఉన్నారు. ఉప ఎన్నికలు జరుగుతున్న కంటోన్మెంట్ కూడా బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానం. అక్కడి ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీలతో విజయం సాధించిన నేపథ్యంలో ఇప్పుడూ అదే స్ఫూర్తి కొనసాగించాలని సూచించారు. మల్కాజిగిరి అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి మేరకు దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు చౌరస్తా వద్ద కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్ పాల్గొన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రోడ్ షోలు నిర్వహించారు. ఉదయం జిల్లాల్లో, సాయంత్రం నగరంలో రోడ్ షోలు ఉండేలా కేటీఆర్ ప్లాన్ చేసుకున్నారు. చివరి రోజైన శనివారం కూడా కేటీఆర్ జూబ్లీహిల్స్, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో ముస్లిం మైనార్టీలతో నిర్వహించిన సమావేశాల్లో పాల్గొన్నారు. చేవెళ్ల మినహా సికింద్రాబాద్, మల్కాజిగిరిలో ఇప్పటి వరకు పార్టీ విజయం సాధించలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఖాతా తెరవాలని లక్ష్యంగా పార్టీ ప్రచారం కొనసాగించింది.

దూకుడుగా బీజేపీ

(7వ పేజీ తరువాయి)

పోలింగ్‌పై అనుసరించాల్సిన వ్యూహాలపై దృష్టి సారించారు. హైదరాబాద్‌లో బీజేపీ ప్రచారం పోటాపోటీగా చేశారు.

అందరి దృష్టి హైదరాబాద్‌పైనే

గత పార్లమెంట్ ఎన్నికలకు భిన్నంగా ఈ సారి హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలో ప్రచారం జోరుగా సాగింది. బీజేపీ అభ్యర్థిగా మాధవీలత పేరును ప్రకటించిన నాటినుంచి ప్రచారం ముగిసేంత వరకు మజ్లిస్‌కు గట్టి పోటీ ఇచ్చేలా దీటుగా ప్రచారం నిర్వహించారు. హైదరాబాద్‌లో ఎప్పుడూ లేని విధంగా అమిత్‌షా రోడ్‌షో నిర్వహించి ఓటర్ల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేశారు. దీంతో దేశవ్యాప్తంగా ఇప్పుడు హైదరాబాద్ ఎంపీ సీటు అంశం చర్చనీయాంశంగా మారింది.

అభ్యర్థులకు వెన్నుదన్నుగా..

నామినేషన్ కంటే ముందునుంచే ప్రచార జోరు పెంచారు. నామినేషన్ల సమయంలో కూడా పలువురు కేంద్ర మంత్రులు వచ్చి అభ్యర్థులకు వెన్నుదన్నుగా నిలిచారు. మాధవీలత నామినేషన్ సందర్భంగా కేంద్ర సమాచార శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ పాల్గొన్నారు. మాధవీలతకు మద్దతుగా పాతబస్తీలో అమిత్‌షా రోడ్‌షో నిర్వహించారు. మరోసారి పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో అమిత్‌షా పాల్గొన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా సైతం రోడ్‌షోలో పాల్గొన్నారు. మాజీ గవర్నర్ తమిళి సై, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నగరంలో నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్నారు. మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా కేంద్ర మంత్రి హరిదీప్‌సింగ్ పూరి నామినేషన్ ర్యాలీలో పాల్గొన్నారు.

ఆయా వర్గాలతో...

ఉత్తర భారత దేశానికి చెందిన వారు ఇక్కడ ఎక్కువ మంది ఉండడంతో మద్దతు కూడగట్టుకునేందుకు వారితో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. కంటోన్మెంట్‌లోని మాజీ సైనికులతో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్, మల్కాజిగిరిలోని తమిళులతో మాజీ గవర్నర్ తమిళి సై, పాతబస్తీ ప్రాంతంలోని రాజస్థాన్ వాసులతో రాజస్థాన్ మంత్రి రాజ్యవర్ధన్ రాథోడ్ సమావేశాలు నిర్వహించి ఓటు బ్యాంక్‌ను పెంచుకునేందుకు ప్రయత్నించారు. అలాగే సికింద్రాబాద్ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా నటుడు సురేష్ గోపీ అంబర్‌పేటలో, కుష్బూ జూబ్లీహిల్స్‌లో ప్రచారం చేశారు.

జోరుగా కాంగ్రెస్ ప్రచారం

(7వ పేజీ తరువాయి)

ఆర్టీసీ బస్సు ఎక్కిన రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిలు ప్రయాణికులతో మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు తీరును తెలుసుకున్నారు. ఇక సీఎం రేవంత్‌రెడ్డి గ్రేటర్‌లో ఎన్నికల ప్రచారంలో అన్నీ తానై వ్యవహరించారు. పగటి వేళలో జిల్లాలో జాన జాతర సభలకు హాజరయ్యారు. సాయంత్రం వేళ హైదరాబాద్ మహానగరంలో రోడ్ షోలను నిర్వహించారు. ఒక్కోరోజు మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రోడ్ షోలను నిర్వహించి నేతలు, కార్యకర్తల్లో ఎనలేని ఉత్సాహాన్ని నింపారు. సికింద్రాబాద్ ఎంపీ స్థానం గెలిస్తే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్న సందేశాన్ని నేతలు, కార్యకర్తల్లో బలంగా తీసుకెళ్లడంతో పాటు ఆ మేరకు ప్రచారం చేశారు. సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల ఎంపీ స్థానాలను దక్కించుకోవడానికి ఓ వైపు రోడ్ షోలతో ప్రచారం నిర్వహిస్తూనే మరోవైపు ఆయా నియోజకవర్గాల నేతలతో సమావేశాలు జరుపుతూ సమన్వయం చేశారు. గ్రేటర్‌లోని హైదరాబాద్ మినహా మల్కాజిగిరి, సికింద్రాబాద్, చేవెళ్ల ఎంపీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారం నిర్వహించారు.

కేంద్రంలో 'ఇండియా' సర్కారు

ఆప్ భాగస్వామిగా ఉంటుంది.. బీజేపీకి 220-230 సీట్లు మాత్రమే

» నియంతలను తరిమికొట్టిన చరిత్ర భారత్‌ది: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, మే 11 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో వచ్చేది ఇండియా కూటమి ప్రభుత్వమేనని, దాంట్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) భాగస్వామిగా ఉంటుందని ఆ పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ చెప్పారు. సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్ ఇచ్చిన నేపథ్యంలో జైలు నుంచి శుక్రవారం విడుదలైన కేజ్రీవాల్ శనివారం ఆప్ ప్రధాన కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆప్ కార్యకర్తలు, నేతలు భారీ ఎత్తున తరలి వచ్చిన ఈ సమావేశం బహిరంగ సభను తలపించింది. కేజ్రీవాల్ మాట్లాడుతూ.. 'జైలు నుంచి బయటకొచ్చిన తర్వాత ఈ 20 గంటల్లో అనేక మంది ఎన్నికల విశ్లేషకులతో మాట్లాడాను. బీజేపీ కేంద్రంలో అధికారం కోల్పోనుందని స్పష్టమైంది. జూన్ 4న కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోవటం లేదు. నా అంచనా ప్రకారం బీజేపీకి 220-230 సీట్లకు మించవు. ఇండియా కూటమి అధికారాన్ని చేపడుతుంది. ప్రభుత్వంలో ఆప్ భాగస్వామిగా ఉంటుంది. ఢిల్లీకి పూర్తిస్థాయి రాష్ట్ర హోదాను ఇస్తాం. ప్రజల మనిషి ఢిల్లీ గవర్నర్‌గా ఉంటారు' అని కేజ్రీవాల్ ధీమా వ్యక్తం చేశారు. దేశంలో నియంతృత్వాన్ని నెలకొల్పే ప్రమాదకరమైన ఆలోచనలతో మోదీ ఉన్నారని.. 'వన్ నేషన్ వన్ లీడర్ (ఒకే దేశం ఒకే నాయకుడు) దాంట్లో భాగమని ఆరోపించారు. రష్యాలో పుతిన్‌లాగా.. భారతదేశంలో తాను తప్ప మరొక నాయకుడు ఉండకూడదనేది మోదీ ఆలోచన అని విమర్శించారు. 4 వేల ఏళ్ల చరిత్ర ఉన్న మన దేశం.. నియంతలను ఎన్నడూ సహించలేదని, వారి నియంతృత్వాన్ని ప్రజలు కూకటివేళ్లతో సహా పెకిలించి వేశారని.. ఈసారి కూడా అదే జరగనుందని తెలిపారు. ఓవైపు ప్రతిపక్ష నేతలను జైలుకు పంపటం, మరోవైపు బీజేపీ నేతలందరినీ రాజకీయంగా అంతం చేయటం ద్వారా రెండు విధాలుగా నియంతృత్వం వైపు అడుగులు వేయాలని మోదీ భావిస్తున్నారని కేజ్రీవాల్ చెప్పారు. మోదీ మళ్లీ గెలిస్తే ప్రతిపక్ష నేతలందరినీ జైలుకు పంపుతారన్నారు. మోదీ హయాంలో బీజేపీ అగ్రనేతలు అద్వానీ, మురళీ మనోహర్ జోషి, శివరాజ్‌సింగ్ చౌహాన్, వసుంధర రాజే, మనోహర్‌లాల్ ఖట్టర్, రమణ్‌సింగ్‌లను రాజకీయంగా అణచివేశారని, ఆయన మళ్లీ గెలిస్తే.. యూపీ సీఎం యోగిని రెండు నెలల్లో సీఎం పదవి నుంచి దించుతారన్నారు.


మీడియాతో భేటీ తర్వాత కేజ్రీవాల్ రోడ్ షో

ఆప్ అంతం కోసం మోదీ కుట్ర

ఢిల్లీలో ఆప్ వరుసగా ఘన ఘనవిజయాలు సాధిస్తుండటంతో వచ్చే 20 ఏళ్ల వరకు ఆప్‌ను ఓడించలేమని బీజేపీకి అర్థమై, దొడ్డిదారిన పార్టీని నాశనం చేయటానికి కుట్ర పన్నిందని కేజ్రీవాల్ తెలిపారు. దీంట్లో భాగంగానే తనతో పాటు ఆప్ అగ్రనేతలు మరో ముగ్గురిని అరెస్టు చేసి జైలుకు పంపిందని, ఇలా జరిగి ఉంటే వేరే ఏ పార్టీ అయినా విచ్ఛిన్నమైపోయేదని, కానీ, ఆప్ ఒక ఆలోచనధార కాబట్టి.. ఈ దాడిని ఎదుర్కొని నిలిచిందన్నారు. తనను జైలుకు పంపితే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తాడని, అప్పుడు ఆప్ ప్రభుత్వం పడిపోతుందని బీజేపీ భావించిందన్నారు. ఈ కుట్రను గుర్తించే తాను రాజీనామా చేయలేదన్నారు.

బీజేపీ ప్రధాని అభ్యర్థి ఎవరు?

బీజేపీ ప్రధాని అభ్యర్థి ఎవరని కేజ్రీవాల్ ప్రశ్నించారు. 75 ఏళ్లు నిండినవారు రాజకీయాల నుంచి వైదొలగాలని మోదీ బీజేపీలో నిబంధన పెట్టారని, అద్వానీ, జోషిలకు ఈ విధంగానే రిటైర్మెంట్ ఇచ్చారని గుర్తు చేశారు. 'వచ్చే ఏడాది సెప్టెంబరులో మోదీ 75వ ఏట అడుగుపెడతారు. మరి బీజేపీ ప్రధాని అభ్యర్థి ఎవరు? అమిత్‌షాను ప్రధానిగా చేయటానికి మోదీ ఈ ఎన్నికల్లో ప్రచారం చేస్తున్నారా" అని ప్రశ్నించారు.

కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా రావు

» ఒడిసాలో ప్రచార సభల్లో ప్రధాని మోదీ



భువనేశ్వర్, మే 11: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కనీసం 50 సీట్లు కూడా రావని, ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా దక్కదని ప్రధాని మోదీ అన్నారు. ఈసారి ఎన్డీఏ అన్ని రికార్డులను బద్దలుకొట్టి 400 సీట్లకు పైగా గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఒడిసాలోని పలు లోక్‌సభ నియోజకవర్గాల్లో ప్రచార సభల్లో మాట్లాడారు. 'యువరాజు' 2014 నుంచి ఒకే స్క్రిప్ట్ చదువుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని పరోక్షంగా విమర్శించారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందన్న రాహుల్ విమర్శలు ఆయన కపటత్వానికి నిదర్శనమని మోదీ మండిపడ్డారు. ఇప్పుడు రాజ్యాంగాన్ని నెత్తి మీద పెట్టుకుని డ్యాన్స్ చేస్తున్న 'యువరాజు'.. నాడు మన్మోహన్ సింగ్ ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ పత్రాలను చింపివేసి రాజ్యాంగాన్ని అవమానించారని 2013 నాటి ఘటనను గుర్తు చేశారు. పాకిస్థాన్ దగ్గరా అణుబాంబు ఉందని, ఆ దేశాన్ని గౌరవించి చర్చలు ప్రారంభించాలన్న కాంగ్రెస్ నేత మణిశంకర్ వ్యాఖ్యలపై మోదీ స్పందించారు. ఆ అణుబాంబులను ఎలా ఉంచాలో తెలియని స్థితిలో పాకిస్థాన్ ఉందని, వాటిని అమ్మేయాలని చూస్తోందన్నారు. కానీ వాటి నాణ్యత గురించి తెలిసి ఎవరూ కొనడం లేదని వ్యాఖ్యానించారు. 26 ఏళ్ల క్రితం ఇదే రోజు కేంద్రంలో వాజ్‌పేయి నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం పోఖ్రాన్ అణు పరీక్ష నిర్వహించి, భారత్ సత్తాను ప్రపంచానికి చాటిచెప్పిందన్నారు. ఒడిసాలోని బీజేడీ ప్రభుత్వంపైనా మోదీ విమర్శలు సంధించారు. భువనేశ్వర్‌లో జూన్ 10న బీజేపీ ముఖ్యమంత్రి ప్రమాణం స్వీకారం చేస్తారన్నారు.

టెంపో బిలియనీర్ల చేతిలో ప్రధాని తోలుబొమ్మ రాజు

» రాహుల్ గాంధీ విమర్శ



న్యూఢిల్లీ, మే 11: ప్రధాని మోదీపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శనాస్త్రాలు సంధించారు. "మోదీ.. టెంపో బిలియనీర్ల" చేతిలో 'తోలుబొమ్మ రాజు' అంటూ ఎద్దేవా చేశారు. అదానీ, అంబానీల నుంచి కాంగ్రెస్ టెంపోల్లో నగదు పొందుతున్నట్టు ప్రధాని వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఆయనపై రాహుల్ గాంధీ శనివారం మరోసారి విరుచుకుపడ్డారు. శుక్రవారం లఖ్‌నవూలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగం సారాంశాలతో కూడిన ఒక వీడియోను 'ఎక్స్'లో పంచుకున్నారు. "నరేంద్ర మోదీ ప్రధాని కాదు.. ఆయన ఒక రాజు. టెంపో బిలియనీర్ల చేతిలో ఆయన తోలుబొమ్మ రాజు" అంటూ హిందీలో పోస్ట్ చేశారు. లఖ్‌నవూలో జరిగిన కార్యక్రమంలోనూ మోదీ ప్రధాని కాదు రాజు అంటూ రాహుల్ గాంధీ ఆరోపించారు. కాగా లోక్‌సభ ఎన్నికలపై బహిరంగ చర్చకు ఇద్దరు మాజీ జడ్జిలు, హిందూ పత్రిక మాజీ ఎడిటర్ ఎన్.రామ్ ఆహ్వానించడాన్ని స్వాగతిస్తున్నట్టు శనివారం రాహుల్ గాంధీ తెలిపారు. ఇది ప్రధాన రాజకీయ పార్టీలు తమ దార్శనికతను ఒక వేదిక ద్వారా దేశానికి తెలియజేసేందుకు దోహదపడే సానుకూల చొరవగా ఆయన అభివర్ణించారు. ఈ చర్చలో తాను లేదా తమ పార్టీ చీఫ్ ఖర్గే పాల్గొంటామని, ఇందులో ప్రధాని కూడా పాల్గొంటారని ఆశిస్తున్నామన్నారు. ప్రధాని మోదీ చర్చలో పాల్గొనాలని దేశం ఆశిస్తోందని 'ఎక్స్'వేదికగా రాహుల్ పోస్ట్ చేశారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శనివారం ప్రధానిపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి ముకేష్ అంబానీ, గౌతమ్ అదానీలు నల్లధనాన్ని పంపుతుంటే మోదీ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. అంబానీ, అదానీల విషయంలో కాంగ్రెస్ మౌనంగా లేదని, నిజాలను ప్రజలకు చెప్తోందని అన్నారు.

అన్నొచ్చిండు!

15 ఏళ్ల తర్వాత కనౌజ్ నుంచి అఖిలేశ్ పోటీ

» గతంలో 3 సార్లు ఇక్కడ గెలిచిన ఎస్పీ చీఫ్

» ఈసారి చివరి నిమిషంలో ఎన్నికల బరిలోకి



"పార్టీ తరపున ఇక్కడ ఎవరిని నిలిపినా గెలిపిస్తాం.. ఈసారి భయ్యాజీ (అన్నయ్య) తిరిగొచ్చిండు. ఇక విజయం మాదే".. ఇదీ యూపీలోని కనౌజ్ నియోజకవర్గం సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) శ్రేణుల మాట. అత్తరు పరిశ్రమకు పేరుగాంచిన ఈ స్థానం ఎస్పీకి కంచుకోట. ఆ పార్టీ ఆవిర్భావం తర్వాత తొమ్మిదిసార్లు ఎన్నికలు జరిగితే ఏడుసార్లు గెలిచింది. ఎస్పీ వ్యవస్థాపకుడు ములాయంసింగ్ యాదవ్ ఒకసారి, ఆయన కుమారుడు, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ వరుసగా మూడుసార్లు గెలిచారు. అఖిలేశ్ భార్య డింపుల్ రెండుసార్లు నెగ్గారు. గత ఎన్నికల్లో ఆమె.. బీజేపీ అభ్యర్థి సుబ్రత్ పాఠక్ చేతిలో ఓడారు. 2009లో గెలిచిన అఖిలేశ్.. 2012లో యూపీ సీఎం కావడంతో రాజీనామా చేశారు. 15 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం ఈసారి కనౌజ్ బరిలో నిలిచారు. సీఎంగా, ఎంపీగా ఆయన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వందకు పైగా కోల్డ్ స్టోరేజీలు, 400కు మించి అత్తరు లఘు పరిశ్రమలు, 23 ప్రైవేటు డిస్టిలరీలున్న కనౌజ్‌లో యువతకు ఉపాధి లేవి ు ప్రధాన సమస్య. ఇక్కడ 13న పోలింగ్ జరగనుంది.

'ఇది ఇండియా-పాక్ ప్రపంచ కప్ మ్యాచ్'

కనౌజ్ ఎన్నికను అఖిలేశ్ వర్సెస్ పాఠక్, అఖిలేశ్ వర్సెస్ మోదీగా పేర్కొంటున్నారు. దీనిని మరింత వేడెక్కించేలా బీజేపీ సిటింగ్ ఎంపీ సుబ్రత్ పాఠక్ వ్యాఖ్యలు చేశారు. అఖిలేశ్‌తో పోటీని ఏకంగా ఇండియా-పాకిస్థాన్ ప్రపంచ కప్ మ్యాచ్‌గా అభివర్ణించారు. కాగా, సుబ్రత్‌పై 2014లో డింపుల్ 19,907 ఓట్లతో నెగ్గారు. ఆమెను సుబ్రత్ గత ఎన్నికల్లో 12,353 ఓట్ల తేడాతో ఓడించారు. ఈసారి ఎవరు గెలిచినా ఆధిక్యం మాత్రం స్వల్పమేనని అత్తరు వ్యాపారి ధీరేంద్ర మిశ్రా తెలిపారు. ఎస్పీ, బీజేపీ మాత్రం లక్షన్నర నుంచి 2 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుస్తామని చెప్పుకొంటున్నాయి. కనౌజ్, ఔరయా, కాన్పూర్ దెహాత్ జిల్లాల్లో విస్తరించిన ఉన్న కనౌజ్ నియోజకవర్గంలో 19 లక్షల మంది ఓటర్లున్నారు. ముస్లింలు 3 లక్షలు, బ్రాహ్మణులు, యాదవులు 2.5 లక్షల చొప్పున ఉన్నారు. కానీ, 4 లక్షల పైగా ఉన్న దళితులే గెలుపు నిర్దేతలు. అయితే, దళితుల పార్టీగా పేరుపడిన బీఎస్పీ ఒక్కసారి కూడా గెలవకపోవడం గమనార్హం. దళితులు కులాన్ని బట్టి కాక, అభివృద్ధికి ఓటేయడమే దీనికి కారణం. బీఎస్పీ ఇమ్రాన్ బిన్ జాఫర్‌కు టికెటిచ్చింది. ఈయన ముస్లిం ఓట్లను చీల్చే చాన్సుంది.

- సెంట్రల్ డెస్క్

అబ్బాయ్‌ని కాదని బాబాయ్..

కనౌజ్ టికెట్‌ను ఎస్పీ తొలుత ములాయం పెద్దన్న మనవడు తేజ్‌ప్రతాప్ సింగ్ యాదవ్‌కు కేటాయించింది. కానీ, చివరి నిమిషంలో అబ్బాయిని కాదని బాబాయ్ అఖిలేశ్ రంగంలోకి దిగారు. దీంతో ఎస్పీ శ్రేణుల్లో ఉత్సాహం వచ్చింది. "తేజ్‌ప్రతాప్ అయినా గెలిచేవారే. కానీ, కనౌజ్ అంటే భయ్యాజీ అఖిలేశ్" అని సీనియర్ కార్యకర్త విజయ్‌సింగ్ యాదవ్ హర్షాతిరేకం వ్యక్తం చేశాడు. కాగా, కనౌజ్ వ్యాప్తంగా అఖిలేశ్‌ను అభిమానించే యువత కూడా అధికమే. ఈ నియోజకవర్గంలో అత్యధికులు నేతాజీగా పిలుచుకునే ములాయం కుటుంబంతో వ్యక్తిగత పరిచయం ఉన్నవారే. వీరిలో వీధి వ్యాపారుల నుంచి ఉన్నత వర్గాల వారి వరకు ఉండడం గమనార్హం.

మొగ్గు మాకంటే మాకు

ఎన్డీఏకు మెజారిటీ రాదంటున్న ఇండియా.. 350 సీట్లు ఖాయమంటున్న బీజేపీ శిబిరం

న్యూఢిల్లీ, మే 11(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మూడు దశల ఎన్నికలు ముగిశాయి.. సగం పైగా స్థానాల్లో పోలింగ్ అయిపోయింది..! మరి.. రాజకీయ వాతావరణం ఎలా ఉంది? బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమిపై ప్రభుత్వ వ్యతిరేకత ప్రభావం పడనుందా? కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ఇండియా కూటమి గాలి వీస్తోందా? దీనిపై ఆ రెండు పక్షాలు తమతమ వాదనలు వినిపిస్తున్నాయి. 'దేశంలో ఇండియా కూటమి సునామీ వీస్తోంది. బీజేపీకి మెజారిటీ సీట్లు లభించే అవకాశం లేదు' అని యూపీలో రాహుల్ గాంధీ నొక్కి చెప్పారు. కాషాయ పార్టీకి గతం కంటే కనీసం వంద సీట్లు తగ్గుతాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పష్టం చేశారు. అయితే, "కాంగ్రెస్ 50 సీట్లు కూడా నెగ్గదు. ఎన్డీఏ అన్ని రికార్డులు అధిగమించి 400 పైగా స్థానాలు సాధిస్తుంది" అని ప్రధాని మోదీ చెప్తున్నారు. ఈ నేపథ్యంలో ఎవరి అంచనా సరైనదవుతుంది? అన్న ప్రశ్న ప్రతి ఒక్కరి మనసులో మెదులుతోంది. 543 లోక్‌సభ స్థానాలకు గాను ఇప్పటికి 3 దశల్లో 283 సీట్లకు ఓటింగ్ పూర్తయింది. సోమవారం 96 చోట్ల ఎన్నికలున్నాయి.

ఎన్డీఏకు దెబ్బ పడేది ఇక్కడే..

ఇండియా కూటమి నేతల లెక్కల ప్రకారం.. ప్రత్యర్థి కూటమికి యూపీలో 10, మహారాష్ట్రలో 20, బిహార్‌లో 20, రాజస్థాన్‌లో 10, కర్ణాటకలో 15, హరియాణాలో 5, పంజాబ్‌లో 4, ఢిల్లీలో 4, జార్ఖండ్‌లో 4, మధ్యప్రదేశ్‌లో 5, గుజరాత్‌లో 2, ఛత్తీస్‌గఢ్‌లో 2, ఈశాన్య రాష్ట్రాల్లో 10 సీట్లు (మొత్తం 111) తగ్గుతాయి. యూపీలో బీసీలు, మైనారిటీలు ఎస్పీ- కాంగ్రెస్ వైపు సంఘటితం అవుతున్నారని చెబుతున్నారు. హరియాణ, పంజాబ్, గుజరాత్, ఢిల్లీ తదితర చోట ప్రతి రాష్ట్రంలోనూ బీజేపీ 2 నుంచి 5 సీట్లు కోల్పోతుందని అంచనా వేస్తున్నారు.

మోదీ మాట మారింది.. అదే నిదర్శనం

ఇండియా కూటమిలో ఏ నేతను కదిలించినా బీజేపీకి మెజారిటీ సీట్లు రావని చెబుతున్నారు. మూడు దశల పోలింగ్‌ను బట్టి ఇది స్పష్టమైందని, అభివృద్ధి, రామ మందిరం ఎన్నికల ప్రధానాంశాలుగా భావించిన ప్రధాని మోదీ.. ఓటమి భయంతో హిందూ-ముస్లిం, ఇతర అప్రధాన అంశాలను లేవనెత్తి సొమ్ము చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారని పేర్కొంటున్నారు. యూపీలోనే కాదు, ప్రతి రాష్ట్రంలోనూ ఎన్డీఏకు సీట్లు తగ్గుతాయని వివరిస్తున్నారు. బిహార్‌లో బీజేపీతో చేతులు కలిపిన నితీశ్‌కుమార్ పార్టీ జేడీయూ, మహారాష్ట్రలో ఏక్‌నాథ్ శిందే శివసేన, అజిత్‌పవార్ ఎన్సీపీని ప్రజలు తిరస్కరిస్తారని పేర్కొంటున్నారు. ఇక ప్రజ్వల్ రాసలీలల వీడియోలు బయటపడిన తర్వాత కర్ణాటకలో బీజేపీ-జనతాదళ్(ఎస్) గ్రాఫ్ పడిపోయిందని విశ్లేషిస్తున్నారు.

యూపీని స్వీప్ చేస్తాం..!

విపక్ష కూటమి వాదనను బీజేపీ నేతలు గట్టిగా తిప్పికొడుతున్నారు. రామ మందిర నిర్మాణంతో యూపీలో మోదీ ప్రభంజనం వీస్తోందని, రాష్ట్రంలో శాంతిభద్రతలు నెలకొన్న రీత్యా 75 సీట్లు గెలుచుకున్నా ఆశ్చర్యం లేదని చెబుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీకి పాతిక సీట్ల దాక వచ్చినా రావొచ్చని విశ్లేషిస్తున్నారు. సందేశ్‌ఖాలీ ఉదంతంతో రాష్ట్రంలో హిందూత్వ ప్రభంజనం వీస్తోందని, సీఎం మమతా బెనర్జీ ప్రభుత్వ అవినీతిపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని అంటున్నారు. కొన్ని రాష్ట్రాల్లో ఒకటో, రెండో సీట్లు తగ్గినప్పటికీ.. ఒడిశా, తెలంగాణ, ఏపీ, తమిళనాడులో పెరుగుతాయని వివరిస్తున్నారు.

తగ్గడం కాదు.. బలపడుతున్నాం

ఇప్పటికే అత్యధిక స్థానాలు సాధించిన రాష్ట్రాల సంగతి పక్కనపెడితే.. కొత్తచోట్ల తాము బలపడనున్నామని బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. ఒడిశాలో నవీన్ పట్నాయక్ ప్రభుత్వాన్ని తమిళనాడుకు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పాండ్యన్ నియంత్రించడంపై వ్యతిరేకత వస్తోందని, ప్రజలు తమ పార్టీ వైపు చూస్తున్నారని అంటున్నారు. ఈ రాష్ట్రంలో గతంలోని 9 సీట్లు 14కు పెరుగుతాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణలో 6 నుంచి 8, ఏపీలో 3 నుంచి 5 సీట్లు వస్తాయని చెప్పుకొస్తున్నారు. ఈ లెక్కన ప్రముఖ ఆర్థికవేత్త సుర్జీత్‌భల్లా అంచనా వేసినట్లు 350 సీట్లు వచ్చే అవకాశాలూ లేకపోలేదని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు.

రస్కిన్ బాండ్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రదానం



న్యూఢిల్లీ, మే11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆంగ్ల రచయిత రస్కిన్ బాండ్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ ఫెలోషిప్‌ను ప్రదానం చేసిం ది. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్య క్షుడు మాధవ్ కౌశిక్, కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాస రావు శనివారం ముస్సోరిలో రస్కిన్ బాండ్ నివాసానికి వెళ్లి ఈ ఫెలోషిప్‌ను అందజేశారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని కసౌలీలో 1934 మేలో జన్మించిన రస్కిన్ బాండ్ గత 50ఏళ్లుగా సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో రచనలు చేస్తున్నారు. పలు కథా సంకలనాలు, వ్యాసాలు, పిల్లల పుస్తకాలు రచించారు. వాగ్రంట్స్ ఇన్ ద వ్యాలీ, వన్స్ అపాన్ ఎ మాన్‌సూన్ టైమ్, యాంగ్రీ రివర్, స్ట్రేంజర్స్ ఇన్ ద నైట్, ఆల్ రోడ్స్ లీడ్స్ గంగా మొదలైనవి ఆయన ప్రముఖ రచనలు. 1857సిపాయిల తిరుగుబాటుపై ఆయన రచించిన నవల ఆధారంగా జునూన్ అనే చలన చిత్రం రూపొందించారు. ఆయన రచనలపై అనేక టీవీ సీరియల్స్ వచ్చాయి. ఆయన కథా సంకలనానికి 1992లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కింది. అకాడమీ బాలసాహిత్య పురస్కారం, పద్మశ్రీ, పద్మభూషణ్ పురస్కారాలు ఆయనకు దక్కాయి. ఇటీవల జ్ఞాన్‌పీఠ్ పురస్కారానికి కూడా ఆయన పేరును పరిశీలించారు.

అఫ్ఘాన్‌లో వరదలు 300 మంది మృతి

ఇస్లామాబాద్, మే 11: ఆకస్మిక వరదలతో అఫ్ఘానిస్థాన్ అతలాకుతలమవుతోంది. వరదల ధాటికి సుమారు 300 మంది చనిపోయారని, దాదాపు 1000పైగా గృహాలు ధ్వంసమయ్యాయని శనివారం ఐక్యరాజ్యసమితి తెలిపింది. భీకర వానకు ఉత్తర అఫ్ఘానిస్థాన్ తీవ్రంగా ప్రభావితమైంది. బఘ్లాన్, ఘోర్, హెరాత్, బదాక్షన్ ప్రావిన్సులు దారుణంగా దెబ్బతిన్నాయి. వర్షాలకు పలు ఇళ్లు నేలమట్టమయ్యాయి. వరదల ధాటికి వాహనాలు కొట్టుకుపోయాయి. రహదారులు, వీధుల్లో బురద పేరుకుపోయింది. ప్రాణ నష్టం భారీగా ఉండడంతో అధికారులు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. "శుక్రవారం కురిసిన భారీ వానలకు నదులు పొంగిపొర్లాయి. దీంతో ఉత్తర అఫ్ఘాన్‌లో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించాం. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది" అని తాలిబాన్ ప్రభుత్వ ప్రతినిధి ఒకరు తెలిపారు.

లిక్విడ్ రామ్‌జెట్ ఇంధన పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ, మే 11: బ్రహ్మోస్ తరహాలో భారత్ సొంతంగా అభివృద్ధి చేస్తున్న సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిసైల్ తయారీలో డీఆర్‌డీవో మరో కీలక ముందడుగువేసింది. కాన్పూర్‌లోని డిఫెన్స్ మెటీరియల్, స్టోర్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఎంఎస్ఆర్‌డీఈ), డీఆర్‌డీవో దీని కోసం దేశీయంగా అభివృద్ధి చేసిన లిక్విడ్ రామ్ జెట్ ఇంధనాన్ని ఈ నెల 8న విజయవంతంగా పరీక్షించింది. బ్రహ్మోస్ క్షిపణిని డీఆర్‌డీవో, రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. వీటి మధ్య ఒప్పందం ప్రకారం బ్రహ్మోస్ క్షిపణిలోని రామ్‌జెట్ ఇంజన్లు, దాని ఇంధనం, ఇతర భాగాలను రష్యా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. అయితే డీఆర్‌డీవో ఇప్పుడు దేశీయంగా సొంతంగా లిక్విడ్ రామ్‌జెట్ ఇంధన (ఎల్ఎఫ్ఆర్‌జే) ఇంజన్, లాంగ్ రేంజ్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణిని అభివృద్ధి చేసే పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో దానిలో ఉపయోగించే లిక్విడ్ రామ్ జెట్ ఇంధనాన్ని విజయవంతంగా పరీక్షించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

పాక్ సరిహద్దుల్లో 'దృష్టి-10' నిఘా

న్యూఢిల్లీ, మే11: పాకిస్థాన్ సరిహద్దు వెంబడి నిఘాను పెంచే దిశగా భారత్ అడుగులు వేస్తోంది. భారత ఆర్మీ, నేవీ కోసం దృష్టి-10 డ్రోన్‌గా పిలిచే నాలుగు హెర్మెస్-900 స్టార్‌లైనర్ డ్రోన్లను కొనుగోలు చేసింది. అదానీ డిఫెన్స్ సిస్టమ్స్ ఈ డ్రోన్లను సరఫరా చేస్తుంది. తొలి డ్రోన్‌ను ఇప్పటికే ఈ ఏడాది జనవరిలో నావికాదళానికి అందించగా.. రెండో డ్రోన్‌ను జూన్ 18న హైదరాబాద్‌లో ఆర్మీ దళానికి అప్పగించనున్నారు. ఆ తర్వాత మిగిలిన 2 డ్రోన్లలో ఒకదాన్ని నేవీకి, మరొకదాన్ని ఆర్మీకి సరఫరా చేస్తారని రక్షణ శాఖ అధికారులు తెలిపారు. భారత ఆర్మీ ఈ డ్రోన్లను భటిండా సైనిక స్థావరం వద్ద మోహరించనుందని, అక్కడి నుంచి పాకిస్థాన్‌తో ఉన్న మొత్తం పశ్చిమ సరిహద్దు ప్రాంతంపై నిఘా పెట్టవచ్చని వారు పేర్కొన్నారు. భారత ఆర్మీ ఇప్పటికే హెరాన్ మార్క్ 1, మార్క్ 2 డ్రోన్లను వినియోగిస్తోంది.

లోకం తీరు





అబ్ కీ బార్?

బీసీల ద్రోహి బీజేపీని చిత్తుగా ఓడిస్తాం : బీసీ సంఘాలు

బీసీ కులగణన, రిజర్వేషన్ల పెంపుకు సానుకూలంగా ఉన్న ఇండియా కూటమికే సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు పలు బీసీ సంఘాలు తీర్మానం చేశాయి. 'దేశంలో సమగ్ర కులగణన- బీసీ రిజర్వేషన్ల పెంపు' అనే అంశంపై ఎల్బీ స్టేడియంలోని ఫతేమైదాన్ క్లబ్‌లో బీసీ సంఘాల సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. 70 కోట్ల బీసీలను కేంద్ర ప్రభుత్వం దగా చేస్తోందని, బీసీల ద్రోహి బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.

- బర్కత్‌పుర

ప్రచారం ముగిసింది.. ప్రలోభాలు షురూ

ఓటర్లకు డబ్బు, మద్యం పంపిణీతో ఎర

ఓటుకు నోటు

- ఓటర్ స్లిప్పు చూపించినవారికి డబ్బులు!
- చాలా చోట్ల రూ.300-500 పంపిణీ
- కొన్ని నియోజకవర్గాల్లో ఓటుకు వెయ్యి

హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగిసింది. ప్రచార రథాల హోరు.. సభలు సమావేశాల్లో ప్రసంగాల జోరుకు తెరపడింది. డప్పు దరువులు.. జిందాబాద్ నినాదాలు ఆగిపోయాయి. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి ప్రచారాన్ని ముగించుకున్న నేతలు.. ప్రలోభాల పర్వానికి తెర తీశారు. ఓటర్లకు డబ్బు, మద్యం ప్రవాహాన్ని షురూ చేశారు. ఎన్నికల పర్వంలో ఓటింగ్‌కు ముందు 24 గంటలు ఎంత కీలకమో తెలిసిన నేతలంతా శనివారం సాయంత్రం నుంచే ఓటర్లకు తాయిలాల పంపిణీ మొదలుపెట్టారు. ఆర్థికంగా బలమైన అభ్యర్థులున్న చోట, హోరాహోరి పోటీ నెలకొన్న చోట కాస్త ఎక్కువ సొమ్మును పంపిణీ చేస్తుండగా.. అత్యధిక నియోజకవర్గాల్లో తక్కువ మొత్తాలతో సరిపెడుతున్నారు. కుల, యువజన, మహిళా సంఘాల నాయకులతో ముందుగానే కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం డబ్బులు పంపుతున్నారు. మల్కాజ్‌గిరిలో ఓ కుల సంఘం నాయకులకు ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి రూ.12 లక్షలు ఇచ్చారని ప్రచారం జరుగుతోంది. పలు బస్తీల్లో ఓటుకు రూ.500 చొప్పున ప్రధాన పార్టీ నేతలు పంపిణీ చేశారు. సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఒక్కో నియోజకవర్గంలో 30 వేల నుంచి 50 వేల మంది ఓటర్లకు రూ.500 నగదు ఇస్తున్నారు. చేవెళ్లలో ఒక్కో ఓటుకు రూ.500 నుంచి రూ.1000 వరకు పంపిణీ చేస్తున్నట్టు తెలిసింది. మల్కాజిగిరి, మెదక్, ఖమ్మం, జహీరాబాద్‌లో రూ.500-1000 చొప్పున పంపిణీ సాగుతున్నట్టు తెలిసింది. ఇక, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్‌లో రూ.200-300 చొప్పున పంచుతున్నట్టు తెలిసింది. ఆదిలాబాద్, పెద్దపల్లి, నాగర్‌కర్నూల్, భువనగిరి, మహబూబాబాద్ వంటి నియోజకవర్గాల్లో పంపిణీ ఛాయలు పెద్దగా కనిపించకపోయినా.. గ్రూపుగా వచ్చి అడిగే ఓటర్లకు ఎంతో కొంత ముట్టజెప్తున్నట్టు తెలిసింది. ముఖ్యంగా మహిళా సంఘాలకు కొంత మొత్తం చొప్పున పార్టీలు అందజేస్తున్నాయి. ఆదివారం రాత్రికి పంపిణీలో కాస్త జోరు పెరగవచ్చని అంటున్నారు. జహీరాబాద్ పరిధిలో ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి.. నాయకుల ద్వారా ఓటర్ల వివరాలు తెలుసుకుని ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా నాయకుల ఫోన్ల నుంచి ఓటర్ల బ్యాంకు ఖాతాలకు రూ.500చొప్పున బదిలీ చేస్తున్నట్లు తెలిసింది. సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని ముషీరాబాద్ అచ్చయ్యనగర్‌లో ఓ పార్టీ బస్తీ నాయకుడు ఓటుకు రూ.500 చొప్పున పంపిణీ చేశారు. మళ్లీ డబ్బులొస్తే రెండో విడత కూడా చెల్లింపులు ఉంటాయని చెబుతున్నారు.

మెదక్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని రామచంద్రాపురం పట్టణం బొంబాయి కాలనీలో ఓటర్లకు బీఆర్ఎస్ నాయకులు డబ్బులు పంపిణీ చేస్తుండగా.. బీజేపీ నేతలు వారిని పట్టుకున్నారు. శనివారం మధ్యాహ్నం కొందరు బీఆర్ఎస్ నాయకులు కారు, ద్విచక్రవాహనంపై వచ్చి ఇంటింటికి వెళ్లి నగదును పంపిణీ చేయడం ప్రారంభించారు. ఈ సమాచారం అందుకున్న బీజేపీ నాయకులు కార్యకర్తలు, యువత వారిని పట్టుకున్నారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

75 ఏళ్లు నిండినా.. మోదీనే ప్రధాని

(మొదటి పేజీ తరువాయి)

నేను పేర్కొన్నట్లు వీడియోను ఎడిట్ చేశారు. ఈ విషయంలో రేవంత్‌రెడ్డి తప్పుచేశారు. శ్రీరామనవమి రోజు భద్రాచలంలో పట్టువస్త్రాలను సమర్పించే సంప్రదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆపేసింది. కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్, ఇండీ కూటమి నాయకుడు ఫరూఖ్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు దేశ సమగ్రతను దెబ్బతీసేలా ఉన్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే. అమెరికా, ఇజ్రాయెల్ తర్వాత సర్జికల్ స్ట్రైక్స్ చేసిన మూడో దేశం భారత్ మాత్రమే. అయితే.. భారత్ చేసిన సర్జికల్ స్ట్రైక్స్‌ను మన వాళ్లే(రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి) ప్రశ్నిస్తున్నారు. దేశంలోకి చొరబడేందుకు యత్నిస్తే ఊరుకునేదిలేదు. శత్రువు భూభాగంలోకి చొచ్చుకువెళ్లి మరీ.. దాడులు చేస్తాం" అని స్పష్టం చేశారు.పాకిస్థాన్ వద్ద అణ్వాయుధాలుంటే భయపడాలా? అని ప్రశ్నించారు. పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలు, 370వ అధికరణ రద్దు, సర్జికల్ స్ట్రైక్స్‌ను ఇండీ కూటమి నేతలు ప్రశ్నిస్తున్నారని, రోహింగ్యాలను ఆహ్వానిస్తున్నారని, తెలంగాణ ప్రభుత్వం ఇక్కడ విమోచన దినోత్సవాన్ని నిర్వహించకుండా అండుపడుతోందని దుయ్యబట్టారు.



వనపర్తి జనసభలో మాట్లాడుతున్న అమిత్‌షా, చిత్రంలో అభ్యర్థి భరత్‌ప్రసాద్



వికారాబాద్ సభకు హాజరైన జనం

రేవంత్-రాహుల్ ట్యాక్స్

"సోనియాగాంధీ జన్మదినం రోజున రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. అయితే.. సోనియా ఎన్నో పుట్టినరోజున ఆ హామీని నెరవేరుస్తారు? రైతులకు రూ 15వేల రైతు భరోసా, క్వింటా ధాన్యానికి రూ 500 బోనస్, మహిళలకు రూ.2,500 హామీలను ఎప్పుడు అమలు చేస్తారు?" అని రేవంత్‌ను అమిత్‌షా ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా.. హైకమాండ్‌కు ఇచ్చిన హామీ మేరకు దేశవ్యాప్తంగా ఎన్నికల కోసం తెలంగాణ నుంచి వసూలు చేసి, పంపిస్తున్నారని విరుచుకుపడ్డారు. రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ ఒక్కటై.. రాష్ట్ర ప్రజలపై ఆర్ఆర్ ట్యాక్స్ విధిస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీ కూడా ఆర్ఆర్ ట్యాక్స్‌పై విమర్శలు చేసిన విషయం తెలిసిందే.! అయితే.. ఆర్ఆర్ అంటే ఏమిటో ఆయన వివరించలేదు. అమిత్‌షా మాత్రం ఆర్ఆర్ అంటే రేవంత్-రాహుల్ ట్యాక్స్ అని స్పష్టం చేశారు. తెలంగాణను కాంగ్రెస్ పార్టీ ఏటీఎంలాగా మార్చుకుందని విమర్శించారు. కాళేశ్వరం మాదిరిగానే పాలమూరు-రంగారెడ్డి అవినీతి ప్రాజెక్టుగా మారిందన్నారు. రాష్ట్రంలో ముస్లింలకు అమలవుతున్న 4% రిజర్వేషన్లను రద్దుచేసే ధైర్యం ఉందా? అని సీఎంకు సవాల్ విసిరారు. రాష్ట్రంలో తమకు 10 కంటే ఎక్కువ సీట్లు వస్తే.. రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్న ముస్లిం రిజర్వేషన్లను రద్దుచేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. ప్రభుత్వాన్ని నడిపేది మజ్లిస్సేనని అన్నారు. "తెలంగాణ ఆవిర్భవించినప్పుడు మిగులు బడ్జెట్‌లో ఉంది. ఈ పదేళ్లలో రూ.లక్షల కోట్ల మేర అప్పు చేశారు. ఆ నిధులన్నీ ఎక్కడికెళ్లాయి? ఏం చేశారు?" అని నిలదీశారు. బీఆర్ఎస్ పదేళ్ల రాష్ట్రాన్ని దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే పనిచేస్తోందని ఆరోపించారు. కాగా, అరవింద్ కేజ్రీవాల్ నిర్దోషి అని కోర్టు తీర్పు ఇవ్వలేదని, మధ్యంతర బెయిల్ మాత్రమే ఇచ్చిందని అమిత్‌షా గుర్తుచేశారు. దీనిని కేజ్రీవాల్ మరోవిధంగా అనుకుంటే అది ఆయన అమాయకత్వమే అవుతుందన్నారు.

3 దశల్లోనే బీజేపీకి 190 సీట్లు

మూడు దశల ఎన్నికల్లో బీజేపీకి 190 సీట్లను ప్రజలు కట్టబెట్టారని, తెలంగాణలో పది కంటే ఎక్కువ సీట్లలో బీజేపీ అభ్యర్థులను గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అమిత్‌షా అభిప్రాయపడ్డారు. ఎన్డీయే 400సీట్లను గెలుచుకోవడం ఖాయమన్నారు. రూ.12లక్షల కోట్ల అవినీతి చేసిన పార్టీ కాంగ్రెస్ అని.. మోదీ 23 ఏళ్లలో 25 పైసల అవినీతి కూడా చేయలేదన్నారు.

పదేళ్లలో రాష్ట్రానికి భారీగా నిధులిచ్చాం

రాష్ట్ర ఆవిర్భావ సమయంలో మిగులు బడ్జెట్‌లో ఉన్న తెలంగాణ.. ఈ పదేళ్లలో ఆర్థికంగా వెనుకబాటుకు గురైందని, అయితే.. కేంద్రం భారీగా నిధులిచ్చిందని అమిత్‌షా వెల్లడించారు. గ్రాంట్-ఇన్-ఎయిడ్ విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.15 వేల కోట్లు అందితే.. తెలంగాణకు రూ.63 వేల కోట్లిచ్చామన్నారు. ఈ పదేళ్లలో రూ.1.62 లక్షల కోట్లను జాతీయ రహదారుల నిర్మాణాలకు, రూ.32వేల కోట్లను రైల్వే ప్రాజెక్టులకు, రూ7వేల కోట్లను విమానాశ్రయాలకు కేటాయించామని గుర్తుచేశారు. రూ.900 కోట్లతో గిరిజన వర్సిటీ, పసుపు బోర్డును కేటాయించామన్నారు. రూ.6,500 కోట్లతో రామగుండంలో ఫర్టిలైజర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభిమచామని చెప్పారు. ఎఫ్ఆర్‌బీఎంని మించి తెలంగాణకు రూ.9వేలకోట్లు రుణం ఇచ్చినందుకు మోదీకి రేవంత్ ధన్యవాదాలు చెప్పాలన్నారు. ఈ నిధులు రాంటే.. ఉద్యోగులకు జీతాలూ చెల్లించలేకపోయేవారన్నారు. తాము పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థను 11 నుంచి 5వ స్థానానికి తీసుకొచ్చామని పేర్కొన్నారు. బీజేపీకి మూడింట రెండొంతుల మెజారిటీ పదేళ్లుగా ఉందని, రిజర్వేషన్లను తొలగించాలనుకుంటే ఎప్పుడో చేసేవారిమని వ్యాఖ్యానించారు. తమకు అలాంటి ఉద్దేశమే లేదన్నారు.

ఈ ఎన్నికలు దేనికి రెఫరెండం?

కాంగ్రెస్ అవినీతికా? ఆర్ఆర్ ట్యాక్స్‌కా ?

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ధ్వజం

హైదరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఈ ఎన్నికలు రెఫరెండం అంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అది కాంగ్రెస్ పార్టీ అవినీతికా ? ఆర్ఆర్ ట్యాక్స్‌కా ? అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు.



మాజీ సీఎం కేసీఆర్ మాదిరిగానే రేవంత్ రెడ్డి కూడా అత్యంత ప్రమాదకారి అని అన్నారు. ప్రధాని మోదీ పదేళ్ల కాలంలో తెలంగాణకు ఏం చేయలేదంటూ కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఈ మేరకు మీడియా సమావేశంలోనూ, సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రజలకు రాసిన లేఖలోనూ కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి అధికారం కోసం ఎంతకైనా తెగిస్తారని, అబద్ధాలు చెప్పడంలో వారికి వారే సాటి అని కిషన్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి, కేసీఆర్ చెబుతున్న మాటలకు ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. అవినీతికి మారుపేరైన కాంగ్రెస్ మాదిరిగానే బీజేపీ కూడా ఉంటుందని రేవంత్ అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో అభద్రతాభావం, అసహనం, అబద్ధాలు, వక్రీకరణలు పెరిగిపోతున్నాయని చెప్పారు. నిజాలు చెబితే కాంగ్రెస్ ఎన్నికల్లో గెలవదని తెలిసే అబద్ధాలు చెప్పి బీజేపీపై బురద జల్లుతున్నారని ఆరోపించారు. అణుబాంబు కలిగి ఉన్న పాకిస్థాన్‌కు అణిగిమణిగి ఉండాలంటూ కాంగ్రెస్ నేత ఒకరు చేసిన వ్యాఖ్యలకు కిషన్ రెడ్డి కౌంటరిచ్చారు. పాక్‌కు అణిగిమణిగి ఉండటం కాంగ్రెస్‌కు అలవాటని, నేడు దేశంలో అధికారంలో ఉన్నది బీజేపీ అని గుర్తు చేశారు. భారత్‌పై ఒక్కసారి దాడి చేస్తే వంద సార్లు ఎదురుదాడి చేస్తామనే విధంగా మోదీ పాక్‌కు జవాబిచ్చారని గుర్తు చేశారు. కేసీఆర్ కుటుంబ వైఖరి కారణంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని అందిపుచ్చుకోలేదంటూ గతంలో మాట్లాడిన కాంగ్రెస్ నేతలు వాటిని మరిచిపోయి గాడిదలతో గుడ్లు పెట్టించే స్థాయికి దిగజారారని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. పేద ప్రజల కోసం మోదీ ప్రభుత్వం ఇస్తున్న ఉచిత బియ్యం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్‌కు, రాహుల్ గాంధీకి గాడిద గుడ్డులాగా కనిపిస్తున్నాయా? అని ప్రశ్నించారు. బస్తీ దవాఖానాలు, పీఎం కిసాన్ డబ్బులు, తెలంగాణలో నిర్మించిన 2500కి.మీ హైవేలు, యూరియా పరిశ్రమ, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ గాడిద గుడ్డులాగా కనిపిస్తున్నాయా? అని కిషన్ రెడ్డి మండిపడ్డారు.

తల తెగినా.. మోదీ ముందు తలొంచం

- బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటైతే కవిత జైల్లో ఉంటదా?: కేటీఆర్



హుజూరాబాద్/మంచిర్యాల/హైదరాబాద్ సిటీ/ముషీరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): "పుట్టేది ఒక్కసారే.. చనిపోయేది ఒక్కసారే.. మమ్మల్ని భయపెట్టి లొంగదీసుకునేందుకు ప్రధాని మోదీ ప్రయత్నించారు. తల తెగిపడినా సరే మోదీ ముందు తలవంచం. కేసీఆర్ పాలన అంటే పదేళ్ల నిజం.. బీజేపీ పాలన పదేళ్ల విషం.. 150 రోజుల అబద్ధం కాంగ్రెస్ పాలనల మధ్య లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని కాంగ్రెస్ బేవకూఫ్ గాళ్లు ప్రచారం చేస్తున్నారు. అదే నిజమైతే మా చెల్లి కవిత జైల్లో ఉంటదా? ఎన్నికల అనంతరం రేవంత్‌రెడ్డి బీజేపీలో చేరుతాడని ఆ పార్టీ ఎంపీలే చెబుతున్నారు. ఇక్కడ కాంగ్రెస్ గెలిచే అవకాశం లేదు. పొరపాటున మీరు ఆ పార్టీకి ఓటేస్తే బీజేపీకి మేలు జరుగుతుంది. ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెట్, ఎమ్మెల్యే కేటీఆర్ కోరారు. శనివారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నిర్వహించిన రోడ్ షోలో, మంచిర్యాల జిల్లా చెన్నూరులో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో, జూబ్లీహిల్స్, ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముస్లిం మైనార్టీలతో నిర్వహించిన సమావేశాల్లోనూ పాల్గొన్న కేటీఆర్ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన దానం నాగేందర్ ఇప్పుడు కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నాడని, ఒకవేళ ఆయన గెలిస్తే బీజేపీలో చేరడన్న గ్యారంటీ ఏంటని ప్రశ్నించారు. పదేళ్ల పాలించిన ప్రధాని మోదీ ఒక్క మంచి పనైనా చేశారా అని ప్రశ్నించారు. నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రతి పేదవాడి ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని చెప్పారని, మరి ఆ డబ్బులు ఏవని నిలదీశారు. ఆర్ఎస్ఎస్ మనిషి రేవంత్‌రెడ్డి సీఎంగా ఉండడం వల్లే రాష్ట్రంలో రంజాన్ తోఫా రాలేదని ఆరోపిచారు.

ప్రలోభాలపైనే బీజేపీ, కాంగ్రెస్ ఆశలు : హరీశ్

సిద్దిపేట/గజ్వేల్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడంపైనే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఆశలు పెట్టుకున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. డబ్బు, మద్యం పంపిణీ చేసి ఈ ఎన్నికల్లో గెలిచేలా ఆ పార్టీలు అడ్డదారులు తొక్కుతున్నాయన్నారు. అందుకే సీ-విజిల్ యాప్ ద్వారా బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు పోలీసులకు, ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. శనివారం ఆయన సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో, గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడారు. సిద్దిపేటలో జరిగిన బీజేపీ అగ్రనేత అమిత్‌షా సభకు జనం రాకపోవడంతో కేవలం 7 నిమిషాల్లోనే తిరిగి వెళ్లిపోయారన్నారు. తాజాగా కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ సరూర్‌నగర్‌లో 3 పార్లమెంటు నియోజకవర్గాల సభ నిర్వహిస్తే 3 వేల మంది కూడా రాలేదని, ఆయన కూడా 10 నిమిషాల్లోనే తిరిగి వెళ్లారన్నారు. కేంద్రంలో పదేళ్ల బీజేపీ పాలన, రాష్ట్రంలో ఐదునెలల కాంగ్రెస్ పాలన వైఫల్యాలను చూసి ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని చెప్పారు. కేసీఆర్ చేపట్టిన సభలు, రోడ్‌షోలు నాటి ఉద్యమ సందర్భాలను గుర్తుచేశాయని, ప్రతీచోటా ఇసుకేస్తే రాలనంతగా ప్రజలు వచ్చారని తెలిపారు. ముఖ్యంగా తమ పదేళ్ల పాలనా కాలంలో పుట్లకొద్ది వడ్లు పండించిన రైతులు నేడు పుట్టెడు కష్టాల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగ సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీ ఒక్క టికెట్ కూడా ఇవ్వలేదని, మైనార్టీలకు వారి క్యాబినెట్‌లో మంత్రిగా స్థానం కల్పించలేదని విమర్శించారు.

కేసీఆర్.. దేశద్రోహి

- నన్ను ఓడించేందుకు ఏ,బీ, సీ గ్యాంగ్ ఒక్కటైంది
- కాంగ్రెస్‌కు ఓటేస్తే మిగిలేది గాడిద గుడ్డే: బండి సంజయ్



కరీంనగర్‌లో మాట్లాడుతున్న బండి సంజయ్

కరీంనగర్/సిరిసిల్ల, మే 11(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ దేశ ద్రోహానికి పాల్పడ్డారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో దొరికిపోతానన్న భయంతో ఇంటెలిజెన్స్ వద్ద ఉన్న దేశ భద్రత డేటాను కూడా ధ్వంసం చేయించారని విమర్శించారు. దేశ భద్రత డేటాను ధ్వంసం చేసిన వ్యక్తిని ఎలా వదలిపెడతారు? ఎందుకు ఆయన్ను జైల్లో వేయలేదు? అని సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. 'కేసీఆర్.. నేను హిందూ ఓటు బ్యాంకుతో పక్కాగా గెలువబోతున్నా.. ఒక వేళ నేను ఓడిపోతే హిందూత్వం గురించి మాట్లాడను.. కాషాయ జెండాను పట్టుకోను.. మీ అభ్యర్థి ఓడిపోతే మతం మార్చుకొని బీఆర్ఎస్ దుకాణం బంద్ చేసి ఫాంహౌజ్‌కు వెళ్లిపోవాలి. దమ్ముంటే నా సవాల్‌ను స్వీకరించాలి" అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ విధానాల వల్ల 1950 నుంచి 2015 వరకు భారత్‌లో హిందువుల జనాభా 8శాతం తగ్గితే, ముస్లిం జనాభా 43 శాతం పెరిగిందని తెలిపారు. కరీంనగర్, సిరిసిల్లలో శనివారం వేలాది మంది స్వచ్ఛందంగా బైక్ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ మోదీ మళ్లీ ప్రధాని కావాలని, తాను మళ్లీ గెలవాలని ప్రజలు కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. తనను ఓడించేందుకు ఏ(అసదుద్దీన్), బీ(బీఆర్ఎస్), సీ(కాంగ్రెస్) గ్యాంగ్ ఒక్కటైంది. కానీ, నా వెనుక సాక్షాత్తూ శ్రీరాముడు, హిందూ సమాజం, మోదీ ఉన్నారు. ఎన్ని గ్యాంగ్‌లు వచ్చినా నన్నేమీ చేయలేవు" అని స్పష్టం చేశారు. ముస్లింలంతా ఒక్కటై సంజయ్‌ను ఓడించాలని కేసీఆర్ పిలుపునిచ్చారని, దీనిపై హిందువులందరూ స్పందించాలని కోరారు. "మీ కోసం నేను కొట్లాడిన. నిరుద్యోగులు, ఆర్టీసీ కార్మికుల కోసం జైలుకు పోయిన. కరీంనగర్ అభివృద్ధి కోసం రూ. 12వేల కోట్లు తీసుకువచ్చిన" అని వివరించారు. సర్జికల్ స్ట్రైక్స్ జరిగాయనడానికి ఆధారాలున్నాయా? అంటూ దేశ జవాన్లను రేవంత్ అవమానిస్తున్నారని ధ్వజమెత్తారు. సర్జికల్ స్ట్రైక్స్‌ను సమర్థించే ప్రజలందరూ బీజేపీకి ఓటు వేయాలని సూచించారు. బీజేపీ.. క్యాన్సర్ లాంటిదన్న రేవంత్ వ్యాఖ్యలపై సంజయ్ మండిపడ్డారు. కాంగ్రెస్ అవినీతి రోగానికి ప్రపంచంలో ఎవరూ మందు కనిపెట్టలేదని తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆ రోగమంతా అంటుకుంటుందని, ఇది దేశానికి ప్రమాదకరమని హెచ్చరించారు. "గాడిద గుడ్డు పెట్టదు.. ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ అమలు చేయదు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మిగిలేది గాడిదగుడ్డే. ఆ గుర్తునే పట్టుకుని రేవంతన్న తిరుగుతున్నరు" అని విమర్శించారు. సీఎం పదవి కోల్పోయిన కేసీఆర్.. చిలుక జోస్యం చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రధాని అవుతానని ఇంకా కలలు కంటున్నారని, అసలు ఆ పార్టీకి ఒక్క సీటూ రాదని తేల్చిచెప్పారు. కరీంనగర్ నుంచి సంజయ్‌కు బంపర్ మెజారిటీ ఖాయమని ఎమ్మెల్యే రాజాసింగ్ స్పష్టం చేశారు.



నేను సైతం ప్రధాని రేసులో..!

- ప్రాంతీయ పార్టీల కూటమిదే అధికారం
- పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నా
- బీజేపీకి రాష్ట్రంలో ఒకటి లేదా సున్నా సీట్లు
- మాకు 14 సీట్లిస్తే తడాఖా చూపిస్తాం
- వచ్చే అసెంబ్లీ సెషన్స్‌లో నా ప్రళయతాండవం చూస్తారు: కేసీఆర్



హైదరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఈ ఎన్నికల్లో కేంద్రంలో ప్రాంతీయ పార్టీల కూటమి అధికారంలో రానుందని.. తాను కూడా ప్రధాని పదవి రేసులో ఉన్నానని జాతీయ పార్టీ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు! రాష్ట్రంలో రాజకీయంగా బతికి బట్టకట్టడమే పెను సవాల్‌గా కనిపిస్తున్న పరిస్థితుల్లో.. జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తానంటున్నారు. ఏ జాతీయ పార్టీ అయినా ప్రాంతీయ పార్టీల కూటమికి మద్దతు ఇవ్వాల్సిందేనని.. ఈమేరకు తాను ప్రాంతీయ పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నానని చెప్పారు. "ఈ ఎన్నికల్లో 14 సీట్లలో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే తెలంగాణ తడాఖా ఏంటో చూపిస్తాం" అని పేర్కొన్నారు. తమ జాతీయ రాజకీయ ప్రస్థానం కొనసాగుతుందని.. అక్టోబరులో మహారాష్ట్రలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేస్తుందని వెల్లడించారు. ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ 9 చోట్ల మూడోస్థానంలో ఉండనుందని.. బీజేపీకి ఒకటి లేదా సున్నా సీట్లే వస్తాయని.. తమకు 12 నుంచి 14 దాకా స్థానాలు వస్తాయని జోస్యం చెప్పారు. దేశంలో బీజేపీకి 200 సీట్లు కూడా రావని, దక్షిణాది రాష్ట్రాల్లో 10 సీట్లు కూడా రావని స్పష్టం చేశారు. ఉత్తరాదిన బీజేపీకి గణనీయంగా సీట్లు తగ్గుతాయని.. ఇండియా కూటమి కూడా అధికారంలోకి వచ్చే చాన్స్ లేదని స్పష్టం చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన.. ఆగస్టు 15లోగా ఏకకాలంలో రైతు రుణమాఫీ అసాధ్యమని అభిప్రాయపడ్డారు. 'రేవంత్ చేతగాని సీఎం. రాష్ట్రం నుంచి పరిశ్రమలను తరలించుకుపోవడానికి మోదీ ప్రయత్నిస్తున్నా ఏం చేయలేకపోతున్నాడు" అని మండిపడ్డారు. రాష్ట్రంలో రూ.1000 కోట్ల పెట్టుబడులు పెట్టాలనుకున్న కార్నింగ్ పరిశ్రమ.. కరెంట్ కోతలు, ప్రభుత్వ చేతకానితనం కారణంగా తమిళనాడుకు తరలిపోయిందన్నారు. బీఆర్ఎస్ మహాసముద్రం లాంటిదని, లక్షమంది రేవంత్‌లు వచ్చినా ఏం చేయలేరని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు చెందిన 26మంది తమ పార్టీ ముఖ్యులతో చర్చలు జరుపుతున్నారని చెప్పారు. వచ్చే అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతానని, ఆ సెషన్స్‌లో ప్రళయ తాండవం చూస్తారని అన్నారు.

వాడెవడయ్యా... రాధాకిషన్‌రావు...

సీఎం కేసీఆర్ చెప్పినందువల్లే ఫోన్ ట్యాపింగ్ చేశానని టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు ఇచ్చిన వాంగ్మూలం గురించి అడగ్గా.. 'వాడెవడయ్యా రాధాకిషన్‌రావు.. ట్యాపింగ్‌కు సీఎంకు ఏం సంబంధం ఉంటుంది అని కేసీఆర్ ప్రశ్నించారు. "ఇంటెలిజెన్స్ వర్గాలు రోజూ ఫోన్ ట్యాపింగ్ చేసి, ఆ వివరాలు సీఎంకు చెబుతుంటాయి. సీఎం, మంత్రులకు ట్యాపింగ్‌తో సంబంధం లేదు. టెలిగ్రామ్ యాక్ట్ తరపున హోంమంత్రి అనుమతి తీసుకున్నాకే ట్యాపింగ్ చేస్తుంటారు" అని అన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ మోదీ సృష్టించిందేనని.. ఒక్క ఆధారం లేకున్నా, కేజ్రీవాల్‌ను, తన కుమార్తెను అరెస్ట్ చేశారని, ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బీజేపీ నేత బీఎల్ సంతోష్‌ను అరెస్ట్ చేయడానికి ప్రయత్నించినందువల్లే కక్షగట్టి కేసు పెట్టారని ఆరోపించారు. ఈ కేసులో కవిత కడిగిన ముత్యంలా బయటికి వస్తుందన్నారు. "జైళ్లు మాకు కొత్తేం కావు... ఏం ఫరక్ పడదు" అని అన్నారు. హైదరాబాద్‌ను రెండో రాజధాని చేస్తే స్వాగతిస్తామనే ఖర్గే వ్యాఖ్యలపై స్పందిస్తూ.. హైదరాబాద్ తెలంగాణ ప్రజల ఆస్తి అని, రెండో రాజధాని కానివ్వబోమని పేర్కొన్నారు. కాగా.. రాజ్యసభలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పక్షనేతగా సురేష్‌రెడ్డిని నియమించనున్నట్లు కేసీఆర్ చెప్పారు. కాగా, బెయిల్‌పై విడుదలైన బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి మన్నె క్రిశాంక్ శనివారం కేసీఆర్‌ను కలిశారు.

రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి 144 సెక్షన్

నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు.. ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

- ఇప్పటివరకు 350 కోట్ల నగదు సీజ్
- అన్నిమాధ్యమాల్లో ప్రచారంపై నిషేధం
- 13న సెలవు ఇవ్వని సంస్థలపై చర్య
- విలేకరులతో సీఈవో వికాస్ రాజ్
- బందోబస్తుకు 73వేల మంది : డీజీపీ


నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈవీఎంలు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

హైదరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రచార పర్వం ముగిసిన నేపథ్యంలో ఎన్నికలు జరిగేవరకు రాష్ట్రవ్యాప్తంగా సీఆర్పీసీ 144 సెక్షన్‌ను విధిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) వికాస్‌రాజ్ వెల్లడించారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచే ఈ సెక్షన్ అమల్లోకి వచ్చినట్లు తెలిపారు. నలుగురికంటే ఎక్కువ మంది కలిసి తిరగకూడదని ఆయన స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాలు, ఇతర సాధనాల ద్వారా ఎన్నికల ప్రచారం చేసేవారిపై, నిబంధనలను ఉల్లంఘించేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వార్తాపత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలనుకునే అభ్యర్థులు ముందుగా తమ అనుమతి తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలతోపాటు.. కంటోన్మెంట్ ఉప ఎన్నికకు సర్వం సిద్ధం చేసినట్లు వివరించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పలు విషయాలను వెల్లడించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు సుమారు 70వేల మంది పోలీసులతో భద్రత ఏర్పాట్లు చేపట్టామన్నారు. పోలింగ్ రోజున కొన్ని సంస్థలు తమ ఉద్యోగులు, కార్మికులకు సెలవులు ఇవ్వడం లేదనే సమాచారం తమ దృష్టికి వచ్చిందని, అలాంటి సంస్థలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కల్యాణ మండపాలు, కమ్యూనిటీ భవనాలు, వసతిగృహాలు, హోటళ్లలో నివసిస్తున్న వారు ఓటుహక్కును వినియోగించుకునేందుకు వెంటనే స్వస్థలాలకు వెళ్లిపోవాలని కోరారు.

ఏజెన్సీల్లో 328 పోలింగ్ కేంద్రాలు

ఏజెన్సీ ప్రాంతాల్లో 328 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వికాస్ రాజ్ తెలిపారు. వాటిల్లో మూడు కేంద్రాల పరిధిలో అతి తక్కువ– 10, 12, 14, ఓటర్లు ఉన్నట్లు వివరించారు. 25 కంటే తక్కువ మంది ఓటర్లున్న కేంద్రాలు 11 ఉండగా.. మరో 23 కేంద్రాల్లో 50 కంటే తక్కువ ఓటర్లు, 54 కేంద్రాల్లో 100లోపు ఓటర్లున్నట్లు పేర్కొన్నారు. సుమారు 3 లక్షల మంది సిబ్బంది పోలింగ్ విధుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి ఎన్నికల సిబ్బందికి సామగ్రిని అందజేసి, సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలిస్తామన్నారు. ఈవీఎంలు, ఎన్నికల సామగ్రితో సిబ్బంది ఆదివారం రాత్రికి పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారని వివరించారు. సోమవారం ఉదయం 5.30 గంటల నుంచి పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారని, 7 గంటల నుంచి పోలింగ్ మొదలవుతుందని తెలిపారు. ఎండల తీవ్రత నేపథ్యంలో సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఓటర్ల సౌకర్యార్థం పోలింగ్ కేంద్రాల వద్ద నీడ, తాగునీరు, ఫ్యాన్లు, కూలర్లను ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించిందన్నారు. హోం ఓటింగ్, సర్వీసు ఓటర్లకు సంబంధించి సుమారు 2 లక్షల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు.


వికాస్‌రాజ్

ప్రతి 2 గంటలకు అప్‌డేట్స్

పోలింగ్ రోజున ప్రతి 2 గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని వెల్లడిస్తామన్నారు. పోలైన ఓట్లకు సంబంధించిన వివరాలను 14వ తేదీన చెబుతామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం తలెత్తకుండా క్షేత్ర స్థాయి పరిశీలకులు, పోలీసులు, వెబ్‌కాస్టింగ్ ద్వారా.. మూడంచెల్లో పర్యవేక్షణ ఉంటుందన్నారు. రాష్ట్రంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల సంఖ్య 9,900గా ఉన్నట్లు వివరించారు.

రూ.320 కోట్ల సొత్తు సీజ్

ఎన్నికలకు సంబంధించి ఇప్పటి వరకు 320 కోట్ల సొత్తు సీజ్ అయినట్లు వికాస్ రాజ్ వెల్లడించారు. డ్రగ్స్, లిక్కర్, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు సిద్ధం చేసిన నజరానాలు ఇందులో ఉన్నాయన్నారు. తమకు అందిన ఫిర్యాదులకు సంబంధించి 8,600 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని, డ్రగ్స్‌కు సంబంధించి 293 కేసులు, బల్క్‌మెసేజ్‌లకు సంబంధించి 732 కేసులు నమోదయినట్లు వివరించారు. సీ-విజిల్ యాప్, కాల్‌సెంటర్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు విచారణ చేయిస్తున్నామన్నారు. రాజకీయపరమైన 93 ఫిర్యాదులపై విచారణ జరుగుతోందన్నారు.

పోలింగ్ బూత్ ఏదో తెలియడం లేదా..?

ఓటర్లు ఓటువేసేందుకు ఏ పోలింగ్ బూత్‌కు వెళ్లాలో పరిధిలో ఉందో సులువుగా తెలుసుకోవచ్చని సీఈవో తెలిపారు. ఈసీఐ-స్పేస్-ఓటర్ ఐడీ నంబర్ టైప్‌చేసి, 1950కి మెసేజ్ పంపితే.. వివరాలు వస్తాయన్నారు. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా కూడా పోలింగ్ కేంద్రం వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు.

73 వేల మంది పోలీసులు: డీజీపీ

ఎన్నికల భద్రతకు 73,414 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డీజీపీ రవిగుప్తా వెల్లడించారు. వీరిలో తెలంగాణ సివిల్ పోలీసులతోపాటు.. టీఎస్ఎస్పీ సిబ్బంది, 164 కంపెనీల కేంద్ర బలగాలు, తమిళనాడు ఎస్ఏఆర్ పోలీసులు, ఇతర రాష్ట్రాలకు చెందిన 7 వేల మంది హోంగార్డులు, 2088 మంది ఇతర శాఖల సిబ్బంది ఉన్నట్లు వివరించారు. శాంతిభద్రతలను నిరంతరం పర్యవేక్షించేందుకు డీజీపీ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో 34,526 మందిని బైండోవర్ చేశామని ఓ ప్రకటనలో తెలిపారు. మరోవైపు ఓటింగ్ శాతం పెరగడానికి పోలీసు శాఖ కూడా కృషిచేస్తోంది. సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తోంది. దీనికి సంబంధించి డీజీపీ ప్రత్యేకంగా ఎక్స్‌లో పోస్ట్ చేయగా.. ఏసీబీ చీఫ్ సీవీ ఆనంద్ ఆంగ్లంలోని అక్షరాలు-- ఏ నుంచి జడ్‌తో ఓటుహక్కు ప్రాముఖ్యతను వివరించారు. రాచకొండ పోలీసులు ప్రలోభాలకు లొంగొద్దంటూ ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

షర్మిలను ఆశీర్వదించండి

ఎంపీగా గెలిపించండి

- కడప ప్రజలకు విజయలక్ష్మి పిలుపు
- ప్రచార పర్వం చివరి ఘడియల్లో అమెరికా నుంచి వీడియో సందేశం
- వైసీపీకి ఎదురుదెబ్బే: రాజకీయ వర్గాలు



అమరావతి/కడప, మే 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల ప్రచార ఘట్టం ముగియడానికి కొద్ది సమయం ముందు శనివారం సాయంత్రం అనూహ్యంగా సీఎం జగన్ మాతృమూర్తి వైఎస్ విజయలక్ష్మి తెరమీదికి వచ్చారు. తన బిడ్డ, ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలను పార్లమెంటు ఎన్నికల్లో గెలిపించాలని ఆమె కడప ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం అమెరికాలో ఉన్న విజయలక్ష్మి వీడియో సందేశం విడుదల చేశారు. "రాజశేఖర్‌రెడ్డిని అభిమానించే వారికి, కడప లోక్‌సభ ప్రజలందరికీ విన్నపం. రాజశేఖర్‌రెడ్డిని ఏ విధంగా అభిమానించారో, అక్కున చేర్చుకున్నారో, ఆయన్ను నిలబెట్టుకున్నారో.. అదేవిధంగా షర్మిలమ్మ మీ ముందు నిలబడింది. ఆయన కూడా ప్రజా సేవలో ఊపిరి ఉన్నంత వరకు ఉన్నారు. ప్రజాసేవకే అంకితమయ్యారు, మీకు సేవచేస్తూనే ఆయన చనిపోయారు. ఆయన ముద్దు బిడ్డ షర్మిలమ్మ పార్లమెంటుకు పోటీ చేస్తోంది. షర్మిలను ఆశీర్వదించి పార్లమెంటుకు పంపండి. ఆయనలాగే మీకు సేవ చేసే అవకాశం ఇవ్వాలని కోరుతున్నా" అని విజయలక్ష్మి కోరారు.

జగన్‌కు ఎదురు దెబ్బ!

వైఎస్ షర్మిలను గెలిపించాలంటూ కడప ప్రజలకు వైఎస్ విజయలక్ష్మి ఇచ్చిన పిలుపు సీఎం జగన్‌కు ఎదురుదెబ్బేనని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. పోలింగ్‌కు కొన్ని గంటల ముందు విజయలక్ష్మి చేసిన ప్రకటన జగన్‌కి భారీ షాక్ ఇస్తుందని అంటున్నారు. ఇప్పటిదాకా.. జగన్‌కు వ్యతిరేకంగా ఇద్దరు చెల్లెళ్లు షర్మిల, సునీతలు విస్తృతంగా ప్రచారం చేశారు. మరోవైపు ఇప్పటి వరకు ఎన్నికల ప్రచారంలోకానీ.. వైసీపీ విషయంలోకానీ జోక్యం చేసుకోని విజయలక్ష్మి.. కుమార్తె షర్మిల విషయంలో చివరి నిముషంలో స్పందించడం, ఆమెను గెలిపించాలని పిలుపునివ్వడం కడప రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

రూ.7 కోట్ల నగదు సీజ్

- డబ్బు తరలిస్తున్న వ్యాన్ బోల్తా
- ఆ సొమ్ము మండపేట వైసీపీ నేతదిగా ప్రచారం

నల్లజర్ల/మండపేట, మే 11: తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లి ఎర్రకాల్వ బ్రిడ్జిపై శనివారం ఉదయం జరిగిన వ్యాన్ బోల్తాపడిన ఘటనలో.. అందులో రవాణా చేస్తున్న రూ.7 కోట్ల నగదు బయటపడింది. ఆ సొమ్మును నల్లజర్ల పోలీసులు, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సీజ్ చేసి ఇన్‌కంట్యాక్స్ అధికారులకు అప్పగించారు. కొవ్వూరు డీఎస్పీ రామారావు కథనం ప్రకారం.. హైదరాబాద్ నాచారంలోని న్యూకాంటినెంటల్ కెమికల్ ఎర్త్ సంస్థ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మండపేట బైపాస్ రోడ్‌లో ఉన్న మాధవి ఎడిబుల్ బ్రాస్ ఆయిల్ సంస్థకు సరుకు తరలిస్తున్నట్టు ఇన్‌వాయిస్‌లు కలిగి ఉన్న దోస్త్ వ్యాన్ బయలుదేరింది. తీరా అనంతపల్లి ఎర్రకాల్వ బ్రిడ్జి వద్ద వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో వ్యాన్ బోల్తా పడింది. దీంతో అందులో కెమికల్ పౌడర్ బస్తాల మధ్యలో దాచిన రూ.7 కోట్ల నగదు ఉన్న బాక్సులు బయటపడ్డాయి. స్థానిక రైతు ఒకరు ఆ బాక్సులను పరిశీలించి హైవే అధికారులకు చెప్పగా వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆ నగదును లెక్కించి, ఇన్‌కంట్యాక్స్ అధికారులకు అప్పగించారు. ఈ సొమ్ము మండపేటకు చెందిన ఓ వైసీపీ నేతదిగా భావిస్తున్నారు.



పవన్ గెలవాలి

- రామ్‌చరణ్, సురేఖ, అల్లు అరవింద్ ఆకాంక్ష

పిఠాపురం, మే 11: పవన్ కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గంలో విజయం సాధించాలని సినీనటుడు, మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్, ఆయన తల్లి సురేఖ, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఆకాంక్షించారు. శనివారం కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పవన్ కల్యాణ్ నివాసానికి వారంతా విచ్చేశారు. బాబాయ్‌తో రామ్‌చరణ్ భేటీ అయ్యారు. ఇద్దరూ బయటకు వచ్చి భారీగా తరలివచ్చిన అభిమానులు, జనసైనికులకు అభివాదం చేశారు. అనంతరం పవన్‌తో రామ్‌చరణ్, సురేఖ, అరవింద్ సమావేశమయ్యారు. పవన్ విజయం సాధించాలని ఆకాంక్షించారు. పవన్‌కు సురేఖ ఆశీస్సులు అందించారు. అంతకు ముందు పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని రామ్‌చరణ్, సురేఖ, అల్లు అరవింద్ దర్శించుకున్నారు. ఆ క్షేత్రంలోని విఘ్నేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, పురుహూతికాఅమ్మవార్లు, కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవిలకు పూజలు నిర్వహించారు. రామ్‌చరణ్‌ను చూసేందుకు భారీగా అభిమానులు, జనసైనికులు, ప్రజలు తరలిరావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రంగా మారాయి. అభిమానులను నియంత్రించలేక వ్యక్తిగత భద్రతా సిబ్బంది చేతులెత్తేశారు. దీంతో దర్శనం చేసుకునేందుకు రామ్‌చరణ్ తదితరులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. అభిమానులకు రామచరణ్ అభివాదం చేశారు. అల్లు అరవింద్, సురేఖ శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానాన్ని దర్శించుకుని పూజలు చేశారు.

మీ భూమి.. మీ హక్కు!

ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో యజమానులకు ఉరితాడే: చంద్రబాబు

- ఒరిజినల్ డాక్యుమెంట్లు జగన్ వద్దే
- మనకేమో జిరాక్స్ ప్రతులిస్తారట
- నడిపించే నాయకుడు కావాలా..?
- నరరూప రాక్షసుడు కావాలా?
- ప్రజలే తేల్చుకోవాలి: టీడీపీ అధినేత



నంద్యాల/చిత్తూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): 'సీఎం జగన్ మీ భూమి మీకు ఇచ్చానంటున్నాడు. అలాగైతే మీ పాసు బుక్కుల మీద తన ఫొటో ఎందుకు వేయించుకున్నట్లు? ప్రజలంతా ఒకటి గుర్తు పెట్టుకోవాలి. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తీసుకొచ్చాక మీ భూమి మీది కాదంటాడు. ఈ యాక్టుతో భూ యజమానులందరికీ ఉరే' అని టీడీపీ అధినేత చంద్రబాబు హెచ్చరించారు. ఈ ఎన్నికలు సంక్షేమానికి, సంక్షోభానికి నడుమ యుద్ధమన్నారు. టీడీపీది ఉద్యోగాలు కల్పించే పాలన అయితే.. వైసీపీది గంజాయి, డ్రగ్స్ పాలన అని.. జగన్ విధ్వంస పాలనకు చరమ గీతం పాడి.. అభివృద్ధి పాలన కోసం టీడీపీకి ఓటేయాలని పిలుపిచ్చారు. ప్రజాగళం యాత్రతో రాష్ట్రమంతటా బహిరంగ సభల్లో పాల్గొన్న ఆయన.. శనివారం చిత్తూరు సభలో తన ఎన్నికల ప్రచారాన్ని ముగించారు. భూ హక్కు చట్టంతో మన భూములకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు జగన్ తన దగ్గర పెట్టుకుని.. మనకు జెరాక్స్ ప్రతులిస్తారని.. అవి చూపితే బ్యాంకులో డబ్బులివ్వరని.. చెల్లుబాటు కావని చంద్రబాబు అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ ఆఫీసర్‌దే పూర్తి నిర్ణయాధికారమని చెప్పారు. 'ప్రజల భూములు ప్రజలకే దక్కాలి. అది వారి హక్కు. పాస్‌పుస్తకాల మీద రాజముద్ర ఉండాల్సిన చోట.. జగన్ తన బొమ్మ ఎందుకు వేయించుకుంటున్నారు? ప్రజలు తన బానిసలని అనుకుంటున్నారా? మళ్లీ ఆయనకు ఓటేస్తే మీ భూమి మీది కాదు. జగన్ మీ మెడకు ఉరి వేశాడు. మీరు ఫ్యానుకు ఉరి వేయండి. వైసీపీని చిత్తు చిత్తుగా ఓడించండి. జగన్‌ను భూ స్థాపితం చేయండి' అని పిలుపిచ్చారు. తాను అధికారంలోకి వచ్చాక జగన్ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ రెండో సంతకం చేస్తానని.. జగన్ ఫొటో ఉన్న పాసు పుస్తకాలను కూడా రద్దు చేసి ప్రభుత్వ రాజముద్ర ఉన్న కొత్త పుస్తకాలు ఇస్తానని పునరుద్ఘాటించారు. నడిపించే నాయకుడు కావాలో, నరరూప రాక్షసుడు కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు.

సీబీఐ చార్జిషీటులో..

వైఎస్‌ను చేర్చింది మేం కాదు..!

- ఆయన పాదయాత్రే నా జోడో యాత్రకు స్ఫూర్తి: రాహుల్‌గాంధీ
- నా తండ్రితో వైఎస్ బంధం రాజకీయం కాదు
- వారు అన్నదమ్ముల్లా కలిసి ఉండేవారు
- బీజేపీ సిద్ధాంతానికి రాజశేఖర్‌రెడ్డి వ్యతిరేకం
- జగన్ మాత్రం ఒక్క మాటా అనడం లేదు
- ఎందుకంటే ఆయనపై అవినీతి కేసులున్నాయి
- షర్మిల నా చెల్లి.. గెలిపిస్తామని మాటివ్వండి
- కడప ప్రజలకు కాంగ్రెస్ అగ్ర నేత అభ్యర్థన


కడప సభలో పార్టీ శ్రేణులకు రాహుల్, షర్మిల అభివాదం

కడప, మే 11 (ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డిపై అక్రమాస్తుల కేసు చార్జిషీటులో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరును కాంగ్రెస్ పార్టీ చేర్చలేదని ఆ పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. ఇది వారి (జగన్ అండ్ కో) స్వలాభం కోసం చేసిన పనిగా తేల్చిచెప్పారు. 'రాజశేఖర్‌రెడ్డి మా మనిషి. ఆయనకెప్పుడూ నష్టం రానివ్వం. రాజశేఖర్‌రెడ్డి సిద్ధాంతం కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం. మేం బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటాం' అని తేల్చిచెప్పారు. ఆయన చేసిన పాదయాత్ర తన 'భారత్ జోడో' యాత్రకు స్ఫూర్తిగా పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారమిక్కడ పుత్తా ఎస్టేట్స్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో రాహుల్ పాల్గొన్నారు. ఉదయం 11.30 గంటలకు ప్రత్యేక విమానంలో కడప చేరుకున్న ఆయన అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఇడుపులపాయ వచ్చారు. పీసీసీ అధ్యక్షురాలు, కడప లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్ షర్మిలారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావు, షర్మిల భర్త బ్రదర్ అనిల్‌కుమార్‌తో కలిసి రాహుల్ వైఎస్ సమాధి వద్ద నివాళులు అర్పించారు. అనంతరం కడప సభావేదిక వద్దకు చేరుకున్నారు. తన తండ్రి రాజీవ్‌గాంధీ, రాజశేఖర్‌రెడ్డి సోదరులని తెలిపారు. వాళ్లిద్దరిదీ కేవలం రాజకీయ సంబంధమే కాదని.. అన్నదమ్ముళ్లా కలిసి మెలసి ఉండేవాళ్లని చెప్పారు. ఈ సంబంధం చాలా సంవత్సరాల పురాతన స్నేహమన్నారు. 'రాజశేఖర్‌రెడ్డి కేవలం ఈ రాష్ట్రానికి మాత్రమే దారి చూపించలేదు, దేశానికి మొత్తం ఆయన మార్గదర్శకులయ్యారు. ఆయన చేసిన పాదయాత్రే నా భారత్ జోడో యాత్రకు స్ఫూర్తి. నా తండ్రి పోయాక రాజశేఖర్‌రెడ్డే నా మెంటార్‌గా వ్యవహరించారు. భారతదేశం మొత్తం పాదయాత్ర చేయాలని నాతో అన్నారు. నేను జోడో యాత్ర ద్వారా విద్వేష వీధుల్లో ప్రేమ దుకాణాలు తెరిచానంటే.. అది ఆయన ప్రోద్బలం, ప్రోత్సాహం వల్లే' అని వివరించారు. 'పేదల కోసం, సామాజిక న్యాయం కోసం రాజశేఖర్‌రెడ్డి రాజకీయాలు చేశారని.. ఇప్పుడది రాష్ట్రంలో లేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను విభజించినప్పుడు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటి వరకు నెరవేరలేదని ఆక్షేపించారు.

మేం రాగానే హామీల అమలు..

రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వం బీజేపీ ముందు తలవంచుకుని నిలబడిందని.. వాళ్లు అవినీతి కూపంలో మునిగిపోయారని రాహుల్ ఆరోపించారు. '2024లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే పదేళ్ల ప్రత్యేకహోదా లభిస్తుంది, పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసి తీరతాం, కడప స్టీల్‌ప్లాంట్ నిర్మిస్తాం. ప్రతి వాగ్దానం నెరవేర్చుతాం." అని స్పష్టం చేశారు.

జగన్ ఊసరవెల్లి

ఏది పడితే అది మాట్లాడుతున్నాడు: షర్మిల

అన్నా.. అక్కా.. మీరు ఏవైపు? కడప ప్రజలు న్యాయంవైపు నిలబడతారా.. నేరం వైపు నిలబడతారా..? న్యాయాన్ని గెలిపిస్తారా.. నేరాన్ని గెలిపిస్తారా అని దేశం కాదు.. ప్రపంచం మొత్తం చూస్తోందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి అన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి ఊసరవెల్లిలా ఏది పడితే అది మాట్లాడుతున్నారని విరుచుకుపడ్డారు. సొంత చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగి ఐదేళ్లు పూర్తయినా ఇంత వరకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ నిందితులను కాపాడుతున్నారని.. రాజకీయాల కోసం ఇంత దిగజారడం అవసరమా అని నిలదీశారు. అది భరించలేకనే న్యాయం కోసం ఎదురునిలబడ్డానని తెలిపారు. కడప సభలో ఆమె మాట్లాడుతూ.. పదేపదే రాజశేఖర్‌రెడ్డి పేరును సీబీఐ చార్జిషీట్‌లో కాంగ్రెస్ పార్టీ చేర్చిందని జగన్ చెబుతున్నారని.. అయితే అలా చేసింది కాంగ్రెస్ కాదని.. జగనేనని స్పష్టం చేశారు.



అబ్ కీ బార్?

నవనీత్ కౌర్‌పై మరో కేసు



సైదాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎంపీ నవనీత్ కౌర్‌పై కేసు నమోదైంది. గతంలో మజ్లిస్ నేత అక్బరుద్దీన్ 15 నిమిషాలు పోలీసులు తప్పుకొంటే.. తామేంటో చూపిస్తామని చేసిన వ్యాఖ్యలకు బదులిస్తూ.. మాకు 15 సెకన్లు చాలు అని ఈ నెల 8న చంపాపేట్ లక్ష్మీగార్డెన్స్‌లో జరిగిన బీజేవైఎం యువ సమ్మేళనంలో నవనీత్ కౌర్ మాట్లాడిన విషయం తెలిసిందే..! ఆ వ్యాఖ్యలపై యాకుత్‌పుర నియోజకవర్గ ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి రాకేశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సైదాబాద్ పోలీసులు తెలిపారు.

మతచిచ్చుకు మోదీ యత్నం

» రాజ్యాంగ మార్పు, రిజర్వేషన్ల రద్దు బీజేపీ అజెండా

» పదేళ్ల బీఆర్ఎస్, బీజేపీ పాలనలో ఇచ్చిందేమీ లేదు :రేవంత్



సంగారెడ్డి/పటాన్‌చెరు/తాండూరు/హైదరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): హిందూ ముస్లింల మధ్య గొడవలు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఏనాడు చూడని విధంగా.. రక్తపాతం, కత్తులతో నరుక్కోవడం, మతాలు, కులాలుగా సమాజం విడిపోయేలా వైషమ్యాలను రెచ్చగొట్టేలా దుష్టశక్తులు పనిచేస్తున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో శాంతి భద్రతలు దెబ్బ తింటే పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తాయా? అని సీఎం ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు పటాన్‌చెరు, తాండూరు, కామారెడ్డిలలో నిర్వహించిన కాంగ్రెస్ బహిరంగసభలు, రోడ్‌షోలలో రేవంత్ ప్రసంగించారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని సమూలంగా మార్చి, రిజర్వేషన్లను రద్దు చేయడమే ఎజెండాగా బీజేపీ పని చేస్తోందని.. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలు ఈ కుట్రను అర్థం చేసుకోవాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన అన్ని లోక్‌సభ ఎన్నికలు అభివృద్ధి, ప్రజాసంక్షేమం ఎజెండాగా జరిగాయని సీఎం గుర్తు చేశారు. ఈ ఎన్నికలు మాత్రం.. భారతీయులకు హక్కులనిచ్చి, పేదల తలరాతలు మార్చిన అంబేడ్కర్ రాజ్యాంగానికి ఎసరు పెట్టేలా స్వయంగా ప్రధాని మోదీ రంగంలోకి దిగిన నేపథ్యంలో జరుగుతున్నాయని చెప్పారు. పదేళ్లలో రాష్ట్రానికి బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు చేసింది శూన్యమన్నారు. పటాన్‌చెరు వరకు మెట్రోరైలు, ఐటీఐఆర్, మూసీ రివర్ డెవలప్‌మెంట్‌కు నిధులు, బయ్యారం ఉక్కు కర్మాగారం, వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ ఇలా ఏదీ ఇవ్వకుండా గాడిద గుడ్డు మాత్రం ఇచ్చిన మోదీ తెలంగాణ ప్రజలను ఓట్లు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. ఔటర్ రింగ్‌రోడ్డు, విమానాశ్రయం, ఐఐటీ, చివరకు పటాన్‌చెరు బస్‌టెర్మినల్‌ను సైతం కాంగ్రెస్ ప్రభుత్వాలే నిర్మించాయన్నారు. స్వర్గీయ ఇందిరమ్మ చలవతోనే మెదక్ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిందని.. బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఓడీఎఫ్, ఇక్రిశాట్ సంస్థలు కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పాటు చేసినవేనని వివరించారు. ఈ ఎన్నికలు ప్రధాని మోదీ పరివార్, కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ పరివార్ మధ్య జరుగుతున్న యుద్ధమని సీఎం అభివర్ణించారు. మోదీ పరివార్ అంటే ఈడీ, ఐటీ, సీబీఐ, ఢిల్లీ పోలీసులు, అదానీ, అంబానీలని.. రాహుల్‌గాంధీ పరివార్ అంటే దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఇందిరమ్మ, రాజీవ్‌గాంధీ, తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ, ప్రియాంక గాంధీ, కోట్లాది కాంగ్రెస్ కార్యకర్తలన్నారు. ఈ ఎన్నికల్లో మోదీ పరివార్‌ను ఓడించి రాహుల్ పరివార్‌ను గెలిపించాలని సీఎం కోరారు.

ప్రజలను ముంచిన దుర్మార్గుడు వెంకట్రామారెడ్డి

బీఆర్ఎస్ పార్టీ మెదక్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి.. ప్రాజెక్టుల పేరుతో అనేక గ్రామాల ప్రజలను ముంచిన దుర్మార్గుడని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. నిర్వాసితులను పోలీసులతో తన్నించి నేడు ఓట్లు అడుగుతున్నాడని విమర్శించారు. 'వేల కోట్లు అడ్డంగా సంపాదించి ఇప్పటికే ఎమ్మెల్సీ పదవిలో ఉన్న వెంకట్రామారెడ్డికి ఎంపీ పదవి అవసరమా? కేసీఆర్ పెగ్గు మత్తులో ఉండగా ఎంపీ టికెట్ ఇచ్చాడేమో? కేసీఆర్, హరీశ్‌రావులకు వందల కోట్లు ఇచ్చి మెదక్ ఎంపీ టికెట్ తెచ్చుకున్న వెంకట్రామారెడ్డి ప్రయత్నాలు ప్రజలు సాగనివ్వరు. అతడి సొమ్ము ప్రజలదే. పంచితే తీసుకుని, తూరుపు తిరగమని నడ్డిమీద వాతలు పెట్టి పంపండి' అని ప్రజలకు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

తెలంగాణ గడ్డ నుంచే..

మోదీ ఓటమికి నాంది

(మొదటి పేజీ తరువాయి)

ఏ ఒక్క వర్గానికి ఎలాంటి మేలు జరగలేదని, కార్పొరేట్ కంపెనీల అధిపతులకు మాత్రమే లబ్ధి జరిగిందని.. పేదలు ఆర్థికంగా మరింత నష్టపోయారని తెలిపారు. 'దేశ పేద ప్రజల సంపదను ప్రధాని మోదీ తన మిత్రులకు దోచిపెట్టాడు. రైల్వేలు, పోర్టులు, విమాన, విద్యుత్ కాంట్రాక్టులను అదానీ, అంబానీలకు కట్టబెట్టారు. పెట్టుబడిదారులకు రూ.16 లక్షల కోట్ల రుణ మాఫీ చేశారు. కానీ పేదలకు, రైతులకు ఒక్కరూపాయి కూడా మాఫీ చేయలేదు. దేశంలోని ప్రజల మధ్య కులాలు, మతాల పేరుతో విద్వేషాలు సృష్టించడమే లక్ష్యంగా పనిచేశారు తప్ప దేశాభివృద్ధికి పాటు పడలేదు' అని ఆరోపించారు. శనివారం కాంగ్రెస్ పార్టీ తాండూరులో నిర్వహించిన జనజాతరసభలో, కామారెడ్డిలో జరిపిన రోడ్‌షో, కార్నర్ మీటింగ్‌లలో ప్రియాంక ప్రసంగించారు. తెలంగాణ ప్రజలు శ్రమించి.. ఈ ప్రాంతాన్ని సుభిక్షంగా మార్చుకున్నారని, బీజేపీ పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రియాంక సూచించారు. ఈ ప్రాంతం చైతన్యవంతమైన ప్రాంతమని, విద్వేషం వద్దు.. స్వచ్ఛమైన పాలన కావాలంటూ ఇక్కడి నుంచి సందేశం ఇవ్వాలని కోరారు. అవినీతిని అంతమొందిస్తాం, నల్లధనం వెనక్కు తీసుకొస్తామన్న నినాదాలతో అధికారంలోకి వచ్చిన బీజేపీ.. ఎలక్టోరల్ బాండ్స్ వంటి అవినీతి స్కీములను తీసుకువచ్చిందని ప్రియాంక నిప్పులు చెరిగారు. దేశంలో ఎక్కడ మహిళలపై అత్యాచారాలు జరిగినా.. బాధితుల పక్షాన బీజేపీ నిలబడలేదని, అత్యాచారం చేసిన వారి పక్షానే ఆ పార్టీ నిలబడిందన్నారు. 'దేశంలో అత్యున్నతమైన పదవి ప్రధాని పదవి. ఆ పదవిలో పదేళ్లుగా ఉన్న వ్యక్తి.. ప్రజలకు ఏం చేశారో చెప్పే ధైర్యం చేయట్లేదు. వేదికలపైన కన్నీళ్లు పెట్టుకుంటారు. పచ్చి అబద్ధాలు చెబుతుంటారు. ఈ ప్రధాని దుర్బలుడు.. అబద్ధాల కోరు. ప్రజల కోసం ఏమీ చేయలేదు కాబట్టే అబద్ధాలు మాట్లాడుతుంటారు' అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోపైనా పొద్దస్తమానం అబద్ధాలే చెబుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ పాంచ్ న్యాయ్ పత్రం.. ప్రజల సంపదను వారి జేబుల్లోకి చేర్చే పత్రం అని వివరించారు. పదేళ్ల పాలనలో ప్రజల కోసం మోదీ చేసిందేమీ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రారంభించిన స్కీమ్‌లనే పేర్లు మార్చుకుని మోదీ ఫొటోలు పెట్టుకుని కొత్త పథకాలుగా ప్రజల ముందు పెట్టారని ప్రియాంక ఆరోపించారు. ఈ పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం ధనవంతుల కోసమే పని చేసిందని, పేదలు, రైతులు, కార్మికులు, మహిళలు, మధ్యతరగతి జీవుల కోసం ఏమీ చేయలేదన్నారు. పంటకు నష్టం వాటిల్లి.. కూతురు పెళ్లి, పిల్లల చదువులు వంటి ఖర్చులతో రైతులపై రుణభారం పెరుగుతున్నా.. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయమూ అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద నోట్ల రద్దుతో చిన్నవ్యాపారుల నడ్డి విరిగి పోయిందన్నారు. రైతులు, కార్మికులు, స్టార్టప్ కంపెనీలు, ఐటీ రంగం ఆదాయాలు తగ్గిపోయాయని చెప్పారు.



తాండూరులో జరిగిన సభలో రేవంత్‌తో మాట్లాడుతున్న ప్రియాంక

మన దగ్గర ఆర్, ఆర్ఆర్ ఉన్నారు

'ఆర్ఆర్ఆర్ సినిమా చూశారా? ఈ సినిమా చూసి ప్రపంచమంతా ఊగిపోయింది. మోదీ, ఆయన మంత్రులు.. నాటు నాటు డ్యాన్స్ వేసుకోనివ్వండి! మనదగ్గర ఆర్, ఆర్ఆర్ ఉన్నారని చెప్పండి. రాహుల్ ఆర్ అయితే.. రేవంత్‌రెడ్డి ఆర్ఆర్! వారిద్దరూ దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి నడిపిస్తారు' అని ప్రియాంక చెప్పారు.

సామాన్యులపై ఏఏ ట్యాక్స్

గడిచిన మూడేళ్లుగా సామాన్య ప్రజలకు వెచ్చించే బడ్జెట్ రూ.9 లక్షల కోట్ల మేర తగ్గిందని, అదే సమయంలో ధనవంతులపై పన్నుల భారం పెరగకపోగా.. వారికి ఉన్న రుణాలను మోదీ ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. దేశంలోని సామాన్య ప్రజలు ఏఏ ట్యాక్స్‌ను భరిస్తున్నారని, ఏఏ అంటే అంబానీ, అదానీ అని.. వారిపై వేయాల్సిన ట్యాక్స్‌లను సామాన్య ప్రజలు భరిస్తున్నారని ప్రియాంక చెప్పారు. మీడియా కూడా వారి చేతిలోనే ఉండడంతో వాస్తవాలు ప్రజలకు తెలిసే అవకాశం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఈ పదేళ్లలో ఏం చేశామన్నది చెప్పి ఓటు అడిగే ధైర్యం ప్రధాని మోదీ, ఆయన మంత్రి వర్గానికి లేకుండా పోయిందన్నారు.

ఇది ప్రజల రాజ్యాంగం

'భారత రాజ్యాంగం.. ప్రజలు రాసుకున్న రాజ్యాంగం. మార్చడానికి ఇది మోదీ రాసిన రాజ్యాంగం కాదు. మన ముందు తరాల సంఘర్షణ నుంచి వచ్చిన రాజ్యాంగం ఇది. దాని ద్వారానే దేశ ప్రజలకు అధికారం, రక్షణ లభించాయి. అలాంటి రాజ్యాంగాన్ని మార్చడం కోసం దేశం అంతా తిరుగుతూ 400 సీట్లు ఇవ్వాలని మోదీ అడుగుతున్నారు. ఈ రాజ్యాంగం దేశంలోని 140 కోట్ల మంది ప్రజలకు చెందినది. ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధపడతారు కానీ.. రాజ్యాంగాన్ని మారుస్తామంటే భారతీయులు అంగీకరించరు' అని ప్రియాంకా గాంధీ స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ పేదల సంక్షేమం కోసం ఎన్నో గ్యారెంటీ హామీలను ప్రకటించిందని, మహిళల ఖాతాలో ఏటా లక్ష రూపాయలు వేస్తామని, రైతుల పంట ఉత్పత్తులకు మద్దతు ధర ఇస్తామని, జీఎస్టీని తొలగిస్తామని ప్రియాంక చెప్పారు.

తెలంగాణ ప్రజలతో నాది సోదరి బంధం

ఇందిరమ్మను తెలంగాణ ప్రజలు ఎంతగానో ప్రేమించారని, ప్రతిగా ఆమె కూడా తెలంగాణ ప్రజలకు ప్రేమను పంచారని ప్రియాంక గుర్తు చేశారు. తన తల్లి సోనియాగాంధీని ఈ రాష్ట్ర ప్రజలు తల్లిగా భావిస్తూ సోనియమ్మ అని పిలుస్తున్నారని, తాను కూడా రాష్ట్ర ప్రజలకు సోదరిని అని చెప్పారు. గతేడాది రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రచారానికి వచ్చిన తాము.. అధికారంలోకి వస్తే ఏం చేస్తామో హామీలు ఇచ్చామని, నేడు వాటిని అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలు వినడం, వారి కోసం పని చేయడమన్నది కాంగ్రెస్ పార్టీ విధానమన్నారు. దేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రజలు కనీస సౌకర్యాలు లేక అల్లాడుతున్నారని, తెలంగాణలో గ్యాస్ సిలిండర్ రూ.500కు వస్తుంటే.. యూపీలో రూ.1200 వెచ్చించాల్సి వస్తుందన్నారు.

మతం పేరుతో చిచ్చు

బీజేపీ వాళ్లు మతం గురించి మాట్లాడుతూ ప్రజల మధ్య విభజన తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారని ప్రియాంక దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ.. హిందూ మత విరోధి అని, మొత్తం సంపద తీసుకుని వేరే వాళ్లకు ఇస్తుందనీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింసలే కాంగ్రెస్ పార్టీ విధానమని, మతం పేరుతో అన్నదమ్ముల మధ్య విభేదాలు సృష్టించడం, మనుషులను విడదీసి అధికారం దక్కించుకోవాలనుకోవడం, రాజ్యాంగాన్నే మార్చాలనుకోవడం పాపపు పనులని ప్రియాంక పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు చైతన్యం కలిగిన వారని, వారు సత్యాన్ని చాటి చెప్పాలని కోరారు. కేంద్ర ప్రభుత్వాన్ని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని అడిగారు. వచ్చిందా? ఐఐఎం, కేంద్రీయ విద్యాలయం, నవోదయ స్కూళ్లు, మెడికల్ కాలేజీలను అడిగారు. వాటిలో ఒక్కటైనా వచ్చిందా?' అంటూ ప్రజలను ప్రశ్నించారు.

ప్రజల కోసం రాహుల్ కష్టపడుతున్నారు

దేశ ప్రజల కోసం రాహుల్‌గాంధీ ఎంతో కష్టపడుతున్నారని, ఆయన స్వచ్ఛమైన నాయకుడని, రాహుల్ లాంటి నేత దేశానికి అవసరమన్నారు. ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ 4 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేశారని ప్రియాంక గుర్తు చేశారు. దేశాన్ని రక్షించుకునేందుకు, రాహుల్‌ను ప్రధానిగా చేసేందుకు కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి భారీ స్పందన వచ్చింది. ప్రధాని మోదీ, బీజేపీ ప్రభుత్వంపై ప్రియాంక నిప్పులు చెరుగుతున్నప్పుడు కూడా ప్రజలు బాగా స్పందించారు. దీంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

'ఇండియా'ను గెలిపించండి: సీఎం

హైదరాబాద్, మే 11(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకునేందుకు ఇండియా కూటమిని గెలిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన రిజర్వేషన్లతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలవారు విద్య, ఉద్యోగాల్లో అభ్యున్నతి సాధించి దేశ ప్రగతిలో భాగస్వాములయ్యారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాంటి రాజ్యాంగాన్ని మార్చేసి దేశాన్ని రిజర్వేషన్ రహిత దేశంగా మార్చేందుకు బీజేపీ కుట్ర చేస్తుందని ఆరోపించారు. ప్రపంచ దేశాలతో పోటీ పడాల్సిన భారత్ బీజేపీ కుట్రలకు బలి అవుతోందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు.

హోరాహోరీకి తెర!

హైలైట్‌గా నిలిచిన 'గాడిద గుడ్డు'.. ఆకర్షించిన 'ఆర్ఆర్ ట్యాక్సు'

ప్రచారం ముగిసింది! ప్రసంగాలకు తెరపడింది! ప్రలోభాలు సరేసరి! ఓటరు ప్రసన్నంపై అంచనాలు మిగిలాయి! దాదాపు మూడు వారాలపాటు హోరాహోరీ ప్రచారం ముగిసింది. ఎన్నికల యుద్ధంలో అన్ని పార్టీలూ అలుపెరుగని పోరాట పటిమను ప్రదర్శించాయి. తమ తమ వాదాలను, వాదనలను ప్రజల ముందు ఉంచాయి. కాంగ్రెస్ ప్రచారంలో 'గాడిద గుడ్డు' హైలైట్‌గా నిలిస్తే.. బీజేపీ 'ఆర్ఆర్ ట్యాక్స్'ను తెరపైకి తెచ్చింది! వెరసి, ఎవరి అంచనాలు వారికి ఉన్నా.. అన్ని పార్టీలూ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అధికార కాంగ్రెస్ తొలి నుంచీ 'టార్గెట్ 14' అంటూ ముందుకు వెళుతుంటే.. ఈసారి డబుల్ డిజిట్‌కు చేరాలని బీజేపీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. చావో రేవో పోరాటంలో 14 సీట్లలో గెలిపిస్తే.. 'నేనూ ప్రధాని రేసులో ఉంటా' అంటూ కేసీఆర్ ఆకాశానికి నిచ్చెన వేసేశారు.

అంతా తానైన రేవంత్ రెడ్డి!

అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే పార్లమెంటు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రచారానికి కర్త, కర్మ, క్రియగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలిచారు. రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ పార్టీ తరఫున సుడి గాలి ప్రచారం చేశారు. ఏప్రిల్ 6న తుక్కుగూడలో జన జాతర సభతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ఆయన.. మొత్తం 27 రోజుల్లో 57 బహిరంగ సభల్లో పాల్గొన్నారు. రోడ్ షోలు, కార్నర్ మీటింగులు సరేసరి. కొన్ని రోజుల్లో నాలుగైదు రోడ్ షోలు, కార్నర్ మీటింగుల్లోనూ పాల్గొన్నారు. మరికొన్ని సందర్భాల్లో ఒకే రోజు రాష్ట్రంతోపాటు కేరళ, కర్ణాటకల్లోనూ ప్రచారం చేశారు. రాయ్‌బరేలీలో రాహుల్ గాంధీ నామినేషన్ల కార్యక్రమానికి వెళ్లి వచ్చి.. రాష్ట్రంలో అనేక సభల్లో పాల్గొన్నారు. ఇక, కాంగ్రెస్ తరఫున పార్టీ అగ్ర నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ప్రచారంలో పాల్గొన్నారు. తుక్కుగూడలో రాహుల్ గాంధీ పాల్గొన్న సభతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కాంగ్రెస్.. చివరి రోజు శనివారం ప్రియాంక గాంధీ ప్రచారంతో ముగించడం విశేషం. ఇక, కాంగ్రెస్ ప్రచారం మొత్తం ఆరు గ్యారెంటీలతోపాటు రుణ మాఫీ చుట్టూ తిరిగింది. కేవలం వంద రోజుల పాలనలోనే హామీ ఇచ్చిన విధంగా మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం; రూ.500కే సిలిండర్; 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్తు; రాజీవ్ ఆరోగ్యశ్రీ చికిత్స సీలింగ్ పెంపు; ఇందిరమ్మ ఇళ్ల పథకాలను అమలు చేశామని కాంగ్రెస్ నేతలు వివరించారు. ఆగస్టు 15వ తేదీలోగా ఎట్టి పరిస్థితుల్లోనూ రుణ మాఫీ పథకాన్ని అమలు చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి పదే పదే ప్రకటించారు. ఎక్కడికి వెళితే అక్కడి దేవుడిపై ఒట్టు వేసి మరీ తేల్చి చెప్పారు. దీనిపై హరీశ్, రేవంత్ మధ్య మాటల యుద్ధం కూడా నడిచింది. పంద్రాగస్టులోగా రుణ మాఫీ చేస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు సవాల్ విసిరితే.. రాజీనామా పత్రంతో సిద్ధంగా ఉండాలని రేవంత్ స్పష్టం చేశారు. అలాగే, కాంగ్రెస్ ప్రచారంలో 'గాడిద గుడ్డు' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణకు బీజేపీ ఏమీ ఇవ్వలేదనే విషయాన్ని సింబాలిక్‌గా చెబుతూ కాంగ్రెస్ పార్టీ వినూత్న ప్రచారానికి తెరలేపింది. చివర్లో, సీఎం రేవంత్ కాంగ్రెస్ ప్రచారాన్ని కొత్త మలుపు తిప్పారు. ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెంచుతామంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించడంతో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందని, రాజ్యాంగాన్ని తిరగ రాస్తుందని, అందుకే తమకు 400 సీట్లు ఇవ్వాలని అడుగుతోందని విమర్శలు ఎక్కుపెట్టారు. నిజానికి, ఆ తర్వాత దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రచారంలో ఇవే కీలకాంశాలుగానూ మారాయి. ఇదే అంశంలో డీప్ ఫేక్ వీడియో తెరపైకి రావడం.. దీనిపై సీఎం రేవంత్‌పై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేయడం కొసమెరుపు.



- హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

కేసీఆర్ బస్సు యాత్ర



కాలుకు శస్త్ర చికిత్స జరిగినా బీఆర్ఎస్ ప్రచారంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కీలకంగా మారారు. ఎండల నేపథ్యంలో బహిరంగ సభలకు స్వస్తి పలికి వ్యూహాత్మకంగా బస్సు యాత్ర, కార్నర్ మీటింగులకే ఓటేశారు. బీఆర్ఎస్ ప్రచారం తొలి రోజుల్లో కరెంటు కోతలను, మంచినీటి కొరతను ప్రధాన ప్రచారాస్త్రంగా తీసుకున్నా.. వెన్వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం వాటికి చెక్ చెప్పింది. కరెంటు కోతలు విధించిన అధికారులను సస్పెండ్ చేయడంతోపాటు మంచినీటి కొరత నివారణకు ప్రణాళిక ప్రకటించింది. అనంతరం, బీఆర్ఎస్ ప్రచారమంతా కృష్ణా, గోదావరి జలాల వాటాపై నడిపింది. కృష్ణా జలాల రక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించింది. ఇక, బీఆర్ఎస్ తరఫున కేసీఆర్‌తోపాటు కేటీఆర్, హరీశ్ విస్తృతంగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ 'గాడిద గుడ్డు' ప్రచారం, బీజేపీ 'ఆర్ఆర్ ట్యాక్స్' తరహాలో నిర్దిష్ట ప్రచార శైలి కరువైంది. కాకపోతే, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా తమ పార్టీలోకి వచ్చేస్తారని కాంగ్రెస్ నేతలు కోమటిరెడ్డి తదితరులు వ్యాఖ్యానించడంతో ఎన్నికలైన తర్వాత రేవంత్ సహా కాంగ్రెస్ నేతలు బీజేపీలోకి వెళ్లిపోతారంటూ పదే పదే వ్యాఖ్యానించారు. దీనితోపాటు ఆరు హామీల అమల్లో కాంగ్రెస్ విఫలమైందంటూ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ వల్లే కరువు వచ్చిందని, ఇది సహజంగా వచ్చిన కరువు కాదని ప్రచారం లేవనెత్తినా.. చివర్లో వర్షాలు కురవడంతో దానికి తెరపడింది.

తగ్గిన ఎన్నికల ఖర్చు

అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే.. పార్లమెంట్ ఎన్నికల్లో ఖర్చు తక్కువగానే కనిపిస్తోంది. మండే ఎండల్లో ప్రచారం చేయాల్సి రావడంతో దాదాపు అన్ని పార్టీలూ ఉదయం, సాయంత్రమే ప్రచారానికి పరిమితమయ్యాయి. ఇంకా చెప్పాలంటే, రోడ్ షోలు, కార్నర్ మీటింగులకే పెద్దపీట వేశాయి. మరోవైపు, కొన్ని చోట్ల ఎమ్మెల్యేలూ ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొనలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో వీధి వీధికి కనబడ్డ ప్రచార తీరు ఎంపీ ఎన్నికలొచ్చేసరికి గ్రామానికొకటి కూడా కనిపించలేదు. దీంతో, ఖర్చు నామమాత్రంగానే చేయాల్సి వచ్చింది. అలాగే, ఓట్లను గంపగుత్తగా కొనేసే పరిస్థితి నేతల్లో కనిపించలేదు. ఓటర్లకు కూడా డబ్బు పంపిణీ అసెంబ్లీ ఎన్నికల స్థాయిలో ఇవ్వడం లేదు.

ఒపినియన్ పోల్స్..

ప్రధాన రాజకీయ పార్టీలన్నీ మెజారిటీ సీట్లను తామే గెలవబోతున్నామంటూ ప్రజల్ని ప్రలోభపెట్టినా.. జనం నాడి మాత్రం వేరేలా ఉంది. గత ఏడాది డిసెంబరు నుంచి ఏప్రిల్ మధ్య కాలంలో తెలంగాణలో పలు జాతీయ చానళ్లు, సర్వే సంస్థలు ఓటరు నాడిని పసిగట్టే ప్రయత్నం చేశాయి. మెజారిటీ సర్వేలు కాంగ్రెస్ 8-10 ఎంపీ సీట్లు గెలుచుకుంటుందని ఇవ్వగా.. బీజేపీ 3-6 మధ్య, బీఆర్ఎస్‌కు 1-2, ఎంఐఎం పార్టీకి ఒక సీటు వస్తుందని అంచనా వేశాయి. ఏబీపీ న్యూస్- సీ ఓటర్ సర్వే కాంగ్రెస్‌కు 10 సీట్లివ్వగా.. ఎన్డీయేకు ఐదు, బీఆర్ఎస్, ఎంఐఎంకు చెరొకటి ఇచ్చింది. ఇండియా టు డే సర్వేలో కూడా కాంగ్రెస్‌కు పది ఇవ్వగా, ఎన్డీఏకు 3, బీఆర్ఎస్‌కు 3, ఇతరులకు ఒకటి ఇచ్చింది. అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకుని ఓటరు సోమవారం తీర్పు ఇవ్వనున్నాడు. ఓటరు తీర్పు ఏమిటన్నది జూన్ 4న వెలువడనుంది!!

మోదీ చుట్టూ..



తెలంగాణలో ఈసారి డబుల్ డిజిట్‌పై కన్నేసిన బీజేపీ ప్రచారం అంతా ప్రధాని మోదీ చుట్టూ తిరిగింది. మోదీ గ్యారెంటీని చూసి ఓటు వేయాలంటూ అభ్యర్థించింది. ఒకటి రెండు సందర్భాల్లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి మినహా బీజేపీ రాష్ట్ర నేతలంతా తమ తమ నియోజకవర్గాలకే పరిమితం కాగా.. మోదీ, అమిత్ షా రాష్ట్రాన్ని పలు సందర్భాల్లో చుట్టేశారు. వివిధ నియోజకవర్గాల్లో పలువురు కేంద్ర మంత్రులు భాగస్వాములయ్యారు. నిజానికి, కాంగ్రెస్ 'గాడిద గుడ్డు ప్రచారానికి బీజేపీ పలు సందర్భాల్లో వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. తెలంగాణకు గత పదేళ్లలో తాము ఎన్ని నిధులు, ఎన్ని పథకాలు ఇచ్చామో చెప్పుకోవాల్సి వచ్చింది. అలాగే, బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందని, రాజ్యాంగాన్ని మారుస్తుందనే కాంగ్రెస్ ప్రచారానికీ వివరణలు ఇచ్చుకోవాల్సి వచ్చింది. తాము మళ్లీ అధికారంలోకి వస్తే ముస్లిములకు మత ప్రాతిపదికన రిజర్వేషన్లను రద్దు చేస్తామని, ఆ కోటాను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పంచుతామని మోదీ, అమిత్ షా పదే పదే స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని బీజేపీ మారుస్తుందనే ప్రచారానికీ ఆ పార్టీ నేతలు దీటుగా జవాబిచ్చారు. ఇప్పటి వరకూ కాంగ్రెస్ పార్టీ మరీ ముఖ్యంగా నెహ్రూ, ఇందిర, రాజీవ్ హయాంలోనే రాజ్యాంగాన్ని ఎక్కువసార్లు మార్చారని గుర్తు చేశారు. ఇక, బీజేపీ ప్రచారంలో 'ఆర్ఆర్ ట్యాక్స్' హైలైట్‌గా నిలిచింది. రాష్ట్రంలో రేవంత్ జాతీయ స్థాయిలోని రాహుల్ గాంధీకి కప్పం కడుతున్నారంటూ మోదీ, షా విమర్శలు గుప్పించారు. 'ఆర్ఆర్ఆర్ సినిమా వెయ్యి కోట్లు కలెక్షన్లు వసూలు చేసిందని, 'ఆర్ఆర్ ట్యాక్సు దానిని మించిపోయిందంటూ వెయ్యి కోట్లకుపైగానే కప్పం కట్టారంటూ ఆరోపించారు. అయితే, దీనిపై కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగానే మౌనం పాటించింది. తాము అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కుల గణన జరిపిస్తామన్న కాంగ్రెస్ హామీతోపాటు పలువురు నాయకుల ప్రకటనలను బీజేపీ నేతలు తమకు అనుకూలంగా మలచుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హిందువుల ఇళ్లు సహా సంపదను లాగేసుకుంటారని, మహిళల మెడలో మంగళ సూత్రాలను కూడా ఉంచరని, వాటిని లాక్కుని ముస్లిములకు పంచుతారంటూ ప్రధాని మోదీ ప్రచారాన్ని కొత్త ఎత్తులకు తీసుకెళ్లారు. నిజానికి, అయోధ్య ఆలయం చుట్టూ ఈసారి ప్రచారాన్ని పరిమితం చేయాలని తొలుత బీజేపీ భావించినా.. చివరికి వచ్చేసరికి రాజ్యాంగం, రిజర్వేషన్ల రద్దు, ముస్లిముల చుట్టూ తిప్పాల్సి వచ్చింది. వెరసి, పదేళ్లలో తెలంగాణకు తాము ఏమి చేశామన్న దానికంటే భావోద్వేగాలతో కూడిన ఈ అంశాల చుట్టూ బీజేపీ తన ప్రచారాన్ని చేయాల్సి వచ్చింది.



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కేసీఆర్‌వి అవే అబద్ధాలు.. గాలిమాటలు

» సొంతడబ్బా కొట్టుకునే ఆయన అసెంబ్లీకి రారేం?: మంత్రి పొంగులేటి

» ఖమ్మంలో మంత్రి తుమ్మలతో కలిసి రోడ్ షో

» బీజేపీని బండకేసి కొట్టాలి: భట్టి విక్రమార్క

హైదరాబాద్/ఖమ్మం/గద్వాల/పెబ్బేరు, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేత కేసీఆర్ తాను ఒక్కడినే సర్వజ్ఞుడిని అన్నట్లుగా విర్రవీగుతారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. స్వర్గం అంటే ఏమిటో చూపలేక తానున్న చోటే స్వర్గం ఉందని, తనను నమ్మిన వాళ్లకు వెర్రి భ్రమలు కల్పిస్తారన్నారు. విద్యుత్తు, సాగు, తాగునీరు తదితర అంశాలపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను పొంగులేటి ఒక ప్రకటనలో ఖండించారు. కేసీఆర్ పచ్చి అబద్ధాలను నిజాలుగా చెప్పే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తాను ఇంద్రుడిని, చంద్రుడిని... తనకు తప్ప ఎవరికీ పాలన చేతకాదని డబ్బా కొట్టుకుంటున్న కేసీఆర్ అసెంబ్లీకి రావడం ఎందుకు రావడం లేదని, గాలి మాటలు ఎందుకు చెబుతున్నారని ప్రశ్నించారు. 'దొరికిపోతారనే భయం ఉంటే తప్పు చేశారనే కదా... అందుకే అసెంబ్లీకి రావడం లేదని భావించాలా' అని పొంగులేటి ప్రశ్నించారు. కేసీఆర్ ఎక్కడో కూర్చొని సొల్లు పురాణం చెబుతున్నారని, అసెంబ్లీకి వస్తే నిజాలు ఏమిటో, అబద్ధాలు ఏమిటో తేలిపోతుందన్నారు. ఆయన కోసం అసెంబ్లీని ఎప్పుడైనా సమావేశపరచడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా కేసీఆర్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 12 సీట్లు వస్తాయని పగటి కలలు కంటున్నారని, బీఆర్ఎస్ పార్టీ పెట్టి ప్రధాని అవుతానని కూడా అప్పట్లో పగటి కలలు కన్నారని పేర్కొన్నారు. పార్టీకి ఒకటి రెండుచోట్ల రెండో స్థానం వస్తే చాలా ఎక్కువని మంత్రి విమర్శించారు. కాగా, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి.. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి శనివారం ఖమ్మంలో బైక్ ర్యాలీ, రోడ్‌షో నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 15 లోక్‌సభ సీట్లు గెలిచి ఎదురులేని శక్తిగా నిలబడుతుందని మంత్రులు తెలిపారు. గుంటకాడి నక్కల్లా ఎదురుచూస్తున్న బీఆర్ఎస్, బీజేపీలకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను తొలగిస్తుందని, దేశ సంపదను బహుళజాతి కంపెనీలకు ధారాదత్తం చేస్తుందని, అలాంటి పార్టీని బండకేసి కొట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం గద్వాల జిల్లా అయిజ, గద్వాల, వనపర్తి జిల్లా పెబ్బేరులో కార్నర్ మీటింగ్‌ల్లో నాగర్‌కర్నూలు ఎంపీ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా మంత్రి జూపల్లితో కలిసి మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళలను లక్షాధికారులను చేస్తుందన్నారు.



టీ బ్రేక్..

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేటలో చాయ్ తాగుతున్న బండి సంజయ్, రాణీరుద్రమ

ఎవరిదో.. ఆధిపత్యం

ఖమ్మంలో హవా కొనసాగించాలని కాంగ్రెస్ ప్రయత్నం

అధిక మెజారిటీ సాధించడమే లక్ష్యమని ప్రకటన.. సిటింగ్ స్థానాన్ని నిలబెట్టుకుంటామని బీఆర్ఎస్ ధీమా

గత ఎన్నికల ఫలితమే పునరావృతమవుతుందన్న నమ్మకం.. ఈసారి తామూ సత్తా చూపిస్తామన్న బీజేపీ

పురుషులు	7,87,160
మహిళలు	8,43,749
ఇతరులు	130
మొత్తం ఓటర్లు	16,31,039

రాజకీయ చైతన్యానికి మారుపేరు. వామపక్ష ఉద్యమాలకు నెలవు. ఎన్నికల్లో విలక్షణ తీర్పులు ఇచ్చే నియోజకవర్గం. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల దృష్టినీ ఆకర్షించే ఖమ్మం పార్లమెంటు స్థానంలో ఈసారి ఆసక్తికర పోరు సాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రదర్శించిన ఆధిపత్యాన్ని కొనసాగించాలని కాంగ్రెస్, వరుసగా రెండోసారి గెలిచి సత్తా చాటాలని బీఆర్ఎస్ భావిస్తుండగా, ఈసారి తాము కూడా రేసులో ఉన్నామని బీజేపీ అంటోంది.

ఖమ్మం, మే 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భౌగోళికంగా తెలుగు రాష్ట్రాలకు గుమ్మంలా భావించే ఖమ్మం నియోజకవర్గం మొదటి నుంచీ కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలుస్తోంది. గతంలో జలగం వెంగళరావు, నాదెండ్ల భాస్కరరావు వంటి ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు ఇక్కడినుంచి ప్రాతినిధ్యం వహించారు. 17 సార్లు లోక్‌సభ ఎన్నికలు జరిగితే ఇక్కడ 11 సార్లు కాంగ్రెస్ పార్టీయే విజయం సాధించింది. ఇక్కడి నుంచి ఎంపీలుగా గెలిచిన వారిలో జలగం వెంగళరావు, పీవీ రంగయ్యనాయుడు, రేణుకాచౌదరి కేంద్రమంత్రులు కూడా అయ్యారు. అయితే స్థానికుల కంటే స్థానికేతర అభ్యర్థులే ఇక్కడ ఎక్కువసార్లు విజయం సాధించారు. కాంగ్రెస్ తరఫున వరుసగా మూడుసార్లు గెలుపొందిన తేళ్ల లక్ష్మీకాంతమ్మ మహబూబ్‌నగర్ జిల్లా అలంపూర్‌కు చెందినవారు కాగా, రెండుసార్లు గెలిచిన రేణుకాచౌదరి, [illegible] పీవీ రంగయ్యనాయుడు, నాదెండ్ల [illegible] పుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్ నుంచి రెండుసార్లు గెలిచిన పీవీ విఠల్‌రావు కూడా స్థానికేతరులే. ఇలా వలస నేతలను ఎక్కువసార్లు ఆదరించిన ఖమ్మం పార్లమెంటు స్థానంలో ఈసారి మూడు ప్రధాన పార్టీల నుంచి జిల్లాకు చెందిన నేతలే బరిలో నిలిచారు.



కాంగ్రెస్‌లో గెలుపు ధీమా..

ఖమ్మం ఎంపీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక వ్యవహారం ఉత్కంఠగా సాగింది. ఈ నియోజకవర్గంలో కమ్మ సామాజికవర్గానికి బలమైన ఓటుబ్యాంకు ఉండడంతో వారికే టికెట్ వస్తుందని ఎక్కువ మంది భావించారు. మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావుతోపాటు ఖమ్మం జిల్లాకు చెందిన రాయల నాగేశ్వరరావు తదితరుల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. కానీ, వీరెవరికీ కాకుండా.. కాంగ్రెస్ సీనియర్ నేత రామసహాయం సురేందర్‌రెడ్డి కుమారుడు రఘురాంరెడ్డికి టికెట్ దక్కింది. జిల్లా నుంచి ఉపముఖ్యమంత్రిగా భట్టి విక్రమార్క, మంత్రులుగా తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉండడంతోపాటు ఇటీవలే రేణుకాచౌదరి రాజ్యసభకు ఎన్నికయ్యారు. దీంతో కాంగ్రెస్‌కు బలమైన నాయకత్వంతోపాటు బలమైన ఓటు బ్యాంకు కూడా ఉంది. రఘురాంరెడ్డి గెలుపు కోసం నాయకులంతా కలిసికట్టుగా పని చేస్తున్నారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రచారం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా కొత్తగూడెంలో 'జనజాతర' పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించి, ఖమ్మం అభ్యర్థిని 3లక్షల మెజారిటీతో గెలిపించాలని జిల్లా మంత్రులకు సూచించారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆరింట్లో కాంగ్రెస్ గెలవగా, కొత్తగూడెంలో కాంగ్రెస్ మిత్రపక్షం సీపీఐ విజయం సాధించింది. కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి ఇండియా కూటమిలో భాగంగా సీపీఎం, సీపీఐ మద్దతు ప్రకటించి ప్రచారంలోనూ పాల్గొంటున్నాయి. రఘురాంరెడ్డి కూడా తాను స్థానికుడినని, కూసుమంచి మండలం చేగొమ్మకు చెందిన కాంగ్రెస్ కుటుంబానికి చెందినవాడినని గుర్తు చేస్తున్నారు.

నామా గెలుపుపై బీఆర్ఎస్ ఆశలు..

బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రస్తుతం ఆ పార్టీ లోక్‌సభాపక్ష నేతగా ఉన్న నామా నాగేశ్వరరావు బరిలో నిలిచారు. ఖమ్మం నుంచి ఇప్పటివరకు నాలుగుసార్లు పోటీచేసి రెండుసార్లు గెలిచిన నామా.. మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో బీఆర్ఎస్ ఒక్క అసెంబ్లీ స్థానంలోనే గెలిచినా.. ఆ తరువాత 2019లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీగా నామా నాగేశ్వరరావు గెలుపొందారు. దీంతో ఈసారి కూడా తమ పార్టీ ఎమ్మెల్యేలు లేకపోయినా ఎంపీ స్థానాన్ని తామే గెలుచుకుంటామని బీఆర్ఎస్ నేతలు విశ్వాసంతో ఉన్నారు. అయితే 2018లో ఆరు అసెంబ్లీ స్థానాల్లో బీఆర్ఎస్ ఓడినా.. అప్పుడు రాష్ట్రంలో అధికారాన్ని నిలబెట్టుకోవడం, కాంగ్రెస్, టీడీపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు గులాబీ కండువా కప్పుకోవడం నామాకు కలిసివచ్చింది. కానీ, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో ఘోర పరాజయంతోపాటు రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో ఈ నియోజకవర్గంలో ఆ పార్టీకి అన్నీ కష్టాలే కనిపిస్తున్నాయి.

నేను సైతం అంటున్న బీజేపీ..

ఖమ్మంలో గతంలో నామమాత్రంగా ఉన్న బీజేపీ.. ఈసారి ప్రధాన పార్టీలకు పోటీగా ప్రచారం నిర్వహిస్తోంది. ప్రధాని మోదీ కరిష్మాతో సత్తా చూపిస్తామని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో తాను మాత్రమే స్థానికుడినని, మిగిలిన ఇద్దరూ నాన్‌లోకల్ అని బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు అంటున్నారు. ఆయన తరఫున ఇప్పటికే కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ప్రచారం నిర్వహించారు. బీజేపీని గెలిపిస్తే నియోజకవర్గ సమస్యలను పరిష్కరించడంతోపాటు భద్రాద్రి-అయోధ్యకు ఆధ్యాత్మిక కారిడార్ ఏర్పాటు చేస్తామని ఆ పార్టీ నేతలు హామీ ఇస్తున్నారు.


2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఏ సెగ్మెంట్ ఎవరికి!?

కాంగ్రెస్	ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట
సీపీఐ	కొత్తగూడెం

2019 లోక్‌సభ ఎన్నికల్లో..

బీఆర్ఎస్	కాంగ్రెస్	బీజేపీ
5,67,459	3,99,397	20,488
నామా నాగేశ్వర్‌రావు	రేణుకా చౌదరి	దేవకి వాసు దేవరావు

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికెన్ని ఓట్లు!?



పార్టీ	ఓట్లు
కాంగ్రెస్	7,33,293
బీఆర్ఎస్	4,67,639
బీజేపీ	16,976



రంజిత్ జైలుకు.. నేను పార్లమెంట్‌కు

స్కామ్‌లు, మోసాలు చేసిన కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ఓటమి పాలై జైలుకు పోతారు. నేను పార్లమెంట్‌కు పోతాను. కాంగ్రెస్ ఇప్పటికే ఓటమి భయంతో చేతులెత్తేసింది 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం పక్కా. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారాన్ని చేపడుతుంది.

- చేవెళ్ల బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డి

దమ్ముంటే నిరూపించండి.. నా ఆస్తి మొత్తం రాసిస్తా

నాపై చేసిన ఆరోపణలను దమ్ముంటే నిరూపించాలి. అలా చేస్తే నా యావదాస్తిని రాసిస్తా. బీజేపీ మ్యానిఫెస్టోలో బీసీల కోసం ఒక్క అంశాన్నీ చేర్చలేదు. ఆ పార్టీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు ఎత్తివేస్తుంది. జీడీపీ పెరగాలంటే సామాన్యుడి ఆదాయం పెరగాలి. అంబానీ, అదానీల ఆదాయం కాదు. విశ్వేశ్వర్‌రెడ్డి 13వ తేదీ తర్వాత అమెరికాకు వెళ్లిపోవడం ఖాయం.

- చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి



కాంగ్రెస్‌కు మజ్లిస్ మద్దతు

హైదరాబాద్ మినహా మిగతా స్థానాల్లో హస్తానికి ఓటేయాలని ఒవైసీ సంకేతం

హైదరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మినహా మిగతా లోక్‌సభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకే ఓటేయాలని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఆ పార్టీ శ్రేణులకు స్పష్టమైన సంకేతమిచ్చారు. ఈ విషయాన్ని పార్టీ నాయకులు కూడా ధ్రువీకరించారు. ప్రచారం గడువు ముగియడానికి ముందు.. శనివారం మధ్యాహ్నం ఖిల్వత్ మైదానం సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఒవైసీ ప్రసంగించారు. 'హైదరాబాద్‌లో పతంగ్ (మజ్లిస్ గుర్తు) ఎగరాలి. తెలంగాణలో బీజేపీ ఖతం కావాల'ని కార్యకర్తలకు సూచించారు. దీనికోసం హైదరాబాద్ వినహా రాష్ట్రంలోని ఇతర లోక్‌సభ స్థానాల్లో బీజేపీయేతర జాతీయ పార్టీకి ఓటేయాలని పిలుపునిచ్చారు. అంటే అక్కడ కాంగ్రెస్‌ను గెలిపించాలని స్పష్టంగా సూచించారు. పలు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల పేరు చెప్పకపోయినా అందరికీ అర్థమయ్యేట్టు వారి రూపురేఖలను సూచిస్తూ వారికే ఓటేయాలని సూచించారు. 'ఈ లోక్‌సభ ఎన్నికలు 'మామూ' (బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఉద్దేశించి) కోసం కాదు. మోదీని గద్దె దింపడానికి! మీకు అర్థం కాకపోతే మళ్లీ చెబుతున్నా.. సికింద్రాబాద్‌లో లావుగా ఉండే అభ్యర్థిని గెలిపించండి. నిజామాబాద్‌లో తెల్ల జుత్తు ఎక్కువగా ఉండే అభ్యర్థికి విజయం చేకూర్చండి. చేవెళ్లలో సన్నగా ఉండే అభ్యర్థిని గెలిపించండి' అని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు ముఖ్యంగా మహబూబ్‌నగర్, చేవెళ్ల, సికింద్రాబాద్, మల్కాజిగిరి, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్‌లో తాము తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయాలని కోరారు. హైదరాబాద్‌లో బోగస్ ఓట్లు ఉన్నాయని ప్రచారం చేసిన బీజేపీ.. ఒక్క బోగస్ ఓటును తేల్చలేకపోయిందన్నారు. చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ తన పేరుతో ఓట్లు దండుకుంటున్న బీజేపీ-మోదీపై రాముడు సైతం కోపంతో ఉన్నాడన్నారు.

ప్రచారం.. పైపైనే!

ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జుల నామమాత్రపు స్పందన

వెళ్లామా.. కనిపించామా.. వచ్చామా.. అన్నట్లుగానే!.. నేతల్లో కనిపించని అసెంబ్లీ ఎన్నికల నాటి పట్టుదల

ఎంపీ అభ్యర్థులు, అగ్రనేతలు వచ్చినపుడే హడావిడి.. ఉదయం, సాయంత్రాల్లో... అడపా దడపా ప్రచారం

బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నచోట్ల దాదాపు ఇంతే.. ఎంపీ అభ్యర్థులకు దాదాపుగా సహాయ నిరాకరణ



(ఆదిలాబాద్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రత్యేక ప్రతినిధి)

పార్లమెంటు ఎన్నికల్లో అభ్యర్థులకు ఎమ్మెల్యేల నుంచి సహకారం అందడంలేదా? తమ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఎంపీ అభ్యర్థికి మెజారిటీ వచ్చేలా దగ్గరుండి చూసుకోవాల్సిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు (అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు) అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారా? అంటే.. అవుననే అభిప్రాయాలే వ్యక్తమవుతున్నాయి. నాలుగు నెలల కిందట అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో వ్యవహరించిన తీరుకు, ప్రస్తుతం ఎంపీ ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొంటున్న తీరుకు పూర్తిగా వైరుధ్యం కనిపిస్తోంది. వెళ్లామా? కనిపించామా? వచ్చామా? అన్నట్లుగానే ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జుల వ్యవహార శైలి ఉంటోందని తెలుస్తోంది. ప్రత్యేకించి ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ నేతల్లో ఈ వైఖరి ఎక్కువగా కనిపిస్తోందంటున్నారు. తన అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఎంపీ అభ్యర్థికి అత్యధిక మెజారిటీ తెప్పించాలనే పట్టుదల చాలా మందిలో లోపించిందనే విమర్శలున్నాయి. కొందరైతే.. ఇది మన ఎన్నిక కాదు కదా? అనే భావనలో ఉండడం గమనార్హం. ముఖ్యంగా పలు చోట్ల ఎంపీ అభ్యర్థులకు.. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో సమన్వయం కొరవడిందని అంటున్నారు. పార్టీ ఆదేశాల మేరకు వారు ప్రచారంలో పాల్గొంటున్నప్పటికీ.. చాలామంది నామమాత్రంగానే వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. తాము అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు ప్రస్తుత ఎంపీ అభ్యర్థి ఎక్కడున్నారు? పార్టీలో ఉన్నారా? లేదా? తన తరఫున ప్రచారంలో పాల్గొన్నారా? లేదా? ఎన్నికల ఖర్చుల కోసం ఏమైనా ఆర్థికసాయం చేశారా? తన రాజకీయ ప్రత్యర్థులతో ఏమైనా చేతులు కలిపారా? అనే అంశాలను బేరీజు వేసుకొని మరీ స్పందిస్తున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ప్రతీకారానికి తగిన సమయం!

ఎంపీ అభ్యర్థులతో ముందునుంచీ పొసగని కొందరు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు ప్రతీకారం తీర్చుకోవడానికి ఇదే అదనుగా భావిస్తున్నారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాలు గట్టిగా ఉన్నప్పటికీ.. ఎంతవరకు పనిచేయాలో అంతవరకే చేస్తున్నారు. ఉదాహరణకు.. ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో నాలుగు చోట్ల బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వీరు శక్తియుక్తులన్నీ పోగు చేసి విజయం సాధించారు. కానీ, పార్లమెంటు ఎన్నికలకు వచ్చేసరికి సీన్ మారిపోయింది. బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి వలసవచ్చిన గోడెం నగేశ్‌కు ఎంపీ టికెట్ ఇచ్చారు. అయితే ఆయనకు బీజేపీ ఎమ్మెల్యేల్లోనే రాజకీయ ప్రత్యర్థులు కూడా ఉన్నారు. ఈ పార్లమెంటు పరిధిలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 4.49 లక్షల ఓట్లు వచ్చాయి. కానీ, ఇప్పుడు బీజేపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జుల వ్యవహారశైలి చూస్తుంటే.. పాత ఓటుబ్యాంకు నిలబడుతుందా? లేదా? అనే సందేహాలు ఆ పార్టీ నేతల్లోనే వ్యక్తమవుతున్నాయి. సొంత పార్టీలోనే తమ ఎమ్మెల్యేలు, నేతల మధ్య అభిప్రాయ బేధాలు ఉన్నాయని ఓ సీనియర్ నేత స్వయంగా వ్యాఖ్యానించారు. అయినా గెలుస్తామనే ధీమా వ్యక్తంచేశారు. సిటింగ్ ఎంపీగా ఉన్న నేత.. సొంత పార్టీకి కాకుండా ఓ ప్రాంతీయ పార్టీ అభ్యర్థికి మద్దతిస్తున్నట్లు నియోజకవర్గంలో బహిరంగంగా చర్చించుకుంటున్నారు.



అభ్యర్థికి, ఎమ్మెల్యేలకు లేని సఖ్యత..

నిజామాబాద్ పార్లమెంటు పరిధిలో ఓ ప్రతిపక్ష పార్టీ పార్లమెంటు అభ్యర్థికి, ఎమ్మెల్యేలకు మధ్య ఏమాత్రం సఖ్యత లేదనే ప్రచారం జరుగుతోంది. ఇక్కడ బీజేపీకి ఇద్దరు, బీఆర్ఎస్‌కు ముగ్గురు ఎమ్మెల్యేలు ఉండగా.. వీరంతా మొక్కుబడిగా ప్రచారం చేస్తున్నారని అంటున్నారు. కాగా, జహీరాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థికి, అసెంబ్లీ సెగ్మెంటు ఇన్‌చార్జులకు ఏమాత్రం పొసగడంలేదని తెలుస్తోంది. ఎంపీ అభ్యర్థి.. తన బంధువులు, మిత్రులు, నిర్మాణ కంపెనీలో పనిచేసే ఉద్యోగులతోనే ఖర్చులు, వ్యవహారాలు, ఎన్నికల ప్రక్రియను నడిపిస్తున్నారని, తమను నమ్మడంలేదని నియోజకవర్గ ఇన్‌చార్జులు గుర్రుగా ఉన్నట్లు సమాచారం. పార్లమెంటు ఎన్నికల ఇన్‌చార్జిగా ఉన్న ఒక ఎమ్మెల్యే కూడా ఎంపీ అభ్యర్థి వైఖరి పట్ల అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థి ఆత్రం సుగుణకు, అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డికి తాజాగా డీసీసీ కార్యాలయంలో ఒక ఆసక్తికర చర్చ జరిగింది. ఆదిలాబాద్ టౌన్‌లో ఎన్నికల ప్రచారానికి వస్తానని సుగుణ ఫోన్ చేయగా.. తాను ఆదిలాబాద్‌లో లేనని, హైదరాబాద్‌లో ఉన్నానని శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. అయితే అటుగా ప్రచారానికి వెళ్లిన సుగుణ.. డీసీసీ కార్యాలయానికి వెళ్లేసరికి శ్రీనివాస్‌రెడ్డి ఎదురయ్యారు. "ఏందన్నా? ఆదిలాబాద్‌లో ఉండి కూడా హైదరాబాద్ వెళ్లినట్లు చెప్పావ్?" అని ఎంపీ అభ్యర్థి ప్రశ్నించిన సంఘటన కార్యకర్తల సమక్షంలోనే జరగడం గమనార్హం.

అన్ని చోట్లా అదే అయోమయం..!

మెదక్, మల్కాజ్‌గిరి, కరీంనగర్, వరంగల్, మహబూబాబాద్, నల్లగొండ, భువనగిరి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, సికింద్రాబాద్, చేవెళ్ల, పెద్దపల్లి, ఖమ్మం పార్లమెంటు స్థానాల్లో ఎవరు ఎవరికి మద్దతిస్తున్నారో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయని ఎంపీ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. పార్టీ అగ్రనేతలు, స్టార్ క్యాంపెయినర్లు వచ్చినపుడు మాత్రమే నామమాత్రంగా పాల్గొంటున్నారని, ఫోన్‌చేసి పిలిస్తే.. ఉదయం, సాయంత్రం పూట కాసేపు ప్రచారం పాల్గొని ఇంటికెళ్లిపోతున్నారని అంటున్నారు. అయితే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు అధికారం కోల్పోయామన్న నైరాశ్యంతోనే ఇలా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో అధికారమే లేదు.. ఎంపీ గెలిచినా ఒకటే, గెలవకపోయినా ఒకటే అనే నిరాశా నిస్పృహలతో ఉన్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్‌లో కాస్త బెటర్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఐదు నెలలే కావడం, మూడు నెలలు కాగానే ఎన్నికల కోడ్ రావడంతో అభివృద్ధి కార్యక్రమాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. కోడ్ ముగియగానే పనులు ప్రారంభం కానున్నాయి. మంత్రివర్గ విస్తరణ కూడా జరగాల్సి ఉంది. కొందరు ఎమ్మెల్యేలు మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చూపిస్తే... మంత్రివర్గంలో బెర్తు దొరుకుతుందనే ఆశతో పనిచేస్తున్నారు. మరికొందరు నామినేటెడ్ పోస్టులు ఆశిస్తున్నారు. నియోజకవర్గం, మండలం, గ్రామంలోని కార్యకర్తలను సమన్వయం చేసుకొని కొందరు నేతలు ఎంపీ ఎన్నికల ప్రచారంలో గట్టిగా పాల్గొంటున్నారు. ఒకటి, రెండు చోట్లు వినహా.. కాంగ్రెస్ క్యాడర్ పనితీరులో కాస్త మెరుగైన వాతావరణం కనిపిస్తోంది.

మైనారిటీలు కాంగ్రెస్ వైపే!



రాష్ట్రంలో సగానికి పైగా ఎంపీ స్థానాల్లో

- 10 శాతానికి పైనే ముస్లిం మైనారిటీల ఓట్లు
- దేశవ్యాప్తంగా 'ఇండియా' వైపే వారి చూపు
- బీజేపీని అడ్డుకునేందుకే కాంగ్రెస్‌కు మద్దతు
- హిందూ ఓటర్ల పోలరైజేషన్‌పై బీజేపీ గురి
- గతంలో బీఆర్ఎస్‌కు మైనారిటీల మద్దతు
- లోక్‌సభ ఎన్నికల్లో గులాబీ పార్టీకి దూరం

హైదరాబాద్, మే 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలోని మైనారిటీలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారా? గత పదేళ్లుగా బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచిన ముస్లింలు ఈసారి హస్తం పార్టీకి అండగా ఉండాలనుకుంటున్నారా? అంటే అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి రాకుండా నిలువరించడం కోసం వారు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని చెబుతున్నారు. అయితే ఈ పరిణామాన్ని బీజేపీ తనకు అనుకూలంగా మార్చుకునే అవకాశం ఉందని, హిందూ ఓటర్లను తమకు మద్దతుగా పోలరైజ్ చేయవచ్చని పేర్కొంటున్నారు. తెలంగాణలో ముస్లిం మైనారిటీల జనాభా 14 శాతం ఉంటుంది. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా చూస్తే.. సగానికిపైగా ఎంపీ స్థానాల పరిధిలో 10, అంతకంటే ఎక్కువ శాతం మైనారిటీ ఓటర్లు ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలోని వీరిలో అత్యధికులు బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచారు. ఆ పార్టీకి ఎంఐఎం బహిరంగంగా మద్దతు తెలపడం, కేసీఆర్ సర్కారు మైనారిటీల సంక్షేమం కోసం పలు ప్రజాకర్షక పథకాలను ప్రవేశపెట్టడం వంటి కారణాలతో ఎక్కువ మంది ముస్లింలు బీఆర్ఎస్‌కు జైకొట్టారు. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ రెండోసారి గెలవడంలో మైనారిటీల పాత్ర గణనీయంగా ఉందని ఆ పార్టీ వర్గాలే చెబుతుంటాయి.

జాతీయ రాజకీయాలతో..

జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా జరుగుతున్న సమీకరణలకు కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ.. కేంద్ర బిందువుగా మారడంతో తెలంగాణలోని మైనారిటీల ఆలోచనా విధానంలోనూ మార్పు రావడం ప్రారంభమైంది. ఈ సమీకరణ గడిచిన రెండేళ్ల నుంచీ జరుగుతున్న నేపథ్యంలో 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లిం మైనారిటీలు గణనీయమైన సంఖ్యలో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచారు. అయితే 2018 ఎన్నికల స్థాయిలో కాకపోయినా.. కొన్ని ప్రాంతాల్లో బీఆర్ఎస్‌కూ ముస్లిం ఓటర్లు మద్దతు పలికారు. కానీ, లోక్‌సభ ఎన్నికల నాటికి ఇండియా కూటమి ఏర్పడి.. దేశ వ్యాప్తంగా ముస్లిం మైనారిటీల ఓట్లు చీలకుండా పోలరైజేషన్ జరుగుతున్న నేపథ్యంలో.. రాష్ట్రంలోని ముస్లింలూ కాంగ్రెస్‌కు అనుకూలంగా మారారన్న చర్చ జరుగుతోంది. తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో సగానికి పైగా సీట్లలో 10 నుంచి 28 శాతం మేరకు ముస్లిం మైనారిటీల ఓట్లు ఉన్నట్లు ఓటరు జాబితా వివరాలు చెబుతున్నాయి. హైదరాబాద్ పార్లమెంటు స్థానంలోనైతే ఏకంగా 70 శాతం మంది ముస్లిం ఓటర్లే ఉంటారు. సికింద్రాబాద్, నిజామాబాద్, చేవెళ్ల, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, నల్లగొండ వంటి చోట్ల వీరి ఓట్లు 10 నుంచి 28 శాతం వరకు ఉన్నట్లు చెబుతుంటారు. కాగా, ఈ స్థానాల్లో నల్లగొండ మినహా ఇతర అన్ని చోట్లా బీజేపీ అభ్యర్థులే కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యర్థులుగా మారారు.

ఓట్లు పోలరైజ్ అవుతున్నాయని..

ఆయా నియోజకవర్గాల్లో ముస్లిం మైనార్టీల జనాభా కాంగ్రెస్ పార్టీకి పోలరైజ్ అవుతుండడంతో ప్రతిచర్యగా హిందూ ఓటర్లు తమ పార్టీ పట్ల ఆకర్షితులవుతున్నారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఒక రకంగా మైనారిటీల పోలరైజేషన్ అన్నది తమకు లాభం చేకూరుస్తోందని పేర్కొంటున్నాయి. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడం, స్థానిక అవసరాలు, ఇండియా కూటమి ప్రకటించిన పాంచ్ న్యాయ్, పచ్చీస్ గ్యారెంటీల పట్ల ఆకర్షితులైన పేద, మధ్యతరగతి ప్రజలు, మహిళలు, యువత, ఎస్సీ, ఎస్టీ, బీసీలు కాంగ్రెస్‌కే మద్దతుగా నిలుస్తారని హస్తం పార్టీ వర్గాలు అంటున్నాయి. దీనికి ముస్లిం ఓటు బ్యాంకూ తోడై రాష్ట్రంలో 14 సీట్లు గెలుచుకుంటామని అంచనా వేస్తున్నాయి.

బీఆర్ఎస్‌కు దెబ్బే..!

ముస్లిం ఓటుబ్యాంకు కాంగ్రెస్ వైపు మళ్లడం బీఆర్ఎస్‌కు నష్టం చేకూర్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచీ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల వరకూ బీఆర్ఎస్ గట్టి మద్దతుదారుగా నిలిచిన ఎంఐఎం కూడా ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి దగ్గరైంది. రేవంత్ ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగుతుందని, ప్రభుత్వానికి తమ సహకారం ఉంటుందని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రకటన కూడా చేశారు. హైదరాబాద్‌యేతర నియోజకవర్గాల్లో ఎంఐఎం సానుభూతిపరుల మద్దతు కోసం బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తే.. నిరాకరణే ఎదురవుతోందని అంటున్నారు. ఇది బీఆర్ఎస్‌కు మింగుడుపడని పరిణామమేనంటున్నారు. పలు మతసంస్థల పెద్దలు కూడా హైదరాబాద్ మినహా మిగిలిన నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతివ్వాలని సంకేతాలిస్తున్నట్లు తెలుస్తోంది.

మా ప్రభుత్వాన్ని టచ్ చేయాలనుకుంటే పీకలు ఎగురుతాయ్ జాగ్రత్త!

▸▸ కేసీఆర్‌కు మంత్రి పొన్నం వార్నింగ్



హుస్నాబాద్, మే 11: 'పసికూన లాంటి మా ప్రభుత్వాన్ని ఆడిపోసుకోవడమే కాకుండా ప్రభుత్వాన్ని కూలగొట్టాలని చూస్తున్నావు.. విన్నర్ కేసీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టచ్ చేసి చూడు పీకలు ఎగురుతాయ్ జాగ్రత్త' అని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. శనివారం రాత్రి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో విలేకరులతో మంత్రి మాట్లాడారు. 'బాధ్యత గల ప్రతిపక్షంగా వ్యవహరించకుండా బీఆర్ఎస్ దిగజారి ప్రవర్తిస్తోంది. ఇది ప్రజలతో ఎన్నికైన, నియంతృత్వానికి వ్యతిరేకంగా ఏర్పడ్డ ప్రభుత్వం. కోన్ కిస్కాగాళ్లు ఎంతమంది వచ్చినా ఏమీ కాదు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ బోణీ కొడితే కేసీఆర్‌కు అభినందనలు చెబుతా. ఎన్నికలు పూర్తికాగానే గౌరవెల్లి రిజర్వాయర్ పనులకు ప్రాధాన్యమిచ్చి పూర్తి చేస్తాం. నియోజకవర్గంలో ఒక్క ఎకరా బీడు లేకుండా చేయడమే నా ప్రథమ కర్తవ్యం. హుస్నాబాద్ ఆసుపత్రిని 250 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసి మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తాం.. ఈ విషయంలో హరీశ్‌రావు ఆందోళన చెందాల్సి అవసరం లేదు. బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు హుస్నాబాద్ నియోజకవర్గానికి వెంట్రుక మందం పని చేయలేదు. వారికి ఓటడిగే హక్కు లేదు. కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలి' అని కోరారు.

రిజర్వేషన్లు తొలగిస్తామని చెప్పడం రాజ్యాంగ విరుద్ధం

▸▸ జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు కుమారస్వామి

హైదరాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ముస్లిం రిజర్వేషన్లను తొలగిస్తామని బీజేపీ నేతలు, ప్రధాని మోదీ ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధమైనదని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. జాతీయ బీసీదళ్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎన్నికల వేళ మతపరమైన రాజకీయాలు చేయడం సరికాదన్నారు. సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన నినాదాలతో కాంగ్రెస్ దశాబ్దాల నుంచి పనిచేస్తోందన్నారు. ఓట్లు దండుకోవడానికి ప్రధాని స్థాయి వ్యక్తులు మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టడం దేశ సమగ్రతకు మంచిది కాదని పేర్కొన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తగిన తీర్పునిస్తారన్నారు. కార్యక్రమంలో బీసీ నేతలు రాజేష్ ,రమణ, బాలకృష్ణ, సాయి పాల్గొన్నారు.

ఎలా కట్టారు? డిజైన్లు ఎవరివి?

కాళేశ్వరం బ్యారేజీలపై లిఖితపూర్వకంగా నివేదిక ఇవ్వండి

మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లును కోరిన జస్టిస్ పినాకి చంద్రఘోష్

▸▸ దాదాపు గంటపాటు ప్రశ్నల వర్షం

▸▸ విచారణలో కమిషన్‌కు సహాయం అందించేందుకు నిపుణుల కమిటీ



హైదరాబాద్, మే 11(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీలతో పాటు కన్నెపల్లి (మేడిగడ్డ), సిరిపురం (అన్నారం), సుందిళ్ల పంప్‌హౌస్‌ల నిర్మాణానికి సంబంధించి రామగుండం పూర్వ ఈఎన్‌సీ నల్లా వెంక టేశ్వర్లుపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ ప్రశ్నల వర్షం కురిపించారు. శనివారం వెంకటేశ్వర్లును కమిషన్ పిలిపించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో బ్యారేజీలు ఏ విధంగా కట్టారు? ప్లానింగ్ ఏమిటి? డిజైన్లు ఎవరు తయారుచేశారు? నమూనా అధ్యయనాలు చేశారా డిజైన్లకు తగ్గట్లుగానే నిర్మాణం జరిగిందా? బ్యారేజీలు ఈ ప్రాంతంలోనే కట్టాలని చెప్పిందెవరు? నిపుణుల నివేదిక ఉందా? అంటూ దాదాపు గంట పాటు బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో వెంకటేశ్వర్లుపై ప్రశ్నలు సంధించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టాలనుకుంటే రీడిజైన్ పేరుతో మేడిగడ్డలో బ్యారేజీ కట్టడానికి కారణం ఏవిటి? మేడిగడ్డ వద్ద అదనంగా నీటి లభ్యత ఉందా? అని ప్రశ్నించారు. హైడ్రాలజీ నివేదికలు అందించాలని కోరారు. నీటి లభ్యతపై కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) చెప్పిందేంటి? మీరు చేసిందేంటి? బ్యారేజీలు పూర్తయిన సంవత్సరమే తొలి వరదలకే నష్టం గుర్తించినా బ్యారేజీలకు మరమ్మతులు ఎందుకు చేయలేదని అడిగారు. బ్యారేజీల నిర్మాణ పనులు పూర్తికాకముందే పూర్తయినట్లు సర్టిఫికెట్లు ఎలా ఇచ్చారు? డిఫెక్ట్ లయబిలిటీ కాలం పూర్తికాకుండానే బ్యాంకు సెక్యూరిటీ గ్యారంటీలను ఎలా రిలీజ్ చేశారు? డిఫెక్ట్ లయబిలిటీ కాలంలోనే నష్టాలు జరిగినా నిర్మాణ సంస్థలతో మరమ్మతులు ఎందుకు చేయించలేరు? బ్యారేజీల వైఫల్యానికి కారణం ఏంటి? నిర్మాణపరమైన లోపాలా? డిజైన్‌లో లోపాలా? ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) లోపాలా? అని ప్రశ్నించింది. ఐఎస్ కోడ్ ప్రకారం వానాకాలానికి ముందు, తర్వాత బ్యారేజీల స్థితిగతులను పరిశీలించారా? అని ఆరా తీసింది. ప్రతి కాంపోనెంట్‌కు అంశాలవారీగా వెంకటేశ్వర్లు జవాబు ఇవ్వగా లిఖితపూర్వకంగా సమర్పించాలని ఘోష్ నిర్దేశించారు. విచారణలో భాగంగా ఈ నెల 6న రాష్ట్రానికి వచ్చిన ఘోష్ ఆదివారం కోల్‌కతాకు తిరిగి వెళ్లనున్నారు. నెలాఖరున లేదా జూన్ తొలి వారంలో మళ్లీ హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉంది. కాళేశ్వరం బ్యారేజీలపై ఫిర్యాదుల స్వీకరణ ఈ నెల 31 దాకా జరుగనుంది.

స్వతంత్ర కమిటీ ఏర్పాటుకు విజ్ఞప్తి

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లోపాలను వెలికితీయడంతో పాటు వాటికి బాధ్యులను గుర్తించే ప్రక్రియలో స్వతంత్రంగా కమిషన్‌కు సహాయ సహకారాలు అందించేందుకు ప్రత్యేకంగా స్వతంత్ర కమిటీని వేయాలని జస్టిస్ పినాకి చంద్రఘోష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నీటిపారుదల శాఖతో, ఏ రాజకీయ పార్టీ లేదా ఏ సంఘంతో సంబంధం లేని నిపుణులను కమిటీలో నియమించాలని సూచించారు. సివిల్, మెకానికల్, హైడ్రాలజీ, ప్లానింగ్, డిజైన్ వంటి విభాగాలకు చెందిన వారిని కమిటీలో నియమించాలని కోరారు. దాంతో నిపుణులను గుర్తించే పనిలో ప్రభుత్వం పడింది.

భూపాలపల్లిలో బస్టాప్‌లోకి దూసుకెళ్లిన లారీ

▸▸ ఇద్దరి మృతి.. మరో ఇద్దరి పరిస్థితి విషమం

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మే 11: ఇసుక లారీ అదుపు తప్పి బస్టాప్‌లో బస్సు కోసం వేచిచూస్తున్న వారిపైకి దూసుకెళ్లింది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. భూపాలపల్లి లోని మంజూర్‌నగర్‌లో సింగరేణి ఆస్పత్రి ఎదుట శనివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం నుంచి ఇసుక లోడ్‌తో పరకాల వైపు వెళ్తున్న లారీ అదుపు తప్పి సింగరేణి ఆస్పత్రి ఎదుట ఉన్న బస్‌షెల్టర్ వద్ద ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. ఏపీలోని విజయనగరం జిల్లా లక్ష్మీపురానికి చెందిన గవర ముసలనాయుడు (24), మహబూబ్‌నగర్ జిల్లా మూసిపేటకు చెందిన వాకటి సత్యనారాయణ (30) అక్కడిక్కడే మృతి చెందారు. వీరిద్దరూ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బస్వరాజ్‌పల్లి సమీపంలోని సింగరేణిలో ఎస్వీ ఇంజనీరింగ్ కంపెనీలో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వీరితో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ముసలనాయుడు, మరో వ్యక్తి సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు స్వస్థలాలకు వెళ్తూ ప్రమాదం బారిన పడినట్లు తెలిసింది.



సత్యనారాయణ, ముసలనాయుడు (ఫైల్)

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య
దృశ్యం
ఆదివారం
12 మే 2024

మంచి ఐటం సాంగ్ పడితే సినిమాకు స్పెషల్ అట్రాక్షన్. అందుకే అగ్ర దర్శకులు అంతా తమ సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ తప్పనిసరి చేస్తున్నారు. సమంత 'పుష్ప' చిత్రం కోసం 'ఊ అంటావా మావా' సాంగ్‌లో నర్తించాక ప్రత్యేక గీతాలకు మరింత ఊపు వచ్చింది. పలువురు అగ్ర కథానాయికలు సైతం అదే బాటలో నడిచి, ప్రత్యేక గీతాల్లో తమ టాలెంట్ చూపారు. ఇప్పుడు అగ్రహీరోలు నటిస్తున్న పలు చిత్రాల్లో ప్రత్యేక గీతాలు కనువిందు చేయనున్నాయి. అందులో ఆడి పాడే ముద్దుగుమ్మల కోసం చిత్రబృందాలు జరుపుతున్న అన్వేషణలో పలువురు టాప్ హీరోయిన్ల పేర్లు వినిపిస్తున్నాయి.





ప్రత్యేక గీతాలకు పచ్చజెండా

బన్నీ జోడీ ఎవరో



టాప్ హీరోయిన్లతో ఐటం సాంగ్స్ చేయించడం టాలీవుడ్‌లో చాలా కాలంగా నడుస్తోన్న ట్రెండే అయినా ముదురు భామలు, బాలీవుడ్ కథానాయికలు ఆ తరహా గీతాల్లో ఎక్కువ కనిపించేవారు. కానీ ఇప్పుడు మన అగ్ర కథానాయికలు సైతం ప్రత్యేక గీతాలకు పచ్చజెండా ఊపుతున్నారు. దీంతో తమ అభిమాన కథానాయికలను ఐటం సాంగ్స్‌లో చూసి అభిమానులు మురిసిపోతున్నారు.

సమంత 'పుష్ప' చిత్రంలో చేసిన ప్రత్యేకగీతం ఓ సంచలనమే సృష్టించింది. బీట్ పరంగానే కాదు పాటలో సమంత పరువాలను ప్రదర్శించిన తీరు అభిమానులకు షాక్ ఇచ్చింది. ఇప్పుడు 'పుష్ప 2' చిత్రం కోసం మరోసారి అల్లు అర్జున్‌తో ప్రత్యేక గీతంలో సమంత నర్తించబోతున్నారని టాక్.



దర్శకుడు సుకుమార్ తన సినిమాల్లో ప్రత్యేక గీతాలపై ప్రత్యేక శ్రద్ధ పెడతారు. ఇప్పుడు సీక్వెల్‌లో సైతం మాంచి మసాలా సాంగ్‌ను ఆయన తెరకెక్కించబోతున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ అవకాశం మరోసారి సమంతనే వరిస్తుందా లేదా అనేది తెలియాల్సి ఉంది. అలాగే 'పుష్ప 2'లో ఐటం సాంగ్ కోసం బాలీవుడ్ ఐటం బాంబ్ ఊర్వశీ రౌతేలాను రంగంలోకి దించబోతున్నారనే మాట కూడా పరిశ్రమలో వినిపించింది. అయితే ఇప్పుడు ఈ అవకాశం శ్రీలీలను వరించిందంటున్నాయి పరిశ్రమ వర్గాలు. టాలీవుడ్‌లో బన్నీ డాన్స్ టాలెంట్ ఏంటో అందరికీ తెలిసిందే. ఇక హీరోయిన్లలో శ్రీలీల సైతం మొదట్నుంచి తన సినిమాల్లో పాటల్లో తన దూకుడుతో టాలీవుడ్ హీరోలకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. బన్నీ, శ్రీలీల కాంబో గనుక సెట్టయితే ప్రేక్షకులకు ఆ పాట నిజంగానే ప్రత్యేకగీతంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

మరి ఈ అవకాశం సమంత, రౌతేలా, శ్రీలీలలో ఎవరిని వరిస్తుందో తెలియాలంటే కొన్నాళ్లు వేచి చూడాల్సిందే.

వర్షం జంట మళ్లీ

ప్రభాస్ కథానాయకుడిగా ప్రశాంత్‌నీల్ తెరకెక్కించిన 'సలార్' చిత్రం ఘన విజయం అందుకోవడం దానికి రెండో భాగాన్ని తెరకెక్కిస్తున్నట్లు ప్రకటించడం తెలిసిందే. జూన్‌లో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. ఇందులో ప్రశాంత్‌నీల్ ఓ ప్రత్యేకగీతాన్ని ప్లాన్ చేశారట. దీనికోసం పలువురు కథానాయికల పేర్లు వినిపిస్తున్నాయి. 'వర్షం' చిత్రంతో హిట్ కొట్టిన ప్రభాస్, త్రిష జోడీ మరోసారి ఈ ప్రత్యేక గీతంలో మెరవబోతున్నారనే మాట వినిపిస్తోంది. అలాగే బాలీవుడ్ అగ్ర కథానాయిక కియారా అద్వాణీ పేరు ప్రచారంలో ఉంది. అయితే ఆమె ఇందులో కథానాయికగా నటిస్తున్నారనీ, అలాంటిదేం లేదు ప్రత్యేక గీతం మాత్రమే చేస్తున్నారంటూ ప్రచారం జరుగుతోంది. త్రిష, కియారాల్లో ఎవరికి ఈ అవకాశం దక్కుతుందో చూడాలి.

ఐటం సాంగ్‌తో కోలీవుడ్ ఎంట్రీ?

కోలీవుడ్ స్టార్ విజయ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'గోట్ (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్)'. వెంకట్ ప్రభు దర్శకుడు. మీనాక్షి చౌదరి కథానాయిక. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. ఇందులో టాలీవుడ్ హీరోయిన్ శ్రీలీల ప్రత్యేక గీతంలో నర్తించనున్నట్లు కోలీవుడ్ టాక్. విజయ్ మంచి డాన్సర్ కావడంతో ఆయన ఎనర్జీని మ్యాచ్ చేయడం శ్రీలీలకు మాత్రమే సాధ్యమని అభిమానులు అంటున్నారు. మరి టాలీవుడ్‌లో ఫుల్ బిజీగా ఉన్న శ్రీలీల ఈ ఆఫర్‌కు ఎస్ చెబుతారా లేదా అనేది వేచిచూడాలి. పైగా ఇప్పటివరకూ శ్రీలీల తమిళ చిత్రం చేయలేదు. మరి ఐటం సాంగ్‌తో తమిళ ఎంట్రీకి శ్రీలీల సిద్ధపడతారా అనేది డౌటే. వరుస విజయాలతో జోరుమీదున్నారు హీరోయిన్ సంయుక్త. ఆమెను సైతం 'గోట్' చిత్రబృందం ప్రత్యేక గీతం కోసం సంప్రదించిందట. భారీ పారితోషికం ఆఫర్ చేసినా కానీ సంయుక్త నో చెప్పారని కోలీవుడ్ టాక్.







పూజా ప్రత్యేకంగా కనిపిస్తారా?

కొన్నాళ్లపాటు టాలీవుడ్‌లో అగ్ర కథానాయికగా తిరుగులేని హవా కొనసాగించారు పూజాహెగ్డే. ఇక్కడ వరుసగా సినిమాలు ఫ్లాప్ అవ్వడంతో గ్యాప్ వచ్చింది. ప్రస్తుతం బాలీవుడ్‌లో సినిమాలు చేస్తున్నారు. అయితే ఎన్టీఆర్ కథానాయకుడిగా నటిస్తున్న 'దేవర' చిత్రంలో పూజాహెగ్డే స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలవబోతున్నారని సమాచారం. మరి 'దేవర'తో పూజ మళ్లీ తెలుగు తెరపై కనిపిస్తారో లేదో చూడాలి. పవన్ కల్యాణ్ 'ఓజీ', నాని 'సరిపోదా శనివారం' చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్నారు ప్రియాంక మోహన్. హీరోయిన్‌గా ఎక్కడా హద్దులు దాటకుండా ఒద్దికగా కనిపించే ఈ అమ్మడు సైతం ఇప్పుడు ఓ ప్రత్యేక గీతానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ధనుష్ హీరోగా రూపొందుతున్న తమిళ చిత్రం 'ఎన్నోల్ ఎన్నడీ కోబం' సినిమాలో స్పెషల్ సాంగ్‌లో ప్రియాంక మోహన్ కనిపించనున్నారు.

టాలీవుడ్‌లో అవకాశాలు తగ్గడంతో ప్రస్తుతం బాలీవుడ్‌పై ఫోకస్ పెట్టి సినిమాలు, వెబ్ సిరీస్‌లతో కాలం గడుపుతున్నారు తమన్నా. రజనీకాంత్ నటించిన 'జైలర్' చిత్రంలో 'నువ్వే కావలయ్యా...'అంటూ సాగే ప్రత్యేక గీతంలో ఒద్దికగా అందాల విందు చేశారు. ఇప్పుడు మరో ప్రత్యేక గీతానికి ఆమె ఓకే చెప్పారు. రాజ్‌కుమార్ రావు హీరోగా రూపొందుతున్న హిందీ చిత్రం 'స్త్రీ 2'లో ఆమె ప్రత్యేక గీతంలో మెరవబోతున్నారు.

కరీనాకు కోర్టు నోటీసు



బాలీవుడ్ హీరోయిన్ కరీనా కపూర్ ఓ వివాదంలో చిక్కుకున్నారు. ఆమె రాసిన 'కరీనా కపూర్స్ ప్రెగ్నెన్సీ బైబిల్' అనే బుక్ టైటిలే ఇందుకు కారణం. ఈ టైటిల్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ క్రిస్టోఫర్ ఆంటోని అనే ఓ వ్యక్తి మధ్యప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో మధ్యప్రదేశ్ హై కోర్టు ఆమె నుంచి వివరణ కోరుతూ శనివారం ఆమెకు లీగల్ నోటీసు జారీ చేసింది. అలాగే, ఈ పుస్తకాల అమ్మకాలపై నిషేధం విధించాలని క్రిస్టోఫర్ కోరగా, ప్రచురణ సంస్థకూ కోర్టు నోటీసు జారీ చేసింది. "క్రైస్తవులకు అత్యంత పవిత్ర గ్రంథమైన 'బైబిల్'ను మహిళల ప్రెగ్నెన్సీ విషయంలో వాడటం సముచితం కాదు. ఇది క్రైస్తవ మత విశ్వాసాలను, సెంటిమెంట్లను కించపరిచేలా ఉంది. పబ్లిసిటీ కోసమే కరీనా కపూర్ ఇలాంటి పనులు చేశారు" అని క్రిస్టోఫర్ పిటిషన్‌లో ఆరోపించారు. కాగా, కరీనా 2021లో ఈ పుస్తకాన్ని రాశారు. ఇందులో ప్రెగ్నెన్సీ దశలో తను ఎదుర్కొన్న అనుభవాలతో పాటు ఆ సమయంలో ఆడవారు ఎదుర్కొనే సమస్యలకు తగిన పరిష్కారాలు, జాగ్రత్తలు సూచించారు.

అంచనాలను భారీగా దెబ్బ తీసిన షాన్



ధర్మేంద్ర, అమితాబ్ బచ్చన్ నటించిన 'షోలే' చిత్రం ఘన విజయం సాధించి, బాక్సాఫీసు చరిత్రను తిరగరాసింది. ఈ చిత్రవిజయంతో ఉత్సాహాన్ని తెచ్చుకున్న దర్శకుడు రమేశ్ సిప్పీ నాలుగేళ్ల గ్యాప్ తీసుకుని తన తదుపరి చిత్రం 'షాన్'ను ప్రారంభించారు. జేమ్స్‌బాండ్ తరహా చిత్రాన్ని హిందీలో తీయాలని ఆయన ఖర్చు విషయంలో వెనుకాడలేదు. 'షోలే' చిత్ర నిర్మాణ వ్యయం రూ 3 కోట్లు అయితే, దానికి రెట్టింపు బడ్జెట్‌తో 'షాన్' చిత్రాన్ని రూపొందించారు. అప్పట్లో రూ. ఆరు కోట్లు అంటే బాలీవుడ్‌లో అదే హయ్యెస్ట్ బడ్జెట్. అమితాబ్ బచ్చన్, సునీల్ దత్, శశి కపూర్, శత్రుఘ్న సిన్హా, రాఖీ, పర్వీన్ బాబీ, బిందియా గోస్వామి, కుల్‌భూషణ్ కర్బందా.. ఇంత మంది నటీనటులు నటించినా కథలో విషయం లేకపోవడంతో 'షాన్' బాక్సాఫీసు వద్ద బోల్తా పడింది. 1980లో విడుదలైన ఈ చిత్రంతో కోట్లాది రూపాయల వసూళ్లు వస్తాయని ఆశపడిన రమేశ్ సిప్పి కేవలం రూ. 8 కోట్ల కలెక్షన్లతోనే సరిపుచ్చుకోవాల్సిన వచ్చింది.

నా వృత్తిని గౌరవించాలి



'ద క్రూ' చిత్రంతో 2024ను సూపర్ హిట్‌తో ఆరంభించారు కృతి సనన్. కరీనా కపూర్, కృతి సనన్, టబూ నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించింది. ఈ మూవీ సక్సెస్ జోష్‌ను ఆస్వాదిస్తున్న కృతి.. ఇటీవలే ఆంగ్ల మీడియాతో ముచ్చటించి పలు విషయాలపై ఆసక్తికర కామెంట్స్ చేశారు.


"ఇండస్ట్రీలో మగవారికి, ఆడవారికి రెన్యుమరేషన్ విషయంలో చాలా వ్యత్యాసం ఉంటోంది. పదేళ్లుగా హిట్ లేని నటుడికి కూడా ఈ విషయంలో పదింతల రెన్యుమరేషన్ ఎందుకిస్తున్నారో అర్థం కాని విషయం. ఇందుకు గల కారణాన్ని బడ్జెట్ రికవరీ అని నిర్మాతలు అంటుంటారు. మేల్ యాక్టర్స్ వల్ల శాటిలైట్, డిజిటల్ రైట్స్ ఎక్కువ పలుకుతాయని నిర్మాతల అభిప్రాయం. అందుకే మహిళలే ప్రధాన పాత్రధారులుగా సాగే సినిమాల్లో బడ్జెట్ విషయంలో నిర్మాతలు సంకోచిస్తుంటారు. 'ది క్రూ' సినిమా బడ్జెట్ విషయంలోనూ ఇదే జరిగింది. ఇకపోతే పెళ్లి ఎప్పుడని అందరూ అడుగుతున్నారు. నా జీవితంలోకి భర్తగా వచ్చే వ్యక్తి నన్ను అర్థం చేసుకోవాలి. జీవిత భాగస్వామిగా నా వృత్తిని గౌరవించాలి. నిజాయితీగా ఉంటూనే నవ్వించాలి, ఎక్కువ సమయం నాతోనే గడపాలి. అలా అని అన్ని విషయాల్లో నాతో సరితూగాలనే పట్టింపులు లేవు. నిరంతరం ప్రేమను చూపిస్తూ బాగా చూసుకుంటే చాలు" అని చెప్పారు. ప్రస్తుతం ఆమె 'దో పత్తి' అనే క్రైమ్ థ్రిల్లర్‌లో నటిస్తున్నారు. ఈ సినిమాతో ఆమె నిర్మాతగానూ మారుతుండటం విశేషం.

'బాహుబలి' నిర్మాతల యక్షిణి

'బాహుబలి' చిత్రాన్ని అందించిన ఆర్కా మీడియా వర్క్స్ సంస్థ అధినేతలు శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని తాజాగా 'యక్షిణి' పేరుతో ఓ వెబ్ సిరీస్ నిర్మిస్తున్నారు. వేదిక, మంచు లక్ష్మి, రాహుల్ విజయ్, అజయ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ సిరీస్‌కు తేజ మార్ని దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటి వరకూ వచ్చిన సోషియో ఫాంటసీ సినిమాలు, వెబ్ సిరీస్‌కు భిన్నమైన కాన్సెప్ట్‌తో 'యక్షిణి' ని రూపొందించినట్లు దర్శకుడు చెప్పారు. తెలుగు సహా తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ద్వారా స్ట్రీమింగ్ కానుంది.



గుండమ్మ కథ.. ముందడుగు





అగ్ర కథానాయకులు ఎన్టీఆర్, ఏయన్నార్ హీరోలుగా విజయా ప్రొడక్షన్స్ నిర్మించిన అద్భుత సాంఘిక చిత్రం 'గుండమ్మ కథ'. ఇది ఎన్టీఆర్‌కు నూరవ సినిమా, అక్కినేనికి 99 వ చిత్రం కావడం విశేషం. సావిత్రి, జమున కథానాయికలుగా నటించారు. అగ్ర హీరోలకు తండ్రిగా ఎస్వీ రంగారావు నటించారు. ఇద్దరు అగ్ర కథానాయకులు నటించిన చిత్రానికి వారి పరంగా టైటిల్ పెట్టకుండా, సినిమాలో కీలక పాత్ర పోషించిన సూర్యకాంతం పాత్రను హైలైట్ చేస్తూ 'గుండమ్మ కథ' అని పేరు పెట్టడం చిత్ర నిర్మాతలలో ఒకరైన చక్రపాణి చేసిన చమత్కారం. అందుకు అభ్యంతరం చెప్పకపోవడం ఎన్టీఆర్, ఏయన్నార్ సంస్కారం.


'గుండమ్మ కథ' చిత్రం తర్వాత మళ్లీ అంతగా రూపుదిద్దుకున్న మరో మల్టీస్టారర్ 'ముందడుగు'. ఇందులో కృష్ణ, శోభన్‌బాబు హీరోలుగా నటించారు. అప్పటికే వారిద్దరూ టాప్ పొజిషన్‌లో ఉన్నారు. అందుకే సినిమాలో ఒకరి పాత్ర ఎక్కువ, మరొకరి పాత్ర తక్కువ అని లేకుండా రెండూ సమానస్థాయి కలిగి ఉంటాయి. ఈ విషయంలో రచయితలు పరచూరి బ్రదర్స్ ప్రతిభను ప్రశంసించాలి. వారి మాటలు తూటాల్లా పేలాయి. సురేశ్ సంస్థలో 'ముందడుగు' వారికి తొలి సినిమా.

ఈ చిత్రంలో కోటీశ్వరుడైన చక్రవర్తిగా శోభన్‌బాబు, లారీ డ్రైవర్ బాలగంగాధర తిలక్‌గా కృష్ణ నటించారు. అద్భుతంగా నటించి ఆ పాత్రలకు న్యాయం చేకూర్చారు. కృష్ణ కు అద్భుతమైన డైలాగులు, శోభన్‌బాబుకి మంచి పాటలు కుదిరాయి. హీరోయిన్లుగా జయప్రద, శ్రీదేవి నటించారు. అయితే జయప్రద కంటే శ్రీదేవి పాత్రే ఈ సినిమాలో హైలైట్ అయింది.

కథ మీద, కథనం మీద నిర్మాత రామానాయుడు, దర్శకుడు కె.బాపయ్య ప్రత్యేక దృష్టి పెట్టి, ఇద్దరి హీరోల అభిమానులను సంతృప్తి పరుస్తూ ఆద్యంతం ఆసక్తికరంగా సినిమా తీశారు.

18 కేంద్రాల్లో వంద రోజులు, 6 కేంద్రాల్లో 25 వారాలు ఆడింది 'ముందడుగు' చిత్రం. అంతేకాదు మల్టీస్టారర్ చిత్రాల్లో గోల్డెన్ జూబ్లీ జరుపుకొన్న ఏకైక చిత్రం ఇదే.

వెబ్ సిరీస్‌లో రామ్ పోతినేని



వరుస చిత్రాలు చేస్తూనే ఓ వైపు వెబ్ సిరీస్‌లకూ ఓటేస్తున్నారు కథానాయకులు. తాజాగా ఆ లిస్ట్‌లోకి ఎనర్జిటిక్ హీరో రామ్ పోతినేని చేరేలా ఉన్నారు. ఆయన ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో 'డబుల్ ఇస్మార్ట్' సినిమా చేస్తున్నారు. ఇది 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌ను అందుకున్న 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్. ఈ సినిమా తరువాత రామ్ ఏ సినిమాలో నటిస్తారనేది తెలియాల్సి ఉంది. అయితే రామ్ తదుపరి నటించబోయేది వెబ్ సిరీస్‌లో అని తెలుస్తోంది. ఈ వెబ్ సిరీస్‌ను నెట్‌ఫ్లిక్స్ నిర్మించనుందని.. ప్రస్తుతం దీనికి సంబంధించిన చర్చలు జరుగుతున్నాయనే టాక్ వినిపిస్తోంది. త్వరలోనే ఈ వెబ్ సిరీస్ గురించి అధికారిక ప్రకటన వెలువరించి..వచ్చే ఏడాది సెట్స్‌పైకి తీసుకెళ్దామనుకుంటున్నారట.

ఫిల్మ్ స్టార్‌గా అనన్య



బాలీవుడ్ చిత్రం 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్' చిత్రంతో సినిమాల్లో అడుగుపెట్టారు అనన్య పాండే. ఆ తర్వాత పలు బాలీవుడ్ చిత్రాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ నటించిన 'లైగర్'తో తెలుగులోనూ సందడి చేశారు. ప్రస్తుతం 'కంట్రోల్', 'శంకర' వంటి వరుస చిత్రాలతో జోరు మీదున్న ఆమె.. మరో చిత్రంలోనూ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. విక్కీ కౌశల్, 'యానిమల్' బ్యూటీ త్రిప్తి దిమ్రి ఇందులో నటిస్తున్నారు. ఈ సినిమాలో అనన్య ఫిల్మ్ స్టార్‌గా కనిపించనున్నారు. ఇటీవలే ఈ పాత్ర షూటింగ్‌లో కూడా ఆమె పాల్గొన్నారు. ఆనంద్ తివారీ ఈ సినిమాకు దర్శకుడు. కరణ్ జోహార్ నిర్మిస్తున్న ఈ చిత్రం జూలై 19న విడుదలవుతోంది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి

హైదరాబాద్ ● ఆదివారం 12 మే 2024
diksuchi@andhrajyothy.com

నిమ్‌హాన్స్‌లో బీఎస్సీ, డిప్లొమా

బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ (నిమ్‌హాన్స్)- బీఎస్సీ, పోస్ట్ బేసిక్ డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బీఎస్సీ ప్రోగ్రామ్‌లలో ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా; మిగిలిన ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్ కమిటీ నిర్ణయం ప్రకారం ప్రవేశాలు కల్పిస్తారు.

బీఎస్సీ ఇన్ నర్సింగ్

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. తరవాత ఏడాది ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఆలిండియా కేటగిరీలో 35 సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

బీఎస్సీ ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ

- ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. తరవాత ఏడాది ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఆలిండియా కేటగిరీలో నాలుగు సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. లేదా డయాగ్నస్టిక్ రేడియోగ్రఫీ స్పెషలైజేషన్‌తో డిప్లొమా పూర్తిచేసి ఉండాలి.

బీఎస్సీ ఇన్ అనెస్తీషియా టెక్నాలజీ

- ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఏడాది ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఆలిండియా కేటగిరీలో నాలుగు సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** సైన్స్ గ్రూప్‌తో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి.

బీఎస్సీ ఇన్ క్లినికల్ న్యూరోఫిజియాలజీ టెక్నాలజీ

- ఇది మూడేళ్ల ప్రోగ్రామ్. తరవాత ఏడాది ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఆలిండియా కేటగిరీలో రెండు సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** సైన్స్/మేథ్స్ గ్రూప్‌తో ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.



ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు

- ఇందులో 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం గంటన్నర. పరీక్ష కేంద్రం బెంగళూరు.

పోస్ట్ బేసిక్ డిప్లొమా

- ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇందులో రెండు స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. సైకియాట్రిక్/మెంటల్ హెల్త్ నర్సింగ్‌లో 45 సీట్లు, న్యూరోసైన్సెస్ నర్సింగ్‌లో 9 సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** స్టేట్ నర్సింగ్ కౌన్సిల్‌లో నర్సుగా గుర్తింపు పొంది ఉండాలి. స్టాఫ్ నర్సుగా ఏడాది అనుభవం తప్పనిసరి.

సర్టిఫికెట్ కోర్స్ ఇన్ న్యూరోపాథాలజీ టెక్నాలజీ

- ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** డీఎంఎల్‌టీ ఉత్తీర్ణతతోపాటు ఏడాది అనుభవం ఉండాలి. బీఎస్సీ(ఎంఎల్‌టీ/లైఫ్‌సైన్సెస్) ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- 2024 సెప్టెంబరు 1 నాటికి అభ్యర్థి వయసు: బీఎస్సీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. సర్టిఫికెట్ కోర్సులో ప్రవేశానికి 40 ఏళ్లు మించకూడదు. పోస్ట్ బేసిక్ డిప్లొమాలో ప్రవేశానికి వయోపరిమితి నిబంధనలు లేవు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750; దివ్యాంగులకు ఫీజు లేదు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 6
- **బీఎస్సీలో ప్రవేశానికి ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూలై 21
- **ఫలితాలు విడుదల:** జూలై 27
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 27
- **బీఎస్సీ, సర్టిఫికెట్ కోర్సుల అడ్మిషన్స్:** ఆగస్టు 1
- **డిప్లొమా కోర్సుల అడ్మిషన్స్:** ఆగస్టు 2
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** సెప్టెంబరు 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.nimhans.ac.in

తెలంగాణ మోడల్ స్కూళ్లలో ఇంటర్ అడ్మిషన్స్

తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్స్/జూనియర్ కాలేజెస్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 194 మోడల్ స్కూళ్లలో ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూప్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రతి మోడల్ స్కూల్‌లో గ్రూప్‌నకు 40 సీట్లు ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. పూర్తి సమాచారం కోసం ప్రాంతాలవారీగా ఉన్న మోడల్ స్కూళ్ల వెబ్‌సైట్లను చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 25
- **వెబ్‌సైట్:** www.tsmodelschools.com

ఐఐహెచ్‌టీలో డిప్లొమా

సేలంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ)- 'డిప్లొమా(హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. రెగ్యులర్, లేటరల్ ఎంట్రీ విధానాల్లో అడ్మిషన్స్ ఇస్తారు. లేటరల్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు. రెగ్యులర్ ప్రోగ్రామ్‌లో 47 సీట్లు, లేటరల్ ఎంట్రీలో 24 సీట్లు చొప్పున మొత్తం 71 సీట్లు ఉన్నాయి. 20 శాతం సీట్లను నేత కార్మికుల వర్గాలకు కేటాయించారు.

సంస్థలు-సీట్లు

- ఐఐహెచ్‌టీ, సేలం(తమిళనాడు)- రెగ్యులర్ 30, లేటరల్ ఎంట్రీ 7
- కేహెచ్‌టీఐ, గదగ్(కర్ణాటక)- రెగ్యులర్ 8, లేటరల్ ఎంట్రీ 9
- ఐఐహెచ్‌టీ, కన్నూరు(కేరళ)- రెగ్యులర్ 5, లేటరల్ ఎంట్రీ 4
- ఎస్‌పీకేఎం ఐఐహెచ్‌టీ, వెంకటగిరి(ఆంధ్రప్రదేశ్)- రెగ్యులర్ 4, లేటరల్ ఎంట్రీ 4

అర్హత

- రెగ్యులర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లీష్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. 2024 జూలై 1 నాటికి జనరల్ అభ్యర్థులకు వయసు 23 ఏళ్లు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు మించకూడదు.
- లేటరల్ ఎంట్రీకి మేథ్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్ ఉత్తీర్ణులు; ఇంటర్‌తో పాటు రెండేళ్ల ఐటీఐ కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతితోపాటు రెండేళ్ల ఐటీఐ ఉత్తీర్ణులు; టెక్స్‌టైల్ విభాగంలో ఇంటర్ ఒకేషనల్ కోర్సు పూర్తిచేసినవారు కూడా అర్హులే. వీరు మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులలో ఐఐహెచ్‌టీ నిర్వహించే బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేయాల్సి ఉంటుంది. 2024 జూలై 1 నాటికి జనరల్ అభ్యర్థుల వయసు 25 ఏళ్లు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 27 ఏళ్లు మించకూడదు.

స్టయిపెండ్

- అడ్మిషన్ పొందిన వారికి నెలకు రూ.2500ల స్టయిపెండ్ ఇస్తారు. ఇందులో 50 శాతాన్ని ఐఐహెచ్‌టీ, మిగిలిన 50 శాతాన్ని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తాయి.


ముఖ్య సమాచారం

- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూన్ 5
- **వెబ్‌సైట్:** iiht-salem.edu.in



ఏపీ ఏకలవ్య గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలు

గుంటూరు జిల్లా-తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఏపీటీడబ్ల్యూఆర్ఈఐఎస్)- పదకొండో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 19 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఎటువంటి ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. పదో తరగతి మార్కుల ఆధారంగా ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈపీ గ్రూప్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఈఎంఆర్ఎస్ విద్యార్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. సీట్లు మిగిలిన పక్షంలో మాత్రమే ఇతరులకు అవకాశం కల్పిస్తారు. బోధన, వసతి ఉచితం. అభ్యర్థుల ఆసక్తి మేరకు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు సంబంధించి ప్రత్యేక శిక్షణ అందిస్తారు.



సీట్ల వివరాలు

ప్రతి ఈఎంఆర్ స్కూల్లో గ్రూప్‌నకు 30 సీట్లు ఉన్నాయి. ఒక్కో గ్రూప్‌లో 570 సీట్లు చొప్పున మొత్తం 1,710 సీట్లు ఉన్నాయి. వీటిలో 80 శాతం సీట్లను ఎస్టీ అభ్యర్థులకు ప్రత్యేకించారు. మిగిలిన సీట్లను రిజర్వ్‌డ్ వర్గాలు, అనాథలు, వితంతువుల పిల్లలు, దివ్యాంగుల పిల్లలకు కేటాయించారు.

గ్రూప్‌లు-సబ్జెక్టులు

ఎంపీసీ సబ్జెక్టులు: ఇంగ్లీష్, ఫిజిక్స్ కెమిస్ట్రీ, మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్/బయాలజీ/హిందీ/రీజనల్ లాంగ్వేజ్/ఏదేని ఇతర సబ్జెక్ట్

బైపీసీ సబ్జెక్టులు: ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ సైన్స్/హిందీ/రీజనల్ లాంగ్వేజ్/ఏదేని ఇతర సబ్జెక్ట్

హ్యూమానిటీస్ సబ్జెక్టులు: ఇంగ్లీష్, హిస్టరీ; ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, హిందీ నుంచి రెండు సబ్జెక్టులు; రీజనల్ లాంగ్వేజ్/ఏదేని ఇతర సబ్జెక్టు

అదనంగా ఆరో సబ్జెక్టు కింద ఈఎంఆర్ఎస్ అందిస్తున్న వాటిలో ఒకదాన్ని ఎంచుకోవచ్చు.

ఎంపిక

- ఎంపీసీ గ్రూప్‌లో ప్రవేశానికి పదోతరగతిలో సాధించిన టోటల్ మార్కులు; సైన్స్, మేథమెటిక్స్‌లో సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు.
- బైపీసీ గ్రూప్‌లో ప్రవేశానికి పదోతరగతిలో సాధించిన టోటల్ మార్కులు, సైన్స్ మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 18
- **వెబ్‌సైట్:** www.aptwgurukulam.ap.gov.in

జాబ్ కార్నర్

టీహెచ్ఎస్‌టీఐలో ప్రాజెక్ట్ రీసెర్చ్ స్టాఫ్

ఫరీదాబాద్(హరియాణా)లోని ప్రభుత్వరంగ సంస్థకు చెందిన ట్రాన్స్‌లేషనల్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్(టీహెచ్ఎస్‌టీఐ)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 6

పోస్టుల వివరాలు

1. ప్రాసెస్ డెవలప్‌మెంట్ సైంటిస్ట్: 1 పోస్టు
2. సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్: 1 పోస్టు
3. ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్-1: 2 పోస్టులు
4. ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్-2: 1 పోస్టు
5. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-3: 1 పోస్టు

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
దరఖాస్తు ఫీజు: ఎస్సీ/ఎస్టీ/మహిళలు/దివ్యాంగ అభ్యర్థులకు రూ.118. ఇతరులకు రూ.236. **ఎంపిక :** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
దరఖాస్తు చివరి తేదీ: మే 23
వెబ్‌సైట్: https://thsti.res.in/

సీఎంఎస్ఎస్‌లో ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్స్

సీఎంఎస్ఎస్ ప్రధాన కేంద్రం, సీఎంఎస్ఎస్ వేర్‌హౌస్‌లలో ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ ఇండియా లిమిటెడ్(బెసిల్) దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

మొత్తం ఖాళీలు: 13

పోస్టుల వివరాలు

1. ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్(అడ్మినిస్ట్రేషన్/ప్రొక్యూర్‌మెంట్/లాజిస్టిక్స్ అండ్ సప్లయి చైన్/క్వాలిటీ అస్యూరెన్స్/ఫైనాన్స్): 11 పోస్టులు
2. జూనియర్ ఫార్మసిస్ట్: 2 పోస్టులు


అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 50 సంవత్సరాలు మించకూడదు
జీతం: నెలకు రూ.30,000
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మే 14
వెబ్‌సైట్: https://www.becil.com/vacancies

ఎన్‌హెచ్‌పీసీలో అప్రెంటిస్‌లు


చంపావత్(ఉత్తరాఖండ్)లోని నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ప్రయివేట్ లిమిటెడ్(ఎన్‌హెచ్‌పీసీ)... కింద పేర్కొన్న ట్రేడ్‌లలో అప్రెంటిస్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 64

పోస్టు: ట్రేడ్ అప్రెంటిస్
ట్రేడులు: సీవోపీఏ, వెల్డర్, స్టెనోగ్రాఫర్ అండ్ సెక్రటేరియల్ అసిస్టెంట్, ప్లంబర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్, వైర్‌మ్యాన్, టర్నర్, మెషినిస్ట్.
అర్హత: 10వ తరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ 2019, 2020, 2021, 2022, 2023, 2024 ఏడాదిలో ఉత్తీర్ణులై ఉండాలి.
శిక్షణ వ్యవధి: ఏడాది
వయోపరిమితి: 18-25 సంవత్సరాల మధ్య ఉండాలి
ఎంపిక ప్రక్రియ: ఐటీఐలో సాధించిన మార్కులు తదితరాల ఆధారంగా



ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మే 30
దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: జూన్ 6
వెబ్‌సైట్: https://www.nhpcindia.com/welcome/job.htm



తగిన బుద్ధి

ఒక పట్టణంలో రాజు అనే ఓ వ్యక్తి ఉండేవాడు. అతడికి పల్లెలంటే ఇష్టం. ఎక్కడికి వెళ్లినా చేపలు పట్టడం అతనికి అలవాటు. ఎవరినీ లెక్క చేసేవాడు కాదు. చేపలు పట్టడం కోసం మంచి నీటి కుంట అయినా మడుగు అయినా విపరీతంగా పాడు చేసేవాడు. రాళ్లు వేసేవాడు. చెట్ల కొమ్మలు వేసేవాడు. ఇలా అతనికి చేయటం అతనికి సరదా.


ఒకరోజు తన పట్టణానికి దూరంగా యాభై కిలోమీటర్లు కారులో వెళ్లాడు. అక్కడ చిన్న వాగులు, వంకలు ఉన్నాయి. అక్కడ చేపలు పట్టాడు. ఆ తర్వాత ఒక మంచి నీటి కుంట దగ్గరకు వెళ్లాడు. అక్కడ చేపలు రుచిగా ఉంటాయని దారిన వెళ్లేవారు చెప్పారు. దీంతో అక్కడే కూర్చున్నాడు. ఎర తీసుకుని చేపలు పట్టడం ప్రారంభించాడు. ఒక్క చేప కూడా పడలేదు. దీంతో చాలా కోప్పడ్డాడు. తనలాంటి గొప్ప ఫిషర్‌మాన్‌కే చేపలు దొరకటం అవమానమే? అనుకున్నాడు మనసులో. మళ్లీ ప్రయత్నించాడు. చేపలు దొరకలేదు. ఎప్పటిలానే అప్రయత్నంగా ఆ మంచి నీటి కుంటలో కాళ్లు పెట్టాడు. మట్టి పైకి వచ్చినా అలానే నడిచాడు. చెట్ల కొమ్మలు, బండరాళ్లు అందులోకి వేశాడు.

చెట్లకొమ్మలు వేస్తున్నప్పుడు దారింటా ఓ రైతు చూశాడు. 'నువ్వు ఎవరివి? ఎందుకు ఇలా చేస్తున్నావు? ఇది పద్ధతి కాదు. ముందు దీన్ని శుభ్రం చేయి' అన్నాడు. 'నువ్వెరు చెప్పటానికి?' అని అడిగాడు. 'నేను ఈ ఊరివాన్ని. మంచి నీళ్లు ఇలా గలీజు పడుతున్నాయంటే ఊరుకుంటానా?' అన్నాడు. 'నేను చేపలు పట్టడానికి వచ్చాను. ఇక్కడి మంచి నీటి కుంటలో చేపలు రుచిగా ఉంటాయని విన్నాను' అన్నాడు. 'ఈ చిన్న కుంటను మేం జాగ్రత్తగా చూసుకుంటాం. అయినా నువ్వు ఇలా ఎందుకు చేశావు?' అని అడుగుతుంటే.. అవేమీ పట్టించుకోకుండా నీళ్లను మరింత మురికి చేశాడు. రైతు కోపంతో తిట్టుకుంటూ వెళ్లిపోయాడు. ఇతను మళ్లీ చేపలు పట్టడంలో నిమగ్నమయ్యాడు.

పదే పది నిమిషాల్లో ఆ రైతు ఇద్దరు వస్తాదుల్ని తీసుకొచ్చాడు. వారు చూడటానికి 'ఎముకలు సున్నం' చేసేవారిలా ఉన్నారు. వెంటనే చేపలు పట్టడం ఆపేసి ఆ రైతు కాళ్లా వేళ్లా పడ్డాడు. 'నేను చేసింది తప్పే. క్షమాపణలు' అని చెప్పాడు. క్షణాల్లో ఆ దరిదాపుల్లో లేకుండా కారులో వెళ్లిపోయాడు. 'ఇలాంటి వారికి తగిన బుద్ధి చెబితే కానీ అర్థం కాదు' అన్నాడా రైతు.


సరైన నీడ ఏది?





10 తేడాలు గుర్తించండి





డైలీ సుడోకు - 305

	9					6	3	
5								2
			9			5		7
	6		2					8
4		8	7		6	9		5
2					1		6	
9		1			3			
6								3
	3	2					5	

సుడోకు - 304 సమాధానం

6	1	4	3	5	9	7	2	8
3	5	2	7	8	1	4	6	9
7	9	8	6	2	4	3	5	1
1	3	6	8	9	7	5	4	2
2	8	7	5	4	3	1	9	6
9	4	5	2	1	6	8	7	3
8	2	1	4	6	5	9	3	7
5	7	9	1	3	2	6	8	4
4	6	3	9	7	8	2	1	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.